ఉక్రెయిన్‌పై తీర్మానానికి భారత్ దూరం

- మరో 31 దేశాలు కూడా...
- అనుకూలం 141, వ్యతిరేకం 7

లోపలి పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 204 | విజయవాడ, శనివారం 25 ఫిబ్రవరి 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 25 February 2023 | Rs

దక్షిణాఫ్రికా మహిళల సంచలనం

- సెమీస్‌లో ఇంగ్లండ్‌పై ఆరు పరుగుల తేడాతో గెలుపు
- 26న ఆసీస్‌తో ఢీ

లోపలి పేజీలో..

గవర్నర్‌గా అబ్దుల్ నజీర్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

యూనిట్ @ రూ.50

- విక్రయాలకు జెన్‌కోలకు కేంద్ర ఇఆర్‌సి అనుమతి
- డిస్కమ్‌లపై పెను భారం
- వినియోగదారులకు భారీ షాక్

న్యూఢిల్లీ : కరెంటు వాడకుండానే షాక్ కొట్టే రోజులు రానున్నాయి. ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి సంస్థల ఒత్తిడికి లొంగి విద్యుత్ విక్రయాల రేటును భారీగా పెంచడానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే దీనికి కారణం. ఫలితంగా డిస్కమ్‌లు భారీ మొత్తం ఖర్చు చేసి విద్యుత్‌ను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ట్రూ అప్ ఛార్జీల పేరుతోనో, మరో పేరుతోనో ఆ భారాన్ని అంతిమంగా ప్రజానీకంపై మోపుతున్న సంగతి తెలిసిందే! కేంద్ర విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ (సిఇఆర్‌సి) తాజాగా తీసుకున్న నిర్ణయం ప్రకారం యూనిట్ విద్యుత్‌ను 50 రూపాయలకు డిస్కమ్‌లు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ మేరకు ప్రస్తుతం ఉన్న 12 రూపాయల గరిష్టధర పరిమితిని ఎత్తివేసింది. 50 రూపాయల వరకు విక్రయించుకోవచ్చని ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్‌కు అనుమతిచ్చింది. రాష్ట్రంలో ప్రస్తుతం గరిష్టంగా 12 రూపాయలకు యూనిట్ విద్యుత్ ను డిస్కామ్‌లు కొనుగోలు చేస్తున్నాయి. అదే సమయంలో నెలకు 30 యూనిట్లు లోపు కాల్చే నిరుపేద వినియోగదారులు యూనిట్‌కు రూ.1.90 చెల్లిస్తున్నారు. నెలకు 400 యూనిట్లు కాల్చే ఉన్నత మధ్యతరగతి, సంపన్నులు యూనిట్‌కు రూ.9.75 వంతున బిల్లు కడుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే యూనిట్ విద్యుత్‌ను 50 రూపాయలకు కొనాల్సివస్తే వినియోగదారులకు బిల్లుల రూపంలో తగిలే షాక్ ఏ స్థాయిలో ఉంటుందో ఊహించుకోవచ్చు. దిగుమతి చేసుకునే బొగ్గు, గ్యాస్ ఆధారిత ప్లాంట్లతో పాటు బ్యాటరీ ఎనర్జీ స్టోరేజి సిస్టమ్స్‌లకు మాత్రమే 50 రూపాయల ధర వర్తిస్తుందని సిఇఆర్‌సి ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే, ఆ పరిమితుల ప్రభావం పెద్దగా ఉండదని, డిస్కమ్‌లపై అపరిమిత భారం తప్పదన్న అంచనాలు వినపడుతున్నాయి. అదే జరిగితే వెంటనే కాకపోయినా, భవిష్యత్తులో ఆ మొత్తం వినియోగదారులపైకి డిస్కమ్‌లు బదిలీ చేసి తీరుతాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి ఏటా వేసవిలో విద్యుత్‌కు డిమాండ్ ఏర్పడుతున్న విషయం తెలిసిందే. ఈసారి వేసవికాలానికి ముందే సిఇఆర్‌సి ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

డిస్కమ్‌లకు గత ఏడాదే కష్టాలు

నిజానికి అధిక ధరల కారణంగా గత ఏడాదే డిస్కమ్‌లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యాయి. గత వేసవిలో దేశ వ్యాప్తంగా విద్యుత్‌కు పెద్దఎత్తున డిమాండ్ ఏర్పడింది. ఎనర్జీ ఎక్స్ఛేంజ్‌లలో యూనిట్ ధర 20 రూపాయలు దాటింది. దీంతో దేశ వ్యాప్తంగా డిస్కమ్‌ల పరిస్థితి గందరగోళంగా మారింది. అంత డబ్బుపెట్టి కొనలేక కొన్ని రాష్ట్రాల డిస్కమ్‌లు చేతులెత్తేసే పరిస్థితి ఏర్పడింది. ఆ దశలో జోక్యం చేసుకున్న సిఇఆర్‌సి విద్యుత్ అమ్మకం ధర 12 రూపాయలకు మించకూడదని ఆదేశాలు జారీ చేసింది. తాజాగా, ఆ ఆదేశాలను సవరించి యూనిట్ 50 రూపాయల వరకు విక్రయించుకోడానికి అనుమతిచ్చింది. 20 రూపాయలకు కొన్నప్పుడే డిస్కమ్‌లు సంక్షోభంలో చిక్కుకోగా తాజా నిర్ణయంతో వాటి పరిస్థితి ఏమవుతుందన్న చర్చ సాగుతోంది.

ప్రైవేటు ఒత్తిళ్లు...

యూనిట్ రేటును 12 రూపాయలకు పరిమితం చేసినప్పటి నుంచి ఆ ధర తమకు అనుకూలం కాదంటూ కొన్ని ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి సంస్థలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చాయి. తాము విదేశాల్లో అధిక ధరకు బొగ్గును కొంటున్నామని, తమ ఉత్పత్తి వ్యయంఅధికంగా ఉంటోందని ఆ సంస్థలు వాదించాయి. గ్యాస్ ఆధారిత విద్యుత్ సంస్థలు కూడా ఇదే విధమైన వాదన వినిపించాయి. అదానీ, రత్నగిరి గ్యాస్ అండ్ పవర్ ప్రైవేటు లిమిటెడ్ (గతంలో ఎన్రాన్)తోపాటు మరికొన్ని సంస్థలు కూడా ఈ తరహా ఒత్తిడి తీసుకొచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్ సంస్థ యూనిట్ ధరను 50 రూపాయలకు పెంచాలని సిఇఆర్‌సిని ఆశ్రయించింది. ఆ తరువాత 99 రూపాయలకు పెంచాలని కోరుతూ మరో పిటిషన్ వేసింది. వీటిపై విచారణ నిర్వహించిన సిఇఆర్‌సి తాజాగా 50 రూపాయలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది.

మన రాష్ట్రం సంగతేంటి?

మన రాష్ట్రంలో ప్రస్తుతం రోజుకు 227 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతోంది. దీనిలో 20 శాతం దాకా బయటనుండి కొంటున్నట్లు సమాచారం. వేసవి కాలంలో ఈ డిమాండ్ 235 నుండి 240 మిలియన్ యూనిట్లకు చేరుతుందని అంచనా. గరిష్టంగా 250 మిలియన్ యూనిట్లకు కూడా చేరే అవకాశం ఉంది. అంటే, కనీసం 60 మిలియన్ యూనిట్లు ఎనర్జీ ఎక్స్ఛేంజ్‌ల నుంచి కొనాల్సివస్తుంది. తొలుత గ్రీన్ విద్యుత్ (సోలార్, విండ్)ను విక్రయిస్తామని, ఆ తరువాత థర్మల్ విద్యుత్‌కోసం వేలం నిర్వహిస్తామని చెబుతున్నప్పటికీ ఆ ప్రత్యామ్నాయ విద్యుత్ లభ్యతకు అనేక పరిమితులు న్నాయి. వేసవికాలంలో అన్ని రాష్ట్రాల్లో డిమాండ్ ఉండటంతో పోటీపడక తప్పనిస్థితి ఏర్పడుతుంది.

గవర్నర్‌గా అబ్దుల్ నజీర్ ప్రమాణ స్వీకారం

- సిఎం, ప్రతిపక్షనేత హాజరు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నూతన గవర్నర్‌గా ఎస్ అబ్దుల్ నజీర్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు, మంత్రులు హాజరయ్యారు. తొలుత రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి గవర్నర్ నియామక వివరాలను వెల్లడించారు. ప్రమాణ స్వీకారం అనంతరం సిఎం, పలువురు నేతలు, అధికారులు అబ్దుల్ నజీర్‌ను అభినందించారు. కర్ణాటకలోని బెలువాయికి చెందిన నజీర్ మహావీర కళాశాలలో డిగ్రీ చదివారు. మంగుళూరులో న్యాయవిద్య పూర్తి చేశారు. 2003లో కర్ణాటక హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా చేరిన ఆయన 2004లో శాశ్వత న్యాయమూర్తి బాధ్యతల్లోకి వెళ్లారు. 2017 ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులై ఈ ఏడాది జనవరి వరకూ సేవలందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొట్టు సత్యనారాయణ, రాజన్నదొర, తానేటి వనిత, బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, రాజేంద్రనాధ్ తదితరులు పాల్గొన్నారు. అతిథుల గౌరవార్థం గవర్నర్ తేనేటి విందు ఏర్పాటు చేశారు.

ఉక్కు దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న బివి.రాఘవులు

కార్మికుల ఓట్ల కోసం కాదు.. బిజెపి విధానంపై పోరాడండి

- రాజకీయ పార్టీలకు సిపిఎం నేత రాఘవులు పిలుపు
- ఉక్కు దీక్షా శిబిరం సందర్శన

లోపలి పేజీలో..

ఐదు 'స్థానిక' ఎమ్మెల్సీ స్థానాల్లో

వైసిపి అభ్యర్థులు ఏకగ్రీవం

- 27న అధికారికంగా ప్రకటన
- మిగిలిన జిల్లాల్లో పోటీ

ప్రజాశక్తి- యంత్రాంగం

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపికి చెందిన ఐదుగురు అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. వారిలో ఉమ్మడి కడప జిల్లా నుంచి పి.రామసుబ్బారెడ్డి, ఉమ్మడి అనంతపురం నుంచి ఎస్.మంగమ్మ, ఉమ్మడి నెల్లూరు జిల్లా నుంచి మేరిగ మురళీధర్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి కుడిపూడి సూర్యనారాయణ, ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఉన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ పత్రాల పరిశీలన శుక్రవారంతో జరిగింది. పై ఐదు స్థానాల్లో ఒక్కొక్కరు చొప్పున మాత్రమే బరిలో మిగలడంతో వారు కగ్రీవమైనట్టే. నామినేషన్ల ఉపసంహణకు ఈ నెల 27 సాయంత్రం ఐదు గంటల వరకూ గడువు ఉంది. ఆ తర్వాత ఏకగ్రీవాలను అధికారులు ప్రకటించనున్నారు.

ఉమ్మడి కడప జిల్లాలో ఇద్దరు అభ్యర్థులు నామినేషన్ వేశారు. వీరిలో స్వతంత్ర అభ్యర్థి ఎన్.రమణయ్య నామినేషన్ తిరస్కరణకు గురైంది. ఆయనను అభ్యర్థిగా ప్రతిపాదిస్తూ సంతకం చేసిన వారిలో ముగ్గురు ఈ సంతకాలు తమవి కావని చెప్పడంతో ఈ నామినేషన్‌ను తిరస్కరించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు.

ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో టిడిపి అభ్యర్థి వేలూరి రంగయ్య నామినేషన్ తిరస్కరణకు గురైంది. నామినేషన్ పత్రాల్లో సంతకాలు సరిపోలకపోవడంతో

మిగతా 2లో

వేసవిలో కోతలు ఉండకూడదు

- బొగ్గు కొరత లేకుండా చూడండి
- విద్యుత్‌శాఖ అధికారులకు సిఎం ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వేసవిలో విద్యుత్ కొరత ఉండకూడదని ఆ శాఖ అధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. విద్యుత్ కొరత కారణంగా కరెంటు కోతల సమస్య ఉత్పన్నం కాకూడదని చెప్పారు. ఈ మేరకు అధికారులు అన్ని రకాలుగా సిద్ధం కావాలని ఆదేశించారు. విద్యుత్ శాఖపై తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సిఎం సమీక్ష నిర్వహించారు.

బొగ్గు నిల్వల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. థర్మల్ కేంద్రాలకు బొగ్గు కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రైతులకు కనెక్షన్ల మంజూరులో ఎలాంటి జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. పవర్ ఎక్స్ఛేంజ్‌లో ముందస్తుగా విద్యుత్‌ను బుక్ చేసుకున్నామని అధికారులు సిఎంకు వివరించారు. మార్చి, ఏప్రిల్‌లో సగటున రోజువారీ డిమాండ్ 240 మిలియన్ యూనిట్లు (ఎంయు), ఏప్రిల్‌లో 250 ఎంయు ఉంటుందని అంచనా వేశామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు పెట్టుకునే వ్యవసాయ కనెక్షన్లపై కీలక నిర్ణయం తీసుకున్నామని, ఏ నెలలో దరఖాస్తు చేసుకుంటే అదే నెలలో మంజూరు చేయాలన్న ఆదేశాలను అమలు చేస్తామని అధికారులు సిఎంతో చెప్పారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న 1.06 లక్షల కనెక్షన్లను మంజూరు చేశామని వివరించారు.

మార్చి నాటికి మరో 20 వేల కనెక్షన్లకు పైగా మంజూరు చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 100 విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం పూర్తవుతున్నట్లు వెల్లడించారు. మార్చి చివరి నాటికి వీటిని పూర్తిచేస్తామని తెలిపారు. పేదలందరికీ ఇళ్లు పథకం కింద నిర్మాణాలు పూర్తిచేసుకుంటున్న వారికి వెంటనే కనెక్షన్లు మంజూరు చేస్తున్నామని వివరించారు. ఇప్పటికే 2.18 లక్షలకు పైగా ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చామని అధికారులు వెల్లడించారు. ఇళ్లు పూర్తవుతున్న కొద్దీ వాటికి కనెక్షన్లు శరవేగంగా ఇస్తున్నామని తెలిపారు.

ఈ సమావేశంలో విద్యుత్, అటవీ పర్యావరణశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి, ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, పరిశ్రమలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవెన్, ట్రాన్స్‌కో జెఎండిలు ఐ పృథ్వీతేజ్, మల్లారెడ్డి, నెడ్‌క్యాప్ ఎమ్‌డి రమణారెడ్డి, సిపిడిసిఎల్ సిఎండి జె పద్మ జనార్ధనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

8,500 మంది ఉద్యోగులపై ఎరిక్సన్ వేటు

న్యూఢిల్లీ : టెలికాం పరికరాలు తయారు చేసే స్వీడన్‌కు చెందిన బహుళ జాతి సంస్థ ఎరిక్సన్ ప్రపంచ వ్యాప్తంగా 8,500 మంది ఉద్యోగుల్ని తొలగిస్తున్నట్లు తాజాగా ప్రకటించింది. ఉద్యోగుల తొలగింపులకు సంబంధించి ఇప్పటికే ఆ కంపెనీ మెమోలు జారీ చేసింది. తొలగించే ఉద్యోగుల సంఖ్య దేశాన్ని బట్టి మారుతుంటాయని కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బోర్జే ఎకోల్మ్ తెలిపారు. ఏయే దేశాల్లో ఎంతమందిని తొలగిస్తున్నదీ ఇప్పటికే కొన్ని దేశాలకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా ఇటీవల స్వీడన్‌లో 1,400 మంది ఉద్యోగులను కంపెనీ తొలగించింది. ఆ తొలగింపులకు తాజా ప్రకటన అదనం. అంటే దాదాపు 10 వేల మందికి ఎరిక్సన్ ఉద్వాసన పలికింది. భారత్‌లోనూ ఈ కంపెనీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా తలపెట్టిన

ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలు నిలిపేయాలి

- చీఫ్ ఎలక్షన్ కమిషనరుకు సిపిఎం లేఖ

ప్రజాశక్త - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉండగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా చేపట్టిన 'సిటిజన్ అవుట్ రీచ్ ప్రోగ్రాం' కార్యక్రమాన్ని నిలిపేసేలా ఆదేశాలు ఇవ్వాలని చీఫ్ ఎలక్షన్ కమిషనరును సిపిఎం రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు శుక్రవారం లేఖ రాశారు. కార్యక్రమ నిర్వహణకు సచివాలయశాఖ జిల్లా అధికారులకు ఆదేశాలిచ్చిందని లేఖలో పేర్కొన్నారు. ఫిబ్రవరి తొమ్మిది నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని, ప్రభుత్వం తన పథకాలపై ప్రచారం ద్వారా ప్రజలకు చేరువయ్యేందుకు ఫిబ్రవరి 24, 25 తేదీల్లో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించిందని తెలిపారు. ఆ మేరకు అధికారులు ఏర్పాట్లు కూడా చేస్తున్నారని, ఈ కార్యక్రమంలో భాగంగా సచివాలయ ఉద్యోగులు వాలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై అభిప్రాయాలను సేకరిస్తారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఓట్ల చేర్పింపులో వాలంటీర్ల పాత్రపై సర్వత్రా విమర్శలు వచ్చాయని, అధికార పార్టీ తరపున ఎన్నికలతో సంబంధం లేని శాఖల అధికారులు ఓటర్లను ఎన్ని రకాలుగా ప్రలోభాలకు గురిచేస్తున్నారో ఇటీవల జరిగిన ఉదంతాలు స్పష్టం చేస్తున్నాయని వివరించారు. ఈ ప్రచార కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులనూ భాగస్వాములను చేసి నిర్వహించాలని సచివాలయ శాఖ ఆదేశించిందని, పూర్తి స్థాయిలో ఓటర్లను ప్రభావితం చేయడానికే దీన్ని తీసుకొచ్చారని అర్థమవుతోందని అన్నారు. దీనిపై జోక్యం చేసుకొని పోలింగ్ ముగింపు తేదీ మార్చి 13 వరకూ ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ఎటువంటి ప్రచార కార్యక్రమాలూ చేపట్టకుండా ఆదేశాలు జారీ చేయాలని, ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వైసిపి శ్రేణుల దాడిలో దహనమైన కారును పరిశీలిస్తున్న టిడిపి అధినేత చంద్రబాబు

ఫిర్యాదుదారులపైనే కేసులా?

- టిడిపి కార్యాలయంపై దాడి చేసిన వారిని ఎందుకు అరెస్టు చేయలేదు
- జగన్ పాలనలో ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కరువు : చంద్రబాబు
- దొంతు చిన్నా కుటుంబ సభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి- గన్నవరం (కృష్ణా జిల్లా)

'ఫిర్యాదుదారులపైనే కేసులు పెడతారా? టిడిపి కార్యాలయంపై దాడి చేసిన వారిని ఇంతవరకు అరెస్టు చేయలేదు. జగన్ పాలనలో ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కరువైంది' అని టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జగన్ పాలన పోయేవరకూ పోరాటం ఆగదని అన్నారు. కృష్ణా జిల్లా గన్నవరంలో ఎమ్మెల్యే వంశీ అనుచరులు, వైసిపి కార్యకర్తల దాడిలో ధ్వంసమైన టిడిపి కార్యాలయాన్ని శుక్రవారం చంద్రబాబు పరిశీలించారు. విజయవాడ నుండి పార్టీ నాయకులతో కలిసి కార్లలో ర్యాలీగా గన్నవరం వచ్చారు. రిమాండ్‌లో ఉన్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్న ఇంటికి వెళ్లి ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ అండగా

మిగతా 2లో

ఆర్‌టిసిలో ఉద్యోగోన్నతులు పొందిన వారికి పిఆర్‌సి

- ఉద్యోగ సంఘాల హర్షం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్‌ఆర్‌టిసిలో 2020 జనవరి 1న ఉద్యోగోన్నతులు పొందిన 2,096 మంది ఉద్యోగులకు పిఆర్‌సిని అమలు చేస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎపిఎస్‌ఆర్‌టిసిలో ఉద్యోగులకు కొత్త పిఆర్‌సిని 2022 సెప్టెంబరు నుంచి అమలు చేస్తున్నారు. అయితే ఈ పిఆర్‌సిని ఉద్యోగోన్నతులు పొందిన 2,096 మందికి మినహాయించి ఇవ్వడంతో ఆర్‌టిసిలో ఉద్యోగ సంఘాలు అనేక రూపాల్లో విజ్ఞప్తులు చేయగా, ఎపిపిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోల ఎదుట ఆందోళనలను నిర్వహించింది. ఉద్యోగ సంఘాల నుంచి ఒత్తిడి పెరగడంతో ఉద్యోగోన్నతులు పొందిన 2,096 మందికి కూడా పిఆర్‌సిని అమలు చేస్తూ శుక్రవారం రాష్ట్ర రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న జిఓ 09ని విడుదల చేశారు. ఉద్యోగోన్నతులు పొందిన ఆర్‌టిసి ఉద్యోగులకు పిఆర్‌సి అమలు చేయడం పట్ల ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలాని, అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ సుందరయ్య, అయ్యపురెడ్డి, ప్రచార కార్యదర్శి టిపిఆర్ దొర, ఎన్ఎంయు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పివి రమణారెడ్డి, వై శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు.

ఒపిఎస్ పునరుద్ధరణ

- సిపిఎస్, జాతీయ విద్యా విధానం రద్దు
- ఎస్‌టిఎఫ్ఐ పార్లమెంట్ మార్చ్‌లో ఉపాధ్యాయుల డిమాండ్

ఢిల్లీలో ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కొత్త పెన్షన్ విధానం (సిపిఎస్) రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానం (ఒపిఎస్) పునరుద్ధరించాలని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్ఐ) నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం నాడిక్కడ జంతర్ మంతర్‌లో ఐదు డిమాండ్ల సాధన కోసం స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్ఐ) ఆధ్వర్యంలో పార్లమెంట్ మార్చ్ నిర్వహించారు. ఎస్‌టిఎఫ్ఐ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులు కదంతొక్కారు. మోడీ సర్కార్ విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్లకార్డులు చేబూని నినదించారు. ఈ సందర్భంగా ఎస్‌టిఎఫ్ఐ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెసి హరికృష్ణ, సిఎన్ భారతి మాట్లాడుతూ.. విద్యను కార్పొరేటీకరణ, కాషాయీకరణ చేసేందుకు మోడీ సర్కార్ విధానాలు

మిగతా 7లో

ఎస్‌టిఎఫ్ఐ డిమాండ్లు

1. జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి)-2020ని రద్దు చేయాలి. అందరికీ ఉచిత, నిర్బంధ, నాణ్యమైన విద్యను అందించాలి.
2. నూతన పెన్షన్ పథకం (ఎన్‌పిఎస్), పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పిఎఫ్ఆర్‌డిఎ) రద్దు, పాత పెన్షన్ పథకం (ఒపిఎస్) అమలు చేయాలి.
3. అన్ని తాత్కాలిక, అడ్‌హాక్, కాంట్రాక్ట్, టర్మ్ బేసిస్ టీచర్లు, ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించాలి.
4. విద్యా హక్కు చట్టాన్ని 12వ తరగతి వరకు పొడిగించాలి. ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేయాలి.
5. రూ.7.50 లక్షల ఆదాయం వరకు ఆదాయపు పన్ను మినహాయింపు ఇవ్వాలి. రూ.2.5 లక్షల వరకు స్టాండర్డ్ డిటెక్షన్ ఉండాలి. 80 సిసి మినహాయింపు రూ.3 లక్షల వరకు ఉండాలి.

గ్లోబల్ సమ్మిట్‌పై టూరిజం ప్రత్యేక పుస్తకాలు

- ఆవిష్కరించిన సిఎం జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పర్యాటకశాఖ రూపొందించిన పుస్తకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. విశాఖపట్నంలో మార్చి 3, 4 తేదీల్లో జరగనున్న ఎపి గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023 నేపథ్యంలో పర్యాటకం, హ్యాండీక్రాఫ్ట్స్, టెంపుల్స్, బీచ్‌లు, సోల్‌స్పేస్, ఎ టూ జెడ్ టేబుల్ గైడ్‌పై ప్రత్యేక పుస్తకాలను తీసుకొచ్చింది. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో జగన్ వీటిని శుక్రవారం ఆవిష్కరించారు. బెస్ట్ టూరిజం పాలసీ అవార్డును కైవసం చేసుకున్న పర్యాటక శాఖ, ఇతర రాష్ట్రాలు కూడా రాష్ట్ర టూరిజం పాలసీని అధ్యయనం చేస్తున్నాయని ముఖ్యమంత్రి దృష్టికి అధికారులు తీసుకొచ్చారు. రానున్న రోజుల్లో టూరిజం డెస్టినేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సిఎం చెప్పారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో నెంబర్‌వన్‌గా ఉన్న రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధిలో నడిపిస్తూ పెట్టుబడులకు స్వర్గధామంగా తీర్చిదిద్దేలా ముందుకు సాగాలన్నారు.

టిడిపికి ఓటు వేశారని బోరు తొలగింపు

- రైతు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్ (ప్రకాశం)

టిడిపికి ఓటు వేశారనే నెపంతో వ్యవసాయ పంపుసెట్‌ను అధికారపార్టీ నేతల ఒత్తిడితో అధికారులు తొలగించారు. మనస్తాపానికి గురైన రైతు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. ఈ ఘటన ప్రకాశం జిల్లా మార్కాపురం మండల పరిధిలోని జమ్మనపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కొందరు రైతులు ప్రభుత్వ స్థలాల్లో వ్యవసాయ బోర్లు వేసుకుని పంటలు సాగుచేస్తున్నారు. సర్పంచ్ ఎన్నికల్లో కాశీరావు, చిట్యాల సుబ్బారెడ్డి తమకు మద్దతు ఇవ్వలేదని వారిపై వైసిపి నాయకులు కక్షగట్టారు. ప్రభుత్వ భూమిలో వారు వేసిన బోర్లను తొలగించాలని అధికారులపై ఒత్తిడి తెచ్చారు. వాల్టా చట్టం ఉల్లంఘన కింద బోర్లు ఉన్నాయని అధికారులు వాటిని తొలగించారు. మిర్చి పంట కాయ దశలో ఉందని బాధితులు విన్నవించినా అధికారులు కనికరించలేదు. దీంతో మనస్తాపం చెందిన కాశిరెడ్డి అధికారుల ఎదుటే ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. స్థానికులు అడ్డుకోవడంతో ప్రమాదం తప్పింది.

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం దుర్వినియోగం

- జాతీయ ఎస్‌సి కమిషన్‌కు వర్ల రామయ్య లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టాన్ని వైసిపి ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని జాతీయ ఎస్‌సి కమిషన్‌కు, డిజిపికి టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం కమిషన్‌కు, డిజిపికి లేఖ రాశారు. జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం దుర్వినియోగం అవుతుందని విమర్శించారు. టిడిపిపై కక్ష సాధించడానికే చట్టాన్ని ప్రయోగిస్తున్నారని పేర్కొన్నారు. కొంతమంది పోలీస్ అధికారులు అధికార పార్టీ నాయకుల ప్రలోభాలకు లొంగి టిడిపి నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ఈ నెల 20న గన్నవరం పార్టీ కార్యాలయంపై జరిగిన దాడిలో వైసిపి గూండాలు విసిరిన రాయి అక్కడ విధుల్లో ఉన్న పోలీసు కనకారావుకు తగిలి గాయపడ్డారని తెలిపారు. దీనిని అవకాశంగా మలుచుకున్న పోలీస్ అధికారులు సిఐ కనకారావును చంపేందుకు టిడిపి నాయకులు ప్రయత్నించారంటూ ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు పెట్టారని తెలిపారు. కనకారావు క్రిస్టియన్ అని, బిసి-సికి చెందుతారని పేర్కొన్నారు. చట్టాన్ని దుర్వినియోగం చేసిన ఫిర్యాదుదారుడు కనకారావుపై, ఉద్దేశపూర్వకంగా విచారణను తప్పుల తడకగా చేసిన విచారణాధికారి విజయ్‌పాల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఐదు 'స్థానిక' ఎమ్మెల్సీ స్థానాల్లో వైసిపి అభ్యర్థులు ఏకగ్రీవం

(మొదటి పేజీ తరువాయి)

ఆయన నామినేషన్‌ను తిరస్కరించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరిలో మొత్తం ఎనిమిది మంది అభ్యర్థులు నామినేషన్లు చేశారు. వారిలో ఏడుగురి నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు అధికారులు ప్రకటించారు ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ పత్రాన్ని సరిగా పూర్తి చేయనందున ఇందులో ఒకరి నామినేషన్‌ను తిరస్కరిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. నెల్లూరు జిల్లాలో ఇద్దరు నామినేషన్లు దాఖలు చేశారు. వారిలో స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురైంది. ఆ అభ్యర్థిని ఎవరూ బలపరచకపోవడంతో నామినేషన్ తిరస్కరించినట్లు అధికారులు ప్రకటించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నలుగురు నామినేషన్లు దాఖలు చేశారు. వారిలో టిడిపి అభ్యర్థి నామినేషన్, ఇద్దరు స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. డాక్యుమెంట్ ఆధారాలు సమర్పించకపోవడంతో టిడిపి అభ్యర్థి కడలి శ్రీదుర్గ నామినేషన్‌ను తిరస్కరించినట్లు అధికారులు ప్రకటించారు. శ్రీకాకుళం జిల్లాలో ఎమ్మెల్సీ స్థానానికి మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. వైసిపి డమ్మీ అభ్యర్థి నర్తు శివాజీ నామినేషన్ తిరస్కరణకు గురైంది. ఫారం 26 అఫిడవిట్ మాత్రమే దాఖలు చేసి, 2ఇ ఫారం జత చేయనందున, సెక్యూరిటీ డిపాజిట్ రూ.10 వేలు కట్టనందున, నామినేషన్ పత్రం ఇసిఎల్ సూచించిన ఫార్మట్‌లో లేనందున ఈ నామినేషన్‌ను తిరస్కరిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఇద్దరు నామినేషన్లు దాఖలు చేశారు. టిడిపి మద్దతుతో చొక్కా ధనంజేయులు నామినేషన్ తిరస్కణకు గురైంది. అభ్యర్థి నిర్ధారణకు జత చేయాల్సిన దస్తావేజులు నిర్ణీత సమయంలో దాఖలు చేయని కారణంగా ఆయన వేసిన రెండు సెట్ల నామినేషన్లనూ తిరస్కరిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

కార్మికుల ఓట్ల కోసం కాదు..

బిజెపి విధానంపై పోరాడండి

- రాజకీయ పార్టీలకు సిపిఎం నేత రాఘవులు పిలుపు
- ఉక్కు దీక్షా శిబిరం సందర్శన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'ఎన్నికల్లో స్టీల్‌ప్లాంట్ కార్మికుల ఓట్ల కోసం మొక్కుబడిగా పోరాట శిబిరం వద్దకు వచ్చి మద్దతివ్వడం కాదు.. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తోన్న బిజెపి విధానంపై పోరాటంలో కదిలి రండి' అని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు వైసిపి, టిడిపి, జనసేన పార్టీలకు పిలుపునిచ్చారు. 2024 ఎన్నికల్లో ఇదే తమ అజెండా అని పార్టీలన్నీ ప్రకటించాలన్నారు. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలను ఐక్యం చేసి వచ్చే ఎన్నికల్లో స్టీల్‌ప్లాంట్ అంశాన్ని రాజకీయ అజెండాగా మార్చే ఉద్యమానికి తమ పార్టీ శ్రీకారం చుడుతుందని రాఘవులు ప్రకటించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ 743 రోజులుగా అకుంఠిత దీక్షతో పోరాటం చేస్తున్న కార్మికులకు అభినందనలు తెలిపారు. కార్మిక చరిత్రలో ప్రపంచంలోనే ఇన్ని రోజుల దీక్ష ఒక రికార్డుగా నిలువనుందని, విజయం అందుకునే వరకూ పోరాటాన్ని కొనసాగించాలని అన్నారు. వైసిపి, టిడిపి, జనసేనకు చెందిన రాష్ట్ర నేతలు శిబిరం వద్దకు వచ్చి బిజెపి ప్రయివేటీకరణ విధానాలను వ్యతిరేకిస్తూ ప్రసంగాలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయాలన్న ప్రయత్నంతోపాటు పాక్షికంగా ప్లాంట్‌ను బలహీనపరిచే కుట్రల్లో భాగంగా ఉక్కు భూములను స్వాధీనం చేసుకునేందుకు అంతర్జాతీయ యజమానులతో బిజెపి ఒప్పందం చేసుకుందన్నారు. వారిని ప్లాంట్ లోపలకు ప్రవేశపెట్టాలనుకునే ప్రయత్నాలను కార్మికులు తిప్పికొడుతూ ప్రభుత్వ రంగంలోనే స్టీల్‌ప్లాంట్ ఉండేలా రక్షించుకున్నారని తెలిపారు. తాజాగా కేంద్ర ప్రభుత్వమే నేరుగా రంగంలోకి దిగి వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను వదిలించుకోవాలని చూస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా విశాఖలోనే సుదీర్ఘకాలంపాటు ప్రతిఘటనను ఎదుర్కొంటోందని తెలిపారు.

ఉక్కు దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న బివి.రాఘవులు

కార్మికుల శక్తికి ప్రజల శక్తి, రాజకీయ శక్తి కూడా తోడైతే సునాయాసంగా విజయం సిద్ధిస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్ రక్షణ పోరాటం కేవలం కార్మికుల కోసం కాదని, దేశ ఆర్థిక వ్యవస్థ, ప్రజల భవిష్యత్తు కోసమని అన్నారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమలను చేజిక్కించుకుని వ్యాపారంగా చేసుకునే వారిని కేంద్రం సిద్ధం చేసిందని, అలాంటి వారే అదానీ, అంబానీ అని పేర్కొన్నారు. అదానీ దేశాన్ని ఎలా ముంచాడో, ప్రపంచం ఎలా నివ్వెరపోయిందో అందరం చూస్తున్నామని, అలాంటి వారికి వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను మోడీ ఎలా కట్టబెడతారు ? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖలోని మధురవాడలో అదానీ డేటా సెంటర్ కోసం 130 ఎకరాలను ప్రభుత్వం కేటాయించిందని, అదానీ అక్రమాలు బయటపడుతుండడంపై తాజాగా సర్కారు పునరాలోచనలో పడిందని అన్నారు. స్టీల్‌ప్లాంట్‌పై దొంగ దెబ్బ తీసే చర్యలను బిజెపి చేపడుతోందని తెలిపారు. ప్లాంట్‌లో 3 ఫర్నేసుల్లో రెండింటి సామర్థ్యాన్ని కుదించేసి ఒక ఫర్నేసుతో నడిపితే స్టీల్ ఉత్పత్తి ఎలా జరుగుతుందని, ప్రపంచంలో ఎలా పోటీపడతామని ప్రశ్నించారు. కార్మికులకు జీత, భత్యాలు పెంచకుండా వారిని నిరుత్సాహానికి గురిచేసే ప్రయత్నాలపై రాజకీయ పార్టీలతో త్వరలో తాము చర్చించి పోరాటంలో భాగస్వాములను చేస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ, కో-కన్వీనర్ జె.అయోధ్యరాం, నాయకులు రామస్వామి పాల్గొన్నారు.

కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి మాట్లాడుతున్న చంద్రబాబు

జనంలో ఉంటేనే టికెట్

- వచ్చే ఎన్నికల్లో బిసిలకు ప్రత్యేక మేనిఫెస్టో
- ప్రభుత్వ వైఫల్యాలు, అరాచక పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లండి : చంద్రబాబు

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

జనంలో ఉండే వారికే వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇస్తామని టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు అన్నారు. వచ్చే ఎన్నికల్లో బిసిలకు ప్రత్యేక మేనిఫెస్టో పడతామని ప్రకటించారు. వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఎక్కువగా ఉందని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, అరాచక పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఎంతో కష్టపడి 72 శాతం పూర్తి చేసిన పోలవరం ప్రాజెక్టును వైసిపి ప్రభుత్వం సర్వనాశనం చేసిందని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే ఆక్వా రైతులకు జోన్, నాన్‌జోన్‌తో సంబంధం లేకుండా యూనిట్‌కు రూ.1.50కే విద్యుత్ ఇస్తామని తెలిపారు. టిడిపి ఉభయ గోదావరి జిల్లాల జోన్-2లోని క్లస్టర్, యూనిట్, బూత్ లెవెల్ ఇన్‌ఛార్జులు, మండల, నియోజకవర్గ, జిల్లా నాయకులు, కార్యకర్తలు దాదాపు మూడు వేలమందితో ఏలూరులో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామూలుగా అయితే వచ్చే ఏడాది ఏప్రిల్ పదో తేదీకి సాధారణ ఎన్నికలు పూర్తవుతాయని, ఒకవేళ ఎప్పుడు ఎన్నికలొచ్చినా నాయకులు, కార్యకర్తలు సన్నద్ధంగా ఉండాలని అన్నారు. బాదుడే.. బాదుడు, ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. నిత్యావసరాల ధరలు, మద్యం ధరలు, గంజాయి పెరిగిపోవడం వంటి సమస్యలను జనాల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. టిడిపి హయాంలోనే బిసిలకు, ఎస్‌సిలకు న్యాయం జరిగిందని, కార్పొరేషన్ల కింద రుణాలు ఇచ్చామన్నారు. రొయ్యకు, ధాన్యానికి మద్దతు ధర కల్పించిన ఘనత టిడిపిదేనని పేర్కొన్నారు. టిడిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. తన సర్వేలో బాగా చేసినట్లు నిరూపితమైతేనే వచ్చే ఎన్నికల్లో ఎంఎల్‌ఎ టికెట్ ఇస్తామని, లేకపోతే దండం పెడతామని పేర్కొన్నారు. ప్రజల్లో పనిచేసిన వారికే పార్టీ అధికారంలోకొచ్చాక ఎంఎల్‌సి, కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్ పదవులు ఇస్తామన్నారు. వివేకాను హత్య చేసేందుకు రూ.40 కోట్ల సుఫారి సొమ్ము ఎవరిదని ప్రశ్నించారు. ఈ విషయంలో 'అబ్బాయి' ఏ విధంగా వ్యవహరించారో సిబిఐ దర్యాప్తులో బయట పడుతోందని జగన్‌ను ఉద్దేశించి అన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన పూర్తి

ప్రజాశక్తి-యంత్రాంగం

పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పశ్చిమ రాయలసీమ, తూర్పు రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో శుక్రవారం నామినేషన్ల పరిశీలన పూర్తయ్యింది. పశ్చిమ రాయలసీమలో 51, తూర్పు రాయలసీమలో 23, ఉత్తరాంధ్రలో 40 నామినేషన్లు ఆమోదం పొందాయి. అనంతపురంలో 63 అభ్యర్థులకుగానూ 51 నామినేషన్లు ఆమోదం పొందాయి. 12 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ఉపాధ్యాయ నియోజకవర్గానికిగానూ 17 మంది అభ్యర్థులు నామినేసన్లు దాఖలు చేశారు. ఇందులో మూడు నామినేషన్లు తిరస్కరణకు గురవ్వగా 14 ఆమోదం పొందాయి. పశ్చిమ రాయలసీమ పిడిఎఫ్ అభ్యర్థులుగా పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డి బరిలో ఉన్నారు. చిత్తూరులో పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి 30 మంది అభ్యర్థులకుగానూ 23 నామినేషన్లు ఆమోదం పొందాయి. ఏడు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ఉపాధ్యాయ నియోజకవర్గానికిగానూ ఎనిమిది మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందాయి.

తూర్పు రాయలసీమ నుంచి పిడిఎఫ్ అభ్యర్థులు పి.బాబిరెడ్డి, మీగడ వెంకటేశ్వరరెడ్డి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి 40 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందాయి. నలుగురు అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ఇక్కడ నుంచి పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ కోరెడ్ల రమాప్రభ బరిలో ఉన్నారు.

చదువుకు సరిపోయేంత స్కాలర్‌షిప్

- ఒక్కొక్క జిల్లాలో ఒక్కొక్క పరిశ్రమ
- యువగళం పాదయాత్రలో లోకేష్ హామీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్యాదీవెన, వసతి దీవెన కాకుండా వారి చదువులకు సరిపోయేంత స్కాలర్‌షిప్ ఇస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లకుండా ఒక్కొక్క జిల్లాలో ఒక్కొక్క పరిశ్రమను ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 26వ రోజుకు చేరుకుంది. శుక్రవారం రేణిగుంట- తిరుపతి మార్గంలోని అంకుర ఆస్పత్రి సమీపంలో యువతీ యువకులతో లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు వెళ్లిపోయాయని విమర్శించారు. ఇందులో రిలయన్స్, అమర్ రాజా కంపెనీ, ఇతర మొబైల్ కంపెనీలు ఉన్నాయన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయిన పరిశ్రమలను తిరిగి మన రాష్ట్రానికి తీసుకొస్తామని తెలిపారు. టిడిపి హయాంలో రూ. 15 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామని గుర్తు చేశారు. రాష్ట్రాభివృద్ధికి సిఎం జగన్ మోహన్ రెడ్డి కృషి చేయడం లేదని విమర్శించారు. ప్రశ్నించే వారిపై దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులతో హిట్లర్ పాలనను తలపిస్తోందన్నారు. పోలీసులు జగన్‌కు తొత్తుగా వ్యవహరించవద్దని హితవు పలికారు. టిడిపి ఎంపిలు, రాజ్యసభ సభ్యులు ప్రత్యేక హోదా కోసం పార్లమెంట్‌లో పోరాడుతున్నారని వివరించారు. టిడిపి అధికారంలో వస్తే నిత్యవసర ధరలు తగ్గించడమే కాకుండా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించడానికి ప్రయత్నిస్తామని హామీనిచ్చారు. రద్దు చేసిన అన్న క్యాంటీన్లు అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. తిరుపతిలో బహిరంగ సభ నిర్వహించరాదని అలిపిరి పోలీసులు లోకేష్‌కు నోటీసులిచ్చారు. దీంతో ఆయన బహిరంగ సభ నిర్వహించకుండానే తిరుచానూరు వైపు పాదయాత్రను కొనసాగించారు. శనివారం పాదయాత్ర తిరుచానూరు నుంచి చంద్రగిరి నియోజకవర్గంలోకి ప్రవేశించనుంది.

యువతీ, యువకులతో మాట్లాడుతున్న లోకేష్

బాలికపై అత్యాచారం

ప్రజాశక్తి - ఒంగోలు క్రైం

స్కూల్ వద్ద వదిలి పెడతానని మాయ మాటలు చెప్పి బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటన ఒంగోలులో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితురాలి తండ్రి వివరాల మేరకు.. ఒంగోలులోని సుజాతనగర్‌కు చెందిన ఓ బాలిక పాఠశాలకు వెళ్లేందుకు ఆటో కోసం వేచి ఉంది. ఆ సమయంలో అదే ప్రాంతానికి చెందిన బద్రి అనే యువకుడు అక్కడికి వచ్చాడు. స్కూల్ వద్ద వదిలి పెడతానని చెప్పి ద్విచక్రవాహనంపై బాలికను ఎక్కించుకున్నాడు. స్కూలు వైపు వెళ్లకుండా ఇందిరమ్మ కాలనీలోకి తీసుకెళ్లి బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం బాలికను స్కూలు వద్ద వదిలిపెట్టాడు. ఈ క్రమంలో బాలిక స్కూలుకు రాలేదని ఆమె తండ్రికి ఉపాధ్యాయులు ఫోన్ చేశారు. దీంతో ఆయన స్కూలు వద్దకు వచ్చే సరికి బాలిక అక్కడే ఉంది. ఇంతసేపు ఎక్కడికి వెళ్లావని తండ్రి నిలదీయడంతో బాలిక అసలు విషయం చెప్పింది. ఈ మేరకు బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రతాప్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

- ఎన్నికల సంఘానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కడప ఆర్‌జెడి బి ప్రతాప్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాను శుక్రవారం సచివాలయంలో కలిసి ఫిర్యాదు చేశారు. ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టరుగా ఉన్న ప్రతాప్‌రెడ్డిని కడప ఆర్‌జెడిగా నియమించటం సరికాదని తెలిపారు. విద్యాశాఖ అడిషనల్ డైరెక్టరు స్థాయి అధికారిగా ఉన్నవారిని దిగువస్థాయి పోస్టులో నియామకం చేశారని పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంలో సొంత జిల్లాలో అధికారిగా ఉండకూడదనే నిబంధనలు ఉన్నాయని వివరించారు. అయినా కడప జిల్లా వాసి ప్రతాప్‌రెడ్డిని కడప ఆర్‌జెడిగా నియమించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అధికారులు, ప్రధానోపాధ్యాయులతో సమావేశాలు ఏర్పాటుచేసి అధికార పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని ప్రచారం చేస్తున్నారని అన్నారు. విందు భోజనాలు, ప్రైవేట్ వసతి గృహాల్లో నివాసం ఉండటం, ఓటర్లను భయపెట్టడం వంటివి చేస్తున్నారని తెలిపారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని వివరించారు. ప్రజాసంఘాలు, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు ప్రతాప్‌రెడ్డిపై ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కడప కలెక్టరు ఆధ్వర్యంలో విచారణ జరపాలని ఆదేశించారని గుర్తుచేశారు. ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వివరించారు. ఇప్పటికైనా ప్రతాప్‌రెడ్డిపై తగు చర్యలు తీసుకోవాలని, వెంటనే ఆర్‌జెడి బాధ్యత నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే కేంద్ర ఎన్నికల కమిషన్ దృష్టికి ఈ విషయాన్ని తెలియజేస్తామని పేర్కొన్నారు. ప్రతాప్‌రెడ్డిపై తగు చర్యలు తీసుకుంటామని లక్ష్మణరావుకు ముఖేష్ కుమార్ మీనా తెలిపారు.

అవినాష్‌రెడ్డిని రెండోసారి విచారించిన సిబిఐ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డిని సిబిఐ మరోసారి విచారించింది. కేసు విచారణలో భాగంగా శుక్రవారం ఆయన హైదరాబాద్‌లోని సిబిఐ కార్యాలయానికి వచ్చారు. సుమారు 5 గంటలపాటు సిబిఐ అధికారులు అవినాష్‌రెడ్డిని ప్రశ్నించారు. కేసు దర్యాప్తులో సిబిఐ సేకరించిన సాక్ష్యాలు, సైంటిఫిక్ ఆధారాలతో రూపొందించిన ప్రశ్నావళిని సిబిఐ సంధించింది. ఫోన్‌కాల్స్, కాల్ డేటాపై విచారించినట్లు సమాచారం. చాలా ప్రశ్నలకు తెలియదు, సంబంధం లేదని అవినాష్‌రెడ్డి బదులిచ్చినట్లు తెలిసింది. మధ్యాహ్నం ఒంటి గంటకు సిబిఐ కార్యాలయంలోకి వెళ్లిన అవినాష్ రెడ్డి సాయంత్రం 5.30 గంటలకు బయటకు వచ్చారు. విచారణ అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ వివేకా హత్య కేసు విచారణ ఏకపక్షంగా జరుగుతోందని, వాస్తవాల ఆధారంగా విచారణ జరగడంలేదని విమర్శించారు. వ్యక్తి టార్గెట్‌గా సిబిఐ వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ కేసుకు సంబంధించి కోర్టుకు సిబిఐ దాఖలు చేసే కౌంటర్లలో గత ఏడాది కాలంగా టిడిపి చేస్తోన్న ఆరోపణలే కనిపిస్తున్నాయని అన్నారు. గూగుల్ టేకౌట్ ఆధారంగా సిబిఐ ఆధారాలు సేకరించిందన్న దానిపై స్పందిస్తూ అది గూగుల్ టేకౌటా?..టిడిపి టేకౌటా?అని అన్నారు. ఒక నిజాన్ని వంద నుంచి సున్నాకు తెచ్చే ప్రయత్నం జరుగుతోందని, ఒక అబద్ధాన్ని సున్నా నుంచి వందకు పెంచే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. విచారణను రికార్డు చేయాలని కోరినా సిబిఐ అంగీకరించలేదని చెప్పారు. మళ్లీ విచారణకు రావాలని చెప్పలేదని తెలిపారు. కోఠిలోని సిబి కార్యాలయానికి వైసిపి కార్యకర్తలు పెద్దఎత్తున రావడంతో పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుచేశారు.

హిందూజాకు అనుకూలంగా ప్రభుత్వ తీరు

- ప్లాంట్‌పై విచారణ జరపాలి
- సిఎస్‌కు ఇఎఎస్‌శర్మ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హిందూజా పవర్ కంపెనీకి రాష్ట్రప్రభుత్వం అనుకూలంగా వ్యవహరిస్తోందని కేంద్రప్రభుత్వ మాజీ కార్యదర్శి ఇఎఎస్‌శర్మ విమర్శించారు. హిందూజాతో ప్రభుత్వం తన సంబంధాన్ని దాచేందుకు ఉత్తర్వులు రహస్యంగా ఉంచుతోందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై వెంటనే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. హిందూజాకు చెల్లించేందుకు రూ.1234 కోట్లు డిస్కంలు రుణాలు తీసుకోవాలని రాష్ట్రప్రభుత్వం జారీ చేసిన జీవోపై రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డికి శుక్రవారం మరోసారి లేఖ రాశారు. రుణాలు విషయం బయటకు చెప్పకుండా రాష్ట్రప్రభుత్వం డిస్కంలపై ఒత్తిడి చేస్తోందని, దీనివల్ల ప్రజలపై భారం పడుతుందని పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం, స్థానిక అధికారులు అనుచితమైన రీతిలో పలు రాయితీలు ఇవ్వడం వల్ల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశం ఉందని ఇంధన శాఖ ఆందోళన చెందుతుందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అవకతవక విధానాల వల్ల ఇప్పటికే డిస్కంలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు నెదుర్కొంటున్నాయని తెలిపారు. వీటిని ఆదుకునేందుకు ముందుకు రావాల్సిన రాష్ట్రప్రభుత్వం వినియోగదారుల ప్రయోజనాలను పణంగా పెట్టి సమస్యలను మరింత తీవ్రతరం చేయడం దురదృష్టకరమని ఆందోళన వ్యక్తం చేశారు. హిందూజాకు రాష్ట్రప్రభుత్వం అనేక అంశాల్లో సహకరిస్తోందని, రాయితీలను ఒక దాని తరువాత మరొకటికి ఇస్తుందని వివరించారు. ఈ అంశాలను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) సమర్పించడం లేదని పేర్కొన్నారు. హిందూజా 1040 మెగావాట్ల ప్రాజెక్టుకు క్యాపిటల్ కాస్ట్ కింద రూ.8087 కోట్లు క్లెయిమ్ చేసుకుందని, అంటే ఒక మెగావాట్‌కు రూ.7.8 కోట్లు అని పేర్కొన్నారు. ఈ ధర ఒక సాధారణ థర్మల్ పవర్ ప్రాజెక్టు కంటే 1.5రెట్లు ఎక్కువ అని తెలిపారు. డిస్కంలు, విద్యుత్ వినియోగదారుల ప్రయోజనాలకు హాని కలిగించే విధంగా అదనపు వ్యయాన్ని టారిఫ్‌లో చేర్చి రాష్ట్రప్రభుత్వం హడావుడిగా నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. మరింత ఆందోళన కలిగించే అంశమేమిటంటే క్యాపిటల్ వ్యయాన్ని భారీగా రూ.1235 కోట్ల పెంచడానికై సంబంధించిన ఇంతటి కీలక నిర్ణయాన్ని బహిరంగ పరచకుండా దాచి పెట్టారని తెలిపారు. ఈ ఉదాసీనత వ్యవహారంపై ప్రభుత్వం ప్రజలకు వివరణ ఇవ్వాలని కోరారు. రాష్ట్రప్రభుత్వం వక్ఫ్‌కు చెందిన 1123 ఎకరాల విలువైన భూమిని చట్టవిరుద్ధంగా హిందూజాకు కేటాయించిందని ఆయన విమర్శించారు. రైతులు, స్థానిక సంస్థల నుంచి తీసుకున్న ఈ భూములను నిరుపయోగంగా ఉంచినందుకు పన్నులు వసూలు చేసి జరిమానాలు విధించాలని కోరారు. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ 1996లో డీశాలినేషన్ ప్లాంట్ ఏర్పాటు చేయాలనే నిబంధనలను కూడా పాటించడం లేదని తెలిపారు. సాంకేతికంగా ప్రాజెక్టుకు అనుమతించిన ధర, రాయితీలు ఇతర అంశాలపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. తద్వారా డిస్కంలు, వినియోగదారులకు న్యాయం జరుగుతుందని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల రోజు పోలీస్ పరీక్ష వద్దు

- వాయిదా వేయాలని ఎన్నికల సంఘానికి టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న మార్చి 13న పోలీస్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్ష, చివరి రాత పరీక్షను పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించనున్నట్లు ప్రకటించిందని రాష్ట్ర ఎన్నికల సంఘానికి టిడిపి ఫిర్యాదు చేసింది. ఆ రోజు పరీక్షలను వాయిదా వేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాను సచివాలయంలో ఆ పార్టీ నేతలు శుక్రవారం కలిసి ఫిర్యాదు చేశారు. ఈ పరీక్షలకు వేలాది మంది పట్టభద్రులు హాజరవుతారని, వీరంతా ఎన్నికల్లో పాల్గొనలేని పరిస్థితి ఉంటుందని వివరించారు. గురువారం జరిగిన నామినేషన్ల పర్వంలో అనేకచోట్ల వైసిపి నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు ఎన్నికల నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘించారని విమర్శించారు. పశ్చిమగోదావరి, ఏలూరు, శ్రీకాకుళం, విశాఖపట్నం, చిత్తూరు జిల్లాల్లో ఎమ్మెల్సీ నామినేషన్ల ప్రక్రియలో మంత్రులు, వైసిపి నాయకులు అనేక వాహనాల్లో ఊరేగింపుగా వెళ్లి కలెక్టరు కార్యాలయంలో నామినేషన్లు వేశారని వివరించారు. దీనిని ప్రశ్నించే వ్యవస్థ, అడ్డుకోవాల్సిన పోలీసులు వారిని నిలువరించే ప్రయత్నం చేయలేదని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నామినేషన్ల విషయంలో అధికారులు అనేక అవకతవకలకు పాల్పడ్డారని తెలిపారు. పంచాయతీరాజ్ ఛాంబర్ తరపున దాఖలు చేసిన నామినేషన్లను అక్రమంగా తిరస్కరించి వైసిపి అభ్యర్థులను ఏకగ్రీవం చేశారని పేర్కొన్నారు. అనంతపురం జిల్లా తమ పార్టీ అభ్యర్థి రంగయ్య నామినేషన్‌ను ఏ కారణం లేకుండా తిరస్కరించారని వివరించారు. కడప, నెల్లూరు లోకల్ అథారిటీలో రమణయ్య, దేవిరెడ్డి నాగేంద్రప్రసాద్ నామి నేషన్లను తోసిపుచ్చారని పేర్కొన్నారు. పోలీస్ అభ్యర్థుల పరీక్ష వాయిదాపై ముఖేష్ కుమార్ మీనా సానుకూలంగా స్పందించారని టిడిపి నేతలు మీడియాతో చెప్పారు. ఫిర్యాదు చేసిన వారిలో టిడిపి ఎమ్మెల్సీ పి అశోక్‌బాబు, ఎన్‌ఆర్‌ఐ విభాగం ఇన్‌ఛార్జి కె బుచ్చి రాంప్రసాద్, పంచాయతీరాజ్ ఛాంబర్స్ అధ్యక్షులు వైవిబి రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

ఫిర్యాదుదారులపైనే కేసులా?

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. ఆ తర్వాత జాతీయ రహదారి మీద నడుచుకుంటూ టిడిపి కార్యాలయానికి చంద్రబాబు వెళ్లారు. అక్కడ దాడిలో కాలిపోయిన, ధ్వంసమైన కార్లను, ద్విచక్ర వాహనాలను, దాడికి గురైన పార్టీ కార్యాలయంలో చిందరవందరగా పడి ఉన్న కంప్యూటర్లు, పగిలిన అద్దాలను, ఫర్నిచర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ 'భయపడొద్దు. నేనున్నా. ఎవరినైనా ఎదిరించండి' అంటూ టిడిపి శ్రేణులకు పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో తామే అధికారంలోకి వస్తామని, అప్పుడు వైసిపి గూండాలు, పోలీసుల సంగతి తేలుస్తామన్నారు. అనంతరం మీడియాతో చంద్రబాబు మాట్లాడారు. 'కావాలంటే సమయం నిర్ణయిస్తా. నేను గన్నవరంలోనే ఉంటా. పోలీసులను పక్కన పెట్టి మీరు ఎన్ని వేల మందితో వస్తారో రండి. దమ్ముంటే మీ వంశీని రమ్మనండి. తేల్చుకుందాం. దొంగ దెబ్బ తీయడం కాదు. దమ్మున్నోడు నేరుగా ఢీ కొట్టాలి, అప్పుడు తెలుస్తుంది టిడిపి పవరేంటో?' అని వైసిపి నేతలకు సవాల్ విసిరారు. టిడిపి నాయకులను పోలీసులు రాత్రిళు ఎత్తుకెళ్లారని, అదేమని న్యాయవాది వెళ్లి అడిగితే ఆయనపైనా కేసు పెట్టారని, టిడిపి కార్యాలయంపై రాళ్లు, కర్రలతో దాడులు చేసిన ఏ ఒక్కరి మీదా ఇంతవరకు పోలీసులు కేసు నమోదు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గన్నవరంలో ఓ పథకం ప్రకారమే వైసిపి గుండాలు దాడులు చేశారని విమర్శించారు. ఇటువంటి దుష్టశక్తులను వదిలే ప్రసక్తే లేదన్నారు. బిసి 'సి' సామాజిక తరగతికి చెందిన గన్నవరం సిఐతో పట్టాభిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ యాక్ట్ కేసు ఎలా పెట్టిస్తారని ప్రశ్నించారు. తాను అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిపై ఒక కమిటీ వేసి వాస్తవాలు నిగ్గు తేలిస్తే పోలీసులు ఏమైపోతారని, వారిని శంకరగిరి మాన్యాలు పట్టిస్తానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర, కృష్ణా జిల్లా అధ్యక్షులు కొనకళ్ల నారాయణరావు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎంఎల్‌ఎ గద్దె రామమోహనరావు పాల్గొన్నారు. చంద్రబాబు రాక సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొండపిలో బేళ్లను కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

కిలో పొగాకు రూ.200

- తొలిరోజు 108 బేళ్లు విక్రయం

ప్రజాశక్తి- ప్రకాశం

ప్రకాశం రీజియన్ పరిధిలోని నాలుగు కేంద్రాల్లో శుక్రవారం పొగాకు వేలం ప్రారంభమైంది. కిలో గరిష్ట ధర రూ.200 పలికింది. కేంద్రాల వారీగా చూస్తే ఒంగోలు-1 కేంద్రానికి 45, పొదిలి 27, కొండపి 18, వెల్లంపల్లిలో 18 బేళ్ల కలిపి 108 బేళ్ల వేలం కేంద్రానికి వచ్చాయి. అన్ని బేళ్లను కిలో రూ.200 చొప్పున వ్యాపారులు కొనుగోలు చేశారు. మొదటి రోజునే సీలింగు ధర అమలులోకి వచ్చింది. గిట్టుబాటు ధర రూ.250కిపైనే రైతులు ఆశించారు. కర్ణాటకలో ఉన్న గరిష్ట ధర రూ.270 ఇస్తే ఇక్కడ గిట్టుబాటు అవుతుందని వారు చెబుతున్నారు.

30 మంది టిడిపి కార్యకర్తలపై కేసు నమోదు

- నర్సరావుపేటలో మాజీ ఎంపిపి మృతదేహం తరలింపు వివాదం

ప్రజాశక్తి - నరసరావుపేట (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం అలవాలలో మాజీ ఎంపిపి వెన్నా బాలకోటిరెడ్డి అంతిమయాత్ర సందర్భంగా జరిగిన తోపులాట ఘటనలకు సంబంధించి 30 మందిపై పోలీసులు శుక్రవారం కేసులు నమోదు చేశారు. గుంటూరు ప్రభుత్వాస్పత్రి నుండి రొంపిచర్ల మండలం అలవాల గ్రామానికి ఈ నెల 22న బాలకోటిరెడ్డి మృతదేహాన్ని తరలిస్తున్న క్రమంలో పోలీసులకు, టిడిపి కార్యకర్తలకు మధ్య తోపులాట, వాగ్వాదం జరిగింది. మృతదేహాన్ని నేరుగా గుంటూరు నుంచి మృతుడి స్వగ్రామానికి తీసుకువెళ్లాలని పోలీసులు అదేశించగా, తమ పార్టీ కార్యాలయానికి తీసుకెళ్లాలని టిడిపి నాయకులు పట్టుబట్టారు.గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై, అద్దంకి -నార్కెట్ పల్లి రహదారిపై వేర్వేరుగా టిడిపి నాయకులు రాస్తారోకో చేశారు. పోలీసు విధులకు ఆటంకం కలిగించారంటూ డాక్టర్ చదలవాడ అరవిందబాబుతోపాటు నియోజకవర్గానికి చెందిన 30 మంది టిడిపి నాయకులపై 188, 143, 341, 353, 290 రెడ్ విత్ 34 సెక్షన్ల కింద నరసరావుపేట పోలీస్ స్టేషన్‌లో కేసనపల్లి పంచాయితీ విఆర్ఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కమ్యూనిస్టు అమ్మ.. పార్వతమ్మ

సంతాప సభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు
తిమ్మరాజుపేటలో ముగిసిన పార్వతమ్మ అంత్యక్రియలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నాటి తరానికే కాదు.. నేటి తరానికీ కమ్యూనిస్టు అమ్మ పార్వతమ్మ అని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. ఎంతో మందిని ప్రోత్సహించడంలో ఘనాపాటి, నాటి సారా వ్యతిరేక ఉద్యమంలో ప్రజానీకాన్ని చైతన్య పరచిన ఉద్యమ నాయకురాలు అంటూ కొనియాడారు. సిపిఎం సీనియర్ నాయకురాలు, సారా వ్యతిరేక ఉద్యమ నేత కర్రి పార్వతమ్మ బుధవారం రాత్రి అనకాపల్లి జిల్లా తిమ్మరాజుపేట గ్రామంలోని తన స్వగృహంలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆమె సంతాప సభ శుక్రవారం ఇంటి వద్ద జరిగింది. అనంతరం అంతిమయాత్రలో గ్రామం యావన్మందీ కుటుంబ సభ్యులతో పాల్గొని 'జోహార్ పార్వతమ్మ' అంటూ నినదించారు. సంతాప సభకు ముఖ్య అతిథిగా హాజరైన రాఘవులు ఆమెకు ఘన నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతో మంది కార్యకర్తలను కమ్యూనిస్టు ఉద్యమంలోకి ఒక తల్లిలా ప్రోత్సహించిన పార్వతమ్మ మరణం ఎంతో బాధ కలిగిస్తోందని ఉద్వేగానికి లోనయ్యారు. 1970-80వ దశకంలో ఉద్యమాలవైపు తనలాంటి ఎంతో మందిని ప్రోత్సహించారని, ప్రతి సమస్యపైనా ప్రజల తరపున నిజాయితీగా పోరాడారని తెలిపారు. తాము ఎక్కడ నుంచో వచ్చినా సమిష్టితత్వంతో తల్లి కంటే ఆప్యాయత చూపిన ఉద్యమ నాయకురాలని గుర్తుచేసుకున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా అనకాపల్లిలో రాజకీయ పాఠాలు అభ్యసించడానికి వచ్చిన రాష్ట్ర, జాతీయ నాయకులకు సకల సౌకర్యాలూ ఏర్పాటు చేయడం ఆమె కమ్యూనిస్టు నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ తిమ్మరాజుపేట గ్రామం ప్రజా ఉద్యమాలకు కేంద్రంగా మారడానికి ఆనాటి రోజుల్లో పార్వతమ్మ నిర్వహించిన పోరాటాలే కారణమని గుర్తు చేశారు. ఆమె మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అన్నారు. భర్త కర్రి నర్సింగరావు బాటలోనే పార్వతమ్మ పయనిస్తూ కమ్యూనిస్టు భావజాలాన్ని చిన్నతనం నుంచే పిల్లల్లో పెంచాలనే పట్టుదలతో పనిచేశారని తెలిపారు. ముఖ్యంగా ఆడపిల్లలను సైకిల్ తొక్కాలని, స్కూళ్లు, కాలేజీలకు అలానే వెళ్లాలని ప్రోత్సహించేవారన్నారు. తిమ్మరాజుపేట గ్రామాభివృద్ధితో పాటు ఈ ప్రాంత అభివృద్ధికి ఎనలేని సేవలను ఆమె అందించారని తెలిపారు. పిల్లలను సైతం కమ్యూనిస్టు భావజాలంతో పెంచారన్నారు. పార్వతమ్మ మృతికి సంతాపం తెలియజేస్తూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, నాయకులు పి మధు, వైవి, కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ పుణ్యవతి సందేశాలు పంపారు.

సంతాప సభలో మాట్లాడుతున్న సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు

అంతిమయాత్రలో పాల్గొన్న వందల మంది

పార్వతమ్మ సంతాపసభ, అంతిమ యాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం జగ్గునాయుడు, మహిళా ఉద్యమ నాయకురాలు పి శేషారత్నం, చెరుకు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్రి అప్పారావు, ప్రజా నాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుర్రం రమణ, ఉషోదయ విద్యాసంస్థల వ్యవస్థాపకులు జె రమణాజీ, పార్వతమ్మ కుమారులు, కూతుర్లు, కోడళ్లు ఆమె జ్ఞాపకాలను నెమరువేసుకుని కన్నీళ్ల పర్యంతమయ్యారు. సిపిఎం అచ్యుతాపురం మండల కార్యదర్శి రొంగలి రాము అధ్యక్షతన సంతాప సభ జరిగింది. అనంతరం తిమ్మరాజుపేట శ్మశాన వాటిక వరకూ అంతిమయాత్ర సాగింది. వందల సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

పార్వతమ్మ మృతికి ఐద్వా సంతాపం

విశాఖ జిల్లా సిపిఎం సీనియర్ నాయకులు, మహిళా ఉద్యమ నేత కర్రి పార్వతమ్మ మృతికి ఐద్వా రాష్ట్ర కమిటీ సంతాపం వ్యక్తం చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ప్రభావతి, రమాదేవి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమంలోనూ, మహిళా సంఘం నాయకులుగానూ పార్వతమ్మ విశేష సేవలందించారని పేర్కొన్నారు. తిమ్మరాజుపేటలోని తన ఇంటినే కేంద్రంగా మలిచి రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించారని, జాతీయ, రాష్ట్ర నాయకులు ఎంతోమంది హాజరయ్యారని తెలిపారు. మహిళా జాతీయ నాయకులు మల్లు స్వరాజ్యం, పుణ్యవతి వంటి వారితో కలిసి అనేక మహిళా ఉద్యమాలకు నాయకత్వం వహించారని పేర్కొన్నారు. సారా వ్యతిరేక ఉద్యమాన్ని ఈ ప్రాంతంలో ఉవ్వెత్తున నడిపారని, తన తుదికంటా మార్గనిర్దేశకులుగా నిలిచారని వివరించారు.

చౌక దుకాణాల వద్ద హమాలీ కూలిరేట్లను నిర్ణయించాలి

- ఎపి పౌరసరఫరాల సంస్థ హమాలీల రాష్ట్ర యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని చౌక దుకాణాల వద్ద ప్రజా పంపిణీలో అందించే సరుకుల అన్‌లోడింగ్‌కు సంబంధించి కూలిరేట్లను నిర్ణయించి ఉత్తర్వులు ఇవ్వాలని ఎపి పౌరసరఫరాల సంస్థ హమాలీల రాష్ట్ర యూనియన్ కోరింది. ఈ మేరకు పౌరసరఫరాల సంస్థ ఎమ్‌డి వీరపాండ్యన్‌కు ఎపి పౌరసరఫరాల సంస్థ హమాలీల యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎస్ ఉదయభాస్కరరావు, రాష్ట్ర నాయకులు శివశంకర్, పి రమేష్, జె నాగశివ, బి కృష్ణ, ఎం అజయ్‌కుమార్ తదితరులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం చౌక దుకాణాల వద్ద హమాలీ ఛార్జీలను చెల్లిస్తామని చెప్పినా.. ఎంత చెల్లిస్తామనే అంశాన్ని చెప్పకపోవడంతో హమాలీల్లో ఆందోళన నెలకొందని వివరించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ధరను నిర్ణయించి తక్షణం ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

ప్రేమించాలని సచివాలయ ఉద్యోగినిపై దాడి

- అధికారుల దర్యాప్తు

ప్రజాశక్తి-ఆలమూరు (అంబేద్కర్ కోనసీమ జిల్లా)

ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని వేధిస్తూ గ్రామ సచివాలయ ఉద్యోగినిపై దాడికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. దీనిపై అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. పోలీసుల కథనం ప్రకారం.. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ గ్రామ సచివాలయంలో పని చేస్తోన్న ఉద్యోగినిని, ఆత్రేయపురం మండలం వాడపల్లి సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా పని చేస్తున్న తాళ్ల గోయల్ సుఖిరాజు గత కొన్ని రోజులుగా లైంగికంగా వేధిస్తున్నాడు. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తెచ్చాడు. దీనికి నిరాకరించడంతో ఈ నెల 19న రాత్రి ఆమె ఇంటికి వెళ్లి దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు ఈ నెల 21న పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రాథమిక వైద్య పరీక్షల అనంతరం ఆమెను రాజమహేంద్రవరంలోని ఉమెన్స్ కేర్ హోమ్‌కు తరలించారు. ఆమె ముక్కు, దవడకు తీవ్ర గాయాలవడంతో సరిగ్గా మాట్లాడలేక పోతోందని ఎస్ఐ ఎస్.శివప్రసాద్ తెలిపారు. కొత్తపేట ఆర్‌డిఒ ఎం.ముక్కంటి, ఐసిడిఎస్ పిడి జి.సత్యవేణి, సిడిపిఒ ఎ.గజలక్ష్మి బాధితురాలి నివాసానికి వచ్చి విచారణ జరిపారు. నిందితుడిని అరెస్టు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దక్షిణ మధ్య రైల్వే మెంబరుగా 'కొల్లి'

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇటీవల ప్రకటించిన సౌత్ సెంట్రల్ రైల్వే జోనల్ యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులుగా అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావును నియమించారు. నాగేశ్వరరావు వికలాంగుల హక్కుల కోసం పోరాటం నిర్వహిస్తున్నారు. గతంలో కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వశాఖ సభ్యులుగా, పలు కేంద్ర కమిటీల్లో సభ్యులుగా పనిచేసిన అనుభవం ఉంది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. వికలాంగ ప్రయాణికుల కోసం ప్రత్యేక సదుపాయాల ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. రైల్వేశాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకోసం, నిరుద్యోగ వికలాంగులకు స్టాల్ ఏర్పాటుకు సహకరిస్తానని పేర్కొన్నారు.

ఎయు విసిని రీ కాల్ చేయాలి : అయ్యన్న

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

అధికార హోదాతో అక్రమాలకు పాల్పడుతున్న ఎయు వైస్ ఛాన్సలర్ ప్రసాద్‌రెడ్డిని ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయ్యే వరకూ రీ కాల్ చేయాలని టిడిపి మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు డిమాండ్ చేశారు. విశాఖలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆంధ్ర యూనివర్సిటీ ప్రతిష్ట మంటగలుస్తోందన్నారు. వర్సిటీని వైసిపి కార్యాలయంగా మార్చేశారని, విసి ప్రసాద్‌రెడ్డి అధికార పార్టీ కార్యకర్తలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ నెల 12న ఎయులో గంజాయి ప్యాకెట్లు దొరికిన ఘటన ఆందోళన కలిగిస్తోందన్నారు. వర్సిటీలో జరుగుతున్న కార్యక్రమాలపై తాను మాట్లాడితే ఫోన్లు చేసి బెదిరించారని తెలిపారు. జివిఎంసి ఎన్నికల్లో వైసిపి రాజకీయాలను ఎయు నుంచే నడిపారన్నారు. విసి ప్రసాద్‌రెడ్డి ఉత్తరాంధ్రలో ఉన్న ప్రయివేటు విద్యా సంస్థల యాజమాన్యాలతో ఇటీవల సమావేశం పెట్టి వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓటు వేయాలని బెదిరించారని అన్నారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్‌కు, కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు తాను ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి పాల్గొన్నారు.

అవినాష్‌రెడ్డికి సంబంధం లేదు

- వివేకా హత్యకు స్క్రీన్‌ప్లే, దర్శకత్వం అంతా బాబుదే
- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసుతో కడప ఎంపి అవినాష్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. వివేకా హత్యకు స్క్రీన్‌ప్లే, దర్శకత్వం మొత్తం చంద్రబాబు నాయుడుదేనని అన్నారు. తాడేపల్లిలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వివేకా హత్యకు అవినాష్‌రెడ్డికి సంబంధం ఉన్నట్లు ఎలాంటి ఆధారాలు లేవన్నారు. ఎన్నికల ముందు జగన్‌ను నైతికంగా దెబ్బతీసేందుకే ఈ హత్య జరిగిందని అన్నారు. టిడిపి నాయకులు బిటెక్ రవి, ఆదినారాయణరెడ్డికి సంబంధాలున్నట్లు ఆధారాలున్నాయని తెలిపారు. వివేకాను కోల్పోవడం వైసిపికి, జగన్‌కు తీరని నష్టమని అన్నారు. వివేకా హత్య కేసులో విచారణ నిష్పక్షపాతంగా జరగడం లేదని, కొందరిని టార్గెట్ చేస్తూ విచారణ చేస్తున్నారని చెప్పారు. వివేకా బావ మరిది శివప్రకాష్‌రెడ్డి ఫోన్ చేస్తేనే అవినాష్‌రెడ్డి వెళ్లారని తెలిపారు. శివప్రకాష్‌రెడ్డి ఫోన్ చేసి వివేకా గుండెపోటుతో చనిపోయారని తనకు చెప్పినట్లు ఆదినారాయణరెడ్డి కూడా చెప్పారని అన్నారు. వివేకా ఫోన్‌లోని రికార్డులను ఎందుకు డిలిట్ చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. మొదటి నుంచీ విచారణను పక్కదారిపట్టించేలా టిడిపి వ్యవహరిస్తోందన్నారు. కుటుంబ సభ్యులంతా కలిసి వివేకాకు చెక్ పవర్ తీసేశారని చెప్పారని అన్నారు. బిటెక్ రవి, ఆదినారాయణరెడ్డి, వివేకా అల్లుడు రాజశేఖర్‌రెడ్డి ఫోన్ రికార్డులు ఎందుకు చూడటం లేదని ప్రశ్నించారు. శివశంకర్‌రెడ్డి వైసిపి నాయకుడని, వివేకాతో కలిసి పనిచేశారని అన్నారు. శివశంకర్‌రెడ్డి కూడా తప్పు చేయలేదని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. బిజెపిలో ఉన్న టిడిపి కోవర్టుల ద్వారా సిబిఐ విచారణను ప్రభావితం చేస్తున్నారని అన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై సిపిఎం నిరసన

ప్రజాశక్తి - యంత్రాంగం

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధుల కోతపెట్టడాన్ని.. అదానికి రాయితీలు కల్పించడాన్ని..ప్రజలపై పన్నుల భారాలు వేయడాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు.

శ్రీకాకుళంలో రామలక్ష్మణ కూడలి వద్ద ధర్నా చేపట్టారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ మాట్లాడుతూ.. సామాన్యులపై కేంద్ర ప్రభుత్వం భారాలు మోపి కార్పొరేట్లకు రాయితీలు ఇస్తోందని, సబ్సిడీల్లోనూ కోత పెట్టిందని విమర్శించారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా బిజెపి మరోసారి మోసం చేసిందన్నారు.విజయవాడ వన్‌టౌన్ హెడ్ పోస్టాఫీస్ వద్ద జరిగిన ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని కోరారు. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్ ప్రజల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ.. పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కరించుకోగలమని, అందుకు ఎర్రజెండా అండగా ఉంటుందని అన్నారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, నిత్యావసర ధరలు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయినందున సామాన్యుల జీవనం భారంగా మారిందన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.శ్రీదేవి మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు ఐటిడిఎ వద్ద ఆందోళన చేపట్టారు. తొలుత ఎర్రంపేట నుంచి ఐటిడిఎ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. విలీన మండలాల పర్యటనలో భాగంగా చింతూరు వచ్చిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పార్టీ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి.కిరణ్ మాట్లాడుతూ.. విలీన మండలాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని అన్ని మండలాల్లోనూ తహశీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనలు జరిగాయి. గుంటూరు జిల్లాలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద, పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. విజయనగరం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ ఆందోళనలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బారావమ్మ పాల్గొన్నారు. బొబ్బిలిలోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నిరసననుద్దేశించి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చేలా ఉందన్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె, కడప కలెక్టరేట్, తిరుపతి జిల్లా రేణిగుంటలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కర్నూలు కలెక్టరేట్, నంద్యాల తాలూకా కార్యాలయం, ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో ఆందోళన చేపట్టారు.

చింతూరు ఐటిడిఎ వద్ద ఆందోళన చేపట్టిన సిపిఎం నాయకులు

కోర్టు వెలుపల ఉద్యమకారులు

పోలవరం ఉద్యమకారులపై కేసు కొట్టివేత

- అభియోగాలు నిరాధారం : జిల్లా అడిషనల్ సెషన్స్ జడ్జి

ప్రజాశక్తి - ఎటపాక(అల్లూరి సీతారామరాజుజిల్లా)

భద్రాచలంలో గోదావరి బ్రిడ్జి వద్ద 2007 జనవరి 29న పోలవరం నిర్వాసిత ఉద్యమకారులపై పోలీసులు కాల్పులు జరిపి, 79 మందిపై పెట్టిన కేసును 16 సంవత్సరాల అనంతరం భద్రాద్రి - కొత్తగూడెం జిల్లా కోర్టు కొట్టివేసింది. పోలీసులు మోపిన అభియోగాలు నిరాధారమైనవని జిల్లా అడిషనల్ సెషన్స్ జడ్జి నీరజ తీర్పునిచ్చారు. పోలవరం నిర్మాణం వల్ల భద్రాచలం డివిజన్‌లోని నదీ పరివాహక ప్రాంతం ముంపునకు గురై లక్షల మంది నిర్వాసితులవుతారని నాడు సిపిఎం ఉద్యమం చేపట్టింది. ప్రభుత్వం చెప్పిన లెక్కలకు మించి నిర్వాసితులున్నారని, వేల ఎకరాల భూములు నీట మునుగుతాయని ఆ పార్టీ ఆధ్వర్యంలో గ్రామగ్రామాన సమావేశాలు జరిగాయి. ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిరసనగా ఆనాడు భద్రాచలం సబ్ కలెక్టర్ ఆఫీస్ ఎదుట సిపిఎం ఆధ్వర్యాన ఆందోళనకు దిగారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయడానికి వెళ్తున్న పోలవరం నిర్వాసితులపై, ఉద్యమకారులపై నాటి ప్రభుత్వం లాఠీఛార్జి చేయించింది. కాల్పులకు తెగబడింది. 79 మంది నాయకులపై కేసులు నమోదు చేసింది. 17 రోజుల జైలు జీవితం గడిపిన 79 మంది 16 ఏళ్లపాటు కేసు విచారణకు హాజరయ్యారు. విచారణ సమయంలో 12 మంది చనిపోయారు. శుక్రవారం 67 మంది కోర్టుకు హాజరుకాగా నాడు పోలీసులు మోపిన అభియోగాలు నిరాధారమైనవని జడ్జి కేసుకొట్టేశారు. ఈ తీర్పు నేపథ్యంలో సిపిఎం నాయకులు మాట్లాడుతూ.. నాటి పోరాటాల ఫలితంగా నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ, పునరావాసం లభిస్తున్నాయని, ఇప్పటి పరిస్థితిల్లో వాటిని ఇంకా సవరించాల్సి ఉందని అన్నారు. ముంపు అంచనాను పెంచి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. న్యాయపోరాటం ముగిసిందని, నిర్వాసితులకు అండగా ప్రజా పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

రేపు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల అఖిల భారత సదస్సు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ పిలుపు మేరకు ఆదివారం ఉదయం విజయవాడలో సదస్సు నిర్వహించనున్నట్లు సంఘం జాతీయ ఉపాధ్యక్షులు బండి శ్రీనివాసరావు, నాయకులు కె.వి.శివారెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం బందరు రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో జరిగే ఈ సదస్సులో జాతీయస్థాయి నాయకులు పాల్గొంటారని తెలిపారు.

కొనసాగుతున్న అదానీ స్టాక్స్ పతనం

న్యూఢిల్లీ : హిండెన్‌బర్గ్ రీసెర్చి నివేదిక వచ్చి నెల దాటుతున్నా అదానీ గ్రూప్ స్టాక్స్ పతనం కొనసాగుతూనే ఉంది. అదానీ గ్రూప్ షేర్ల పతనం అవ్వడంతో ఎల్ఐసి పెట్టుబడుల విలువ రూ.33,686 కోట్లకు చేరింది. పెట్టుబడి పెట్టిన మొత్తం కంటే లాభం రూ.3 వేలకోట్లు మాత్రమే అదనమని హిందూ బిజినెస్‌లైన్ తెలిపింది.

పథకాలకు కోతలే

- బిసి కార్పొరేషన్లకు రూ.12 వేలకోట్లకు పైనే
- ప్రతిపాదనలు సిద్ధం చేసిన సంక్షేమ శాఖ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఎన్నికల బడ్జెట్‌గా పరిణమిస్తున్న వేళ అనేక సంక్షేమ కార్యక్రమాలకు భారీగా నిధులను కోత విధిస్తున్నారు. ఈ మేరకు సంక్షేమశాఖ అధికారులు కూడా కసరత్తు చేస్తున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌కు వారు చేస్తున్న ప్రతిపాదనలు ఇదే రుజువుచేస్తున్నాయి. ఒక్క ఆసరా పథకానికి తప్ప మిగిలిన వాటిల్లో భారీగానే కత్తిరింపులు ఉన్నట్లు తెలుస్తోంది. బిసి సంక్షేమానికి మొత్తం రూ.24,931 కోట్లు బడ్జెట్‌ను ప్రతిపాదిస్తున్న ఆ శాఖ... ఇతర శాఖల వ్యయంతోపాటు మొత్తం వ్యయం రూ.40 వేలకోట్లు దాటిపోతుందనే భావాన్ని వ్యక్తం చేస్తుండడం విశేషం.

తాజా ప్రతిపాదనలు చూస్తే సంక్షేమ వ్యయం భారీగా తగ్గే పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఎన్నికల వేళ సంక్షేమానికి మరింత పెద్దపీట వేస్తారని అంతా భావించగా, నిధుల కేట కేటాయింపు ప్రతిపాదనల్లో మాత్రం కత్తిరింపులు నెలకొనడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇప్పటికే పథకాలకు, జీతభత్యాలకు నిధులు చాలడం లేదని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో నిధుల కేటాయింపుల్లో కోతలు నెలకొంటుండడం కూడా చర్చనీయాంశం అవుతోంది. బడ్జెట్ భారీగానే కనిపిస్తున్నప్పటికీ, గతేడాదితో పోల్చి చూస్తే గణనీయంగా నిధులు తగ్గుతున్నట్లు కనిపిస్తోంది. గతేడాది పెన్షన్ కానుక కింద రూ.18 వేలకోట్లు కేటాయించగా, ఈసారి మాత్రం రూ.9,732 కోట్లు మాత్రమే ప్రతిపాదిస్తున్నట్లు సమాచారం. అలాగే వసతి దీవెనకు గతేడాది రూ.2,083 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది కేవలం రూ.1,062 కోట్లకే పరిమితమవుతున్నట్లు తెలుస్తోంది. వైఎస్ఆర్ చేయూత, విద్యా దీవెన, చేదోడు, వాహన మిత్ర వంటి అనేక పథకాలకు కూడా కోతలు తప్పవన్న భావన వ్యక్తమవుతోంది. అయితే వైఎస్ఆర్ ఆసరా పథకానికి మాత్రం ఊహించని విధంగా భారీ నిధులు కేటాయింపులు చేయనున్నట్లు తెలుస్తోంది. గతేడాది రూ.6,400 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది ఏకంగా రూ.30 వేల కోట్లుకు పైగా కేటాయింపులు ఉండనున్నట్లు తేలింది. ఇంత భారీగా ఎందుకు ప్రతిపాదిస్తున్నారన్నది తేలడం లేదు.

కార్పొరేషన్లకు భారీగా..

ఇక వివిధ కార్పొరేషన్లకు మాత్రం నిధులు భారీగా కేటాయింపులు ఉండనున్నాయి. తాజా ప్రతిపాదనల్లో బిసి కార్పొరేషన్‌కు వేల కోట్లు నిధులు కేటాయించనున్నారు. బిసి కార్పొరేషన్ల ద్వారా ఎ-కేటగిరికి రూ.3,864 కోట్లు, బి-కేటగిరికి రూ.3,502 కోట్లు, డి-కేటగిరికి రూ.4,022 కోట్లు, ఇ-కేటగిరికి రూ.997 కోట్లు కేటాయింపులు చేయనున్నారు. సంక్షేమ శాఖలకు విధించిన కోతలను కార్పొరేషన్లకు కేటాయించిన నిధులతో కొంతవరకు భర్తీ చేయాలని యోచిస్తున్నట్లు తెలిసింది.

వివిధ రంగాలకు కేటాయింపులు ఇవే (రూ.కోట్లలో)

పథకం	2022-23 కేటాయింపులు	2023-24 ప్రతిపాదన
పింఛను కానుక	18,000	9732
వసతి దీవెన	2,083	1,062
చేదోడు	300	215
వాహనమిత్ర	260	144
నేతన్న నేస్తం	200	179
మత్స్యకారమిత్ర	120	115
ఆసరా	6,400	30,533
చేయూత	4,236	3,364
విద్యాదీవెన	2,500	1,112

చంద్రబాబు అసెంబ్లీలో చర్చకు రావాలి

- మంత్రి జోగి రమేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎవరి హయాంలో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ఎక్కువ జరిగాయో తేల్చుకునేందుకు చంద్రబాబు అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సామాజిక న్యాయం అంటే ఎలా ఉంటుందో సిఎం జగన్ దేశానికి ఆదర్శంగా చూపారని అన్నారు. 32 పథకాలను పేదలకు అందించి ప్రజల మన్నన పొందుతుంటే.. రాజకీయ మనుగడ ఉండదని టిడిపి నిరంతరం రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు.

బాలయ్య సినిమాలతో చంద్రబాబుకు పూనకాలు : కొడాలి నాని

బాలయ్య సినిమాలు చూసి చంద్రబాబుకు పూనకాలు వచ్చినట్లు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే కొడాలి నాని అన్నారు.తాడేపల్లిలోని సిఎం క్యాంపుకార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు గన్నవరానికి వెళ్లి ఇష్టానుసారం మాట్లాడుతున్నారని చెప్పారు.వంశీని పశువుల డాక్టర్ అంటూ మాట్లాడుతున్న చంద్రబాబు చేస్తున్న హెరిటేజ్ వ్యాపారం ఏమిటో చెప్పాలన్నారు.

యూట్యూబ్‌లో మల్టీ లాంగ్వేజ్ ఫీచర్

న్యూఢిల్లీ : యూట్యూబ్‌లో చూడాలనుకున్న వీడియోకు చెందిన ఆడియో మనకు రాని భాషలో ఉండటం వల్ల కొన్నిసార్లు ఇబ్బందులు పడుతూ ఉంటాం. ఈ సమస్యకు పరిష్కారంగా యూట్యూబ్ కొత్త ఫీచర్‌ను పరిచయం చేయనుంది. మల్టీ-లాంగ్వేజ్ పేరుతో తీసుకొస్తున్న ఈ ఫీచర్‌తో కంటెంట్ క్రియేటర్లు తమ వీడియోలకు వేర్వేరు భాషల్లో ఆడియోను యాడ్ చేయొచ్చు. దీనివల్ల యూజర్లు ఇతర భాషల్లో తమకు నచ్చిన వీడియోలోని సమాచారాన్ని సులువుగా అర్థం చేసుకోగలరని యూట్యూబ్ భావిస్తోంది. ప్రస్తుతం పరీక్షల దశలో ఈ ఫీచర్‌ను త్వరలోనే యూజర్లకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు యూట్యూబ్ తెలిపింది.ఈ ఫీచర్ అందుబాటులోకి వచ్చిన తర్వాత యూజర్లు, సెట్టింగ్స్‌లోకి వెళితే ఆడియో ట్రాక్ అనే ఆప్షన్ కనిపిస్తుంది. యూజర్ తనకు నచ్చిన భాషను ఎంపిక చేస్తే ఆ భాషలో ఆడియో వినిపిస్తుంది. వీడియోకు ప్రాథమికంగా ఏ ఆడియో ఉండాలనేది కంటెంట్ క్రియేటర్ల నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది. మొబైల్, డెస్క్‌టాప్, ట్యాబ్, టివి యూట్యూబ్ వెర్షన్‌లలో ఈ ఫీచర్ రానుంది. ప్రస్తుతం ఎంపిక చేసిన యూట్యూబ్ కంటెంట్ క్రియేటర్లకు మాత్రమే ఈ ఫీచర్ అందుబాటులో ఉంటుందని, త్వరలోనే సాధారణ యూజర్లకు సైతం పరిచయం చేయనున్నట్లు కంపెనీ చెబుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఎన్ని భాషల్లో అందుబాటులో ఉంటుందనేది వెల్లడించలేదు.

ఈ ఏడాది 5 వేల నియామకాలు!

ఎయిరిండియా సన్నద్ధం

న్యూఢిల్లీ : ప్రభుత్వం నుంచి ఎయిరిండియాను కొనుగోలు చేసిన టాటా గ్రూప్ తమ సేవలను భారీగా విస్తరించేందుకు ప్రణాళికలు రూపొంది స్తోంది. ఇటీవలే 470 విమానాల కొనుగోలుకు ఎయిర్‌బస్, బోయింగ్ సంస్థలతో భారీ డీల్ కుదుర్చుకున్న ఆ సంస్థ.. ఈ ఏడాది కేబిన్ సిబ్బంది, పైలెట్లను కలుపుకుని 5,100 మందిని నియమించుకోబోతున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. దేశీయ సేవలతోపాటు అంతర్జాతీయంగానూ సేవలను విస్తరిస్తున్న నేపథ్యంలో భారీ సంఖ్యలో ఉద్యోగులను నియమించుకోవాలని నిర్ణయించినట్లు ఎయిరిండియా తెలిపింది.

4,200 మంది ట్రైనీ కేబిన్ సిబ్బందిని, 900 మంది పైలెట్లను నియమించుకోనున్నట్లు తెలిపింది. కేబినెట్ సిబ్బందికి 15 వారాల శిక్షణ ఉంటుందని ఎయిరిండియా ఇన్‌ఫ్లైట్ సర్వీసెస్ హెడ్ సందీప్ వర్మ తెలిపారు.

సంపాదకీయం

అదానీ కోసం ఎందాకైనా..!

కాంగ్రెస్ సీనియర్ నాయకులు పవన్ ఖేరాను ఇండిగో విమానంలో నుంచి కిందకు దించేసి అస్సాం పోలీసులు అరెస్టు చేసిన తీరు అత్యంత ఆక్షేపణీయం. నిరంకుశత్వానికి ప్రతీక. ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశానికి ఢిల్లీ నుంచి వెళ్తున్న ఆయనను విమానం ఎక్కీఎక్కగానే 'మీ లగేజీపై సందేహాలున్నాయి. పోలీసులు కూడా వచ్చారు' అంటూ ఇండిగో అధికారులు దింపేయడం, నిరసనగా ఆయనతో పాటు కాంగ్రెస్ నాయకులు దిగి అక్కడే ఆందోళన చేయడం..ఏం జరుగుతోందో తెలియక ప్రయాణీకులు భయాందోళనకు గురికావడం ఈ పరిణామాలన్నీ చూసినవారెవ్వరికైనా దేశంలో ఏమైనా అత్యయిక పరిస్థితి విధించారా? అన్న సందేహం కలగకమానదు. నిరంకుశ చర్యలు మోడీ సర్కార్‌కు కొత్తేమీ కాదు. అక్రమాలను, అన్యాయాలను ప్రశ్నించడమే పెద్ద నేరంగా భావించి ఎంతో మంది సామాజిక కార్యకర్తలను, మేధావులను, రచయితలను, కళాకారులను వేధించడమే గాక.. స్టాన్ స్వామి లాంటి కురువృద్ధ సంఘ సేవకులను పొట్టన పెట్టుకుంది. మరోవైపు వినియోగదారుల సేవకు కట్టుబడి ఉన్నామంటూ గొప్పలు చెప్పే ప్రయివేటు విమానయాన సంస్థలు ప్రభుత్వ, కార్పొరేట్ పెద్దల మెప్పు కోసం ఎంతకైనా తెగిస్తాయనేందుకు పవన్ ఖేరా దించివేత ఘటన ఒక ఉదాహరణ.

పవన్ ఖేరా చేసిన నేరం..దేశ ద్రోహ నేరమేమీ కాదు. పోనీ ఆయన లిక్కర్ డాన్ విజయ్ మాల్యా, వజ్రాల అక్రమ వ్యాపారి నీరవ్ మోడి తరహాలో ప్రభుత్వ విత్త సంస్థలకు వేలాది కోట్ల రూపాయల రుణాలను ఎగవేసి విదేశాలకు పరారవ్వడం లేదు. పవన్ ఖేరా చేసిన నేరమల్లా..బిజెపి అండదండలతో ప్రపంచ కుబేరుడిగా అవతరించిన అదానీ గ్రూపు సంస్థల అధినేత గౌతమ్ అదానీకి, ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఉన్న అనుబంధాన్ని వివరిస్తూ వ్యంగ్యాస్త్రాలు సంధించడమే. భారత్‌లో ఖనిజ వనరులను, సౌర ఇంధన ప్రాజెక్టులను, నౌకాశ్రయాలను, విమానాశ్రయాలను, ప్రభుత్వ ఆస్తులను అదానీకి కారు చౌకగా కట్టబెట్టడమే కాకుండా శ్రీలంక, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో తన పలుకుబడిని ఉపయోగించి మోడీ సర్కార్ అదానీకి అనేక ప్రాజెక్టులు వచ్చేలా చేసిందన్న విమర్శలు కొట్టిపారేయలేనివి. డొల్ల కంపెనీలతో ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడటం, కృత్రిమంగా షేర్ల విలువ పెంచేయడం సహా అనేకానేక అక్రమాలకు అదానీ పాల్పడ్డారంటూ హిండెన్ బర్గ్ నివేదిక బయటపెట్టింది. దిగ్భ్రాంతిగొలిపే అనేక విషయాలతోపాటు అదానీ-మోడీ బంధం ఎంత బలోపేతమైనదో మరోమారు ఈ నివేదిక బట్టబయలు చేసింది. దీంతో మోడీ సర్కార్ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా తయారైంది. ఇంత అన్యాయమా అని ప్రతిపక్షాలు పార్లమెంటులో ప్రశ్నిస్తే సమాధానం లేదు. పైగా సభా ఉల్లంఘనలకు పాల్పడ్డారంటూ 11 మంది ప్రతిపక్ష ఎంపీలపై విచారణకు ఆదేశించి వేధింపులకు గురి చేస్తున్నారు. తెలంగాణలో ఎక్కడో మూలన రేషన్ బియ్యం పంపిణీ సక్రమంగా జరగడం లేదంటూ కనిపెట్టి సదరు రేషన్ డీలరుపై ఒంటికాలిపై లేచిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు అదానీ అక్రమాల బాగోతం చాలా సాధారణమైన అంశంగా కనిపించింది. అదంతా మార్కెట్ నియంత్రణ సంస్థలు, విత్త సంస్థలు చూసుకుంటాయంటూ ఆమె దాటవేశారంటే అదానీ సేవలో ఈ ప్రభుత్వం ఎంతగా మునిగితేలుతున్నదో అర్థమౌతుంది.

ప్రధానమంత్రి నరేంద్రమోడీని ఘాటుగా విమర్శించారన్న ఆరోపణలకే కేసులు బనాయించేసి వేటాడివేటాడి విమానమెక్కుతున్న వ్యక్తిని కూడా దించేసి అరెస్టు చేస్తున్నారంటే అదానీ కోసం ఎంతకైనా తెగిస్తామనే సంకేతాన్ని మోడీ సర్కార్ పంపుతోందా అన్న సందేహం కలగకమానదు. ప్రభుత్వ విత్త సంస్థలను గుల్ల చేసి, ప్రభుత్వ సంస్థలను కారుచౌకగా కాజేసిన వారు దేశభక్తులు! ఈ అక్రమాలను, అన్యాయాలను ప్రశ్నించేవారు దేశ ద్రోహులా?

వాస్తవానికి పవన్ ఖేరా కాంగ్రెస్‌లో దేశవ్యాప్తంగా పేరున్న నేత ఏమీ కాదు. ఆయనేమీ నిత్యం మోడీ సర్కార్‌పై పనిగట్టుకొని విమర్శలు గుప్పించే వ్యక్తీ కాదు. అయితే మోడీ సర్కార్‌కు, ఆయన నమ్మిన బంటు అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వ శర్మకు కోపం తెప్పించిన అంశమల్లా అదానీ, మోడీ అనుబంధాన్ని ప్రశ్నించడమే. చిన్నప్పుడు ఛాయ్ అమ్ముకున్న అనుభవంతో ప్రభుత్వ సంస్థలను అదానీ లాంటి క్రోనీ కేపిటలిస్టులకు అమ్మేసి దేశ ప్రయోజనాలను కాపాడుతున్న మోడీ సర్కార్‌ను ప్రశ్నిస్తే చూస్తూ ఊరుకుంటామా? అన్నట్టుంది హేమంత్ ప్రభుత్వ తీరు. ప్రజాస్వామ్యానికి పాతర వేసే ఇలాంటి చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలి. క్రోని కేపిటలిస్టులతో కలిసి పాలకులు సాగిస్తున్న నిరంకుశ దాడులను తిప్పికొట్టి, దేశ సంపదను పరిరక్షించాలంటే ప్రజా పోరాటాలే మార్గం.

మహనీయుల మాట



సంపద పెరుగుతున్నా,
పేదల కష్టాలు
ఏమాత్రం తగ్గడం లేదంటే...
ఈ సామాజిక వ్యవస్థ
ఎక్కడో కుళ్లిపోతున్నదన్నమాటే.
- కార్ల్ మార్క్స్

నేడున్నది హిందూత్వ జాతీయవాదం

ఇంటర్వ్యూ



ప్రముఖ జర్నలిస్టు, రామన్ మెగసెసే అవార్డు గ్రహీత **పాలగుమ్మి సాయినాథ్** తాజా రచన "ద లాస్ట్ హీరోస్: ఫుట్ సోల్జర్స్ ఆఫ్ ఇండియన్ ఫ్రీడమ్"...పరాయి పాలన నుంచి భారతదేశ విముక్తి కోసం పోరాడిన సాధారణ ప్రజల అసాధారణ జ్ఞాపకాల గుచ్ఛమని చెప్పవచ్చు. వీరి త్యాగాలు చరిత్ర పుస్తకాల్లో ఎక్కడా నమోదు కాలేదు. వారి వాస్తవ గాథలు చెప్పుకోడానికి చోటు కల్పించడం ద్వారా ఈ పుస్తకం ఆ లోటును భర్తీ చేస్తుంది. రానున్న ఐదేళ్లలో తమ అనుభవాలను చెప్పేందుకు ఒక్క స్వాతంత్ర్య సమరయోధుడు కూడా సజీవంగా ఉండడని "పీపుల్స్ ఆర్కైవ్ ఆఫ్ రూరల్ ఇండియా" (పరి) వ్యవస్థాపక సంపాదకుడైన సాయినాథ్ చెప్పారు. భావజాలాలు, నాయకత్వాలలో ఉండే వైరుధ్యాలు, అణగారిన వర్గాల ప్రజలపై బ్రిటీష్ వారు సాగించిన దారుణ అకృత్యాలు, స్వాతంత్ర్యోద్యమానికి ఆదివాసీలు, దళితులు అందించిన సేవలను సాయినాథ్ తన రచనలో నమోదు చేశారు. "ఈ గాథలు వివిధ ప్రాంతాలు, సంస్కృతులు, నేపథ్యాలకు చెందినవి. స్వాతంత్ర్యం సాధించాలనే తపన, వాంఛ ఎంత ప్రగాఢంగా వుందనేది ఈ వాస్తవ గాథలు తెలియజేస్తాయ"ని భగత్ సింగ్ మేనల్లుడైన ప్రొఫెసర్ జగ్మోహన్ తన ముందుమాటలో పేర్కొన్నారు. ఈ పుస్తక రచనకు సంబంధించి పి.సాయినాథ్ "ఫ్రంట్‌లైన్"తో పంచుకున్న పలు స్ఫూర్తిదాయక అంశాలు...



భారతదేశ వ్యవసాయ రంగ సంక్షోభం గురించి పత్రికల్లో కథనాలు రాయడానికి ముందు నుంచి...అంటే విద్యార్థిగా, వృత్తిపరమైన బాధ్యతల్లో వున్నప్పటి నుండి కూడా భారత స్వాతంత్ర్యోద్యమం పట్ల మీకు ఆసక్తి వుంది. అయితే పుస్తకంగా తీసుకురావాలని ఇప్పుడు ఎందుకు నిర్ణయించుకున్నారు?

నేను "ద టైమ్స్ ఆఫ్ ఇండియా"లో 1997లో "ఫర్గాటెన్ ఫ్రీడమ్స్" శీర్షికతో వరుస కథనాలు రాసేటప్పుడు ఇది మొదలైంది. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా భారీ తిరుగుబాట్లు జరిగిన ఐదు గ్రామాలను సందర్శించిన తరువాతే నేను ఆ వ్యాసాలు రాశాను. 2002లో "ద హిందూ" లో వరుస కథనాల ద్వారా వ్యక్తుల వాస్తవ గాథలను రాయడం మొదలు పెట్టాను. అప్పుడు, వాటిని గ్రంథస్థం చేయాలనే ఆలోచనకు వచ్చింది. అయితే, వ్యవసాయ సంక్షోభం స్వాతంత్ర్య సమరయోధులపై చేస్తున్న పనికి అంతరాయం కలిగించింది. కాబట్టి దానితోపాటే పరిశోధనైతే చేశాను. వ్యవసాయ సంక్షోభం మరింత దారుణంగా పెరిగిపోతుండడంతో ఆ కథనాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సి వచ్చింది.

మా తాతయ్య (మాజీ రాష్ట్రపతి వి.వి.గిరి) గురించి మా అమ్మతో పాటు అనేక మంది చెప్పిన కథల్ని, జైలు జీవితం గడిపిన ఇతర కుటుంబ సభ్యులు చెప్పిన కథలను వింటూ పెరిగాను. మా తాతయ్యను కలవడానికి వచ్చే విభిన్న సామాజిక వర్గాలు, నేపథ్యాలకు చెందిన వారిని నేను గమనించేవాడ్ని. ఇలాంటి ప్రజలే మనకు స్వాతంత్ర్యం సాధించిపెట్టారని (వారు వెళ్ళిపోయిన తరువాత) ఆయన నాకు చెప్పేవారు.

ఇంత అత్యవసరంగా 2022 లోనే (2022 నవంబర్ 30న పుస్తకావిష్కరణ జరిగింది) ఈ పుస్తకం తీసుకు రావడానికి ఒక కారణముంది. సెప్టెంబర్ 2021 నుండి ఈ పుస్తకంలో పేర్కొన్నవారిలో ఏడుగురు మరణించారు. అందువల్ల... ఎట్టి పరిస్థితుల్లోనూ 2022లో ఈ పుస్తకం రావాలి. ఈ పుస్తకంలో కనిపించే అనేకమంది తమ వాస్తవ గాథల్ని చూసుకోవాలనుకున్నారు. వారి కోసం నేను ఆ పని చేయాలి అనే పట్టుదల నాలో ఏర్పడింది.

మీరు వ్యవసాయ సంక్షోభానికి సంబంధించిన కథనాలు రాసినప్పుడు... ఆ ప్రాంతాలలో స్వాతంత్ర్యం కోసం పోరాడిన వ్యవసాయ రంగానికి చెందిన వారి గురించి తెలుసుకునేవారా?

దేశంలో ప్రధానమైన తిరుగుబాట్లు జరిగిన ప్రాంతాల్లో, స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వాములైన వారి కోసం నేను గాలించాను. అంతేకాకుండా, అప్పటికే దశాబ్దానికి పైగా ఒక గ్రామీణ రిపోర్టర్‌గా పని చేస్తున్నాను. గ్రామీణ ప్రాంతాల్లో జర్నలిస్టులతో పాటు ఇతర పరిచయాలు కూడా ఉన్నాయి. '1857 తిరుగుబాటు' వ్యవసాయ సంక్షోభం కారణంగానే ఉత్పన్నమైంది. ఒక చరిత్ర విద్యార్థిగా నాకున్న నేపథ్యం ఈ విషయంలో మెరుగైన దృష్టికోణం కలిగివుండడానికి తోడ్పడింది. నాకు భూమి సంబంధాలు, భూస్వాములు-రైతుల మధ్య ఉండే సంబంధాల గురించి కొంతవరకు తెలుసు. ఈ పుస్తకంలో పేర్కొన్న ప్రతీ ఒక్క పాత్రా గ్రామాల నుంచి ఉద్భవించినవే.

ఈ పుస్తకం ఎందుకు రాశారు? మీ లక్ష్యం ఏమిటి?

అందులోని వ్యక్తుల కోసమే ఈ పుస్తకం రాశాను. 1947 తరువాత పుట్టిన మా లాంటి తరానికి, మా జీవితాల్ని సరైన రీతిలో రూపుదిద్దుకోవడానికి వారి గాథలు అవసరం. మేము ఎక్కడి నుండి వచ్చామో మాకు తెలియకపోతే, మేమెక్కడికి వెళ్తున్నామో కూడా మాకు తెలియదు. 17-25 సంవత్సరాల మధ్య వయస్కులు ఎక్కువగా చదువుతారనే విషయం ఇంతకు ముందు నా పుస్తకం ద్వారా తెలిసింది. అందుకే "ద లాస్ట్ హీరోస్"ను వారిని దృష్టిలో వుంచుకొనే రాశాను. సిద్ధాంతాల పట్ల యువతకు అంతగా ఆసక్తి లేకపోయినా స్వాతంత్ర్య సమరయోధుల చరిత్ర, వారి కథలు, ఘటనలు అన్నీ వారిని తప్పకుండా ఆకట్టుకుంటాయి.

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ అనే ప్రభుత్వ వెబ్‌సైట్ ఒకటి ఉంది. ఇందులో ఒక్క ఫోటో గానీ, వీడియో గానీ ఇప్పుడు మన మధ్య వున్న ఒక్క స్వాతంత్ర్య సమరయోధుని గురించిన సమాచారం ఇవ్వకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. అందులో నరేంద్ర మోడీ ఫోటోలు, వీడియోలు ఉంటాయి. మోడీని ఒక స్వాతంత్ర్య సమరయోధునిగా భావించుకుంటున్నందుకు ఒక టీనేజ్ పిల్లవాడ్ని క్షమిస్తాం. కానీ, దీనిని విశ్వసించే ప్రజానీకం కూడా ఉన్నారు. బ్రిటీష్ వలసవాదం గురించి, అది మనకు ఏం చేసిందనే విషయం గురించి ఒక్క పేరా కూడా ఆ వెబ్‌సైట్‌లో లేకపోవడం నన్నెంతో బాధించింది. అది తెలియకుండా స్వాతంత్ర్య పోరాటం, స్వాతంత్ర్యం గురించి ఏం తెలుసుకుంటారు?

సామాన్య ప్రజల పోరాటాలు, త్యాగాల నుంచే స్వాతంత్ర్యం సిద్ధించింది గానీ, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలలో చదువుకొని తిరిగి వచ్చిన వారి వల్ల కాదనే విషయాన్ని రుజువు చేయడమే నా లక్ష్యం. బ్రిటీష్ వారు ఉదార స్వభావంతో వ్యవహరించడం వల్ల స్వాతంత్ర్యం రాలేదనే విషయాన్ని కూడా తెలియజేయాలనుకున్నాను. స్వాతంత్ర్య పోరాటం కేవలం ఉత్తర భారతదేశానికి మాత్రమే పరిమితమైంది కాదు. దేశంలోని అన్ని ప్రాంతాల వారి భాగస్వామ్యంతో జరిగిందనే విషయాన్ని ప్రజలు తెలుసుకోవాలని నేను కోరుకుంటున్నాను.

స్వతంత్రం వచ్చిన 75 సంవత్సరాల తరువాత కూడా నేటికీ పేదరికంలో ఉన్నాం. నాడు స్వాతంత్ర్య పోరాట సమయంలో ఇచ్చిన 'భూమి, భుక్తి, విముక్తి' పిలుపుకు నేటికీ ప్రాసంగికత వుంది. దీని గురించి మీరేమంటారు?

బ్రిటీష్ వలసవాద కాలంలో వచ్చిన 31 కరువుకాటకాల వల్ల మరణాల రేటు ఎక్కువగా వుండేది. 16 కోట్ల నుంచి 16.8 కోట్ల మంది దాకా చనిపోయారన్న విషయం నేటి తరం వారికి తెలియదు. అదే ఏదైనా యూరోపియన్ దేశంలో ఆ మరణాల్లో ఒక్క శాతం సంభవించినా గగ్గోలు పెట్టేవారు. దానిని "మారణహోమం" అనేవారు. రెండు వందల సంవత్సరాల బ్రిటీష్ వలసవాదం భారతదేశంలో 44.6 ట్రిలియన్ డాలర్లు లూటీ చేసిందని ప్రముఖ ఆర్థికవేత్త ఉత్సా పట్నాయక్ అంచనా వేశారు.

మన దేశాభివద్ధికి సంబంధించిన సమస్యలు ఎక్కడి నుండి వస్తున్నాయో దీనినిబట్టి మీకు అర్థమై ఉండాలి. బ్రిటీష్ పాలనా కాలం నాటి సమస్యలు నేటికీ వెన్నాడుతున్నాయి. ఫోర్బ్స్ జాబితా లోని బిలియనీర్లలో భారతీయులు ఉన్నత స్థానాన్ని ఆక్రమించారు. మనం ఎన్నడూ చూడని విధంగా, 1920 నుంచి ఆశ్చర్యకరమైన రీతిలో అసమానతలు పెరిగిపోతున్నాయి. గ్రామీణ పేదల సమస్యలు ఇంకా సమస్యలుగానే మిగిలి ఉన్నాయి. భయానకమైన వాతావరణ మార్పుల కారణంగా అవి మరింత సంక్లిష్టంగా మారుతున్నాయి.

మీ పుస్తకంలో పేర్కొన్న అనేక పాత్రధారుల జీవితాల్లో మహాత్మా గాంధీ, బి.ఆర్. అంబేద్కర్, సుభాష్ చంద్రబోస్ లకు ఎంతో ప్రాధాన్యత వుంది. వారు తమ నాయకులను కలిసినప్పటి సంగతులు చెప్తారా?

ఈ పుస్తక రచన సాగినంత కాలం నేను గమనించింది ఏమంటే, పోరాట కాలంలో గాంధీ స్థానం చాలా ప్రత్యేకంగా ఉండేది. ఉదాహరణకు... థేలూ, లోఖీ మహతోలు గాంధీ, నేతాజీతో పాటు వారి స్థానిక ప్రాంతాలకు చెందిన చంబల్ బందిపోట్లకు వారు అంకితమయ్యారు. ఈ ముగ్గురిని ఆరాధించడంలో వారు ఎలాంటి వైరుధ్యాలను చూడలేదు.

మనుషుల్లో మంచిని మాత్రమే చూడాలని ప్రజలను కోరే మానవతా మూర్తి గాంధీజీ అని భావించే థేలూ, లోఖీలు దానినే అనుసరించారు. అదే సమయంలో వారు పోలీస్ స్టేషన్లపై దాడికి పథకాలను కూడా రచించారు. "నేను గాంధీ, అంబేద్కర్ లలో ఒకర్ని ఎంపిక చేసుకోవాలా? గాంధీ, అంబేద్కర్ లలో నాకు ఏది ఇష్టమైతే దాన్నే అనుసరిస్తానని" శోభారామ్ తన కథలో చెప్పారు.

"పీపుల్స్ ఆర్కైవ్ ఆఫ్ రూరల్ ఇండియా", "అఖిల భారత కిసాన్ సభ" లు మహారాష్ట్ర లోని సంగ్లీలో తుఫాన్ సేన, ప్రతిసర్కార్ నేతలకు సన్మాన కార్యక్రమ నిర్వహణ నన్ను ఎంతగానో కదిలించివేసిన ఘటనల్లో ఒకటి. అప్పుడు ఈ గ్రూపులు గాంధీని వదలి వెళ్ళిపోయాయి. వారిని సన్మానించడానికి నేను, గాంధీజీ మనవడైన గోపాలకృష్ణ గాంధీని తీసుకొని వెళ్ళాను. తుఫాన్ సేన నాయకుడైన కెప్టెన్ భావ్... గోపాలకృష్ణ గాంధీని గట్టిగా కౌగలించుకుని ఏడ్చాడు. గాంధీని విభేదించడం అంటే ఆయన్ను ద్వేషించడం అనే అర్థం కాదని వారు మాతో చెప్పారు. నా పుస్తకంలోని పాత్రధారులలో చాలామంది (అందరూ కాదు) రాజకీయంగా వామపక్షవాదులు. ఆదర్శంలో, నైతికతలో గాంధేయవాదులు.

స్వాతంత్ర్య పోరాటంలో సహాయక పాత్ర పోషించిన సాలిహాన్, పురూలియాకు చెందిన భాబాని మహతో లాంటి మహిళల్ని మీ పుస్తకంలో పేర్కొనడం ద్వారా 'స్వాతంత్ర్య సమరయోధుడు' నిర్వచనాన్ని ప్రశ్నించారు గదా మీరు?

స్వాతంత్ర్య సమరయోధుని గుర్తించడమెలా అనే భావనను "ద లాస్ట్ హీరోస్" రచన సవాల్ చేస్తుంది. దానిలో వంట చేసేవారు, ఇంటిపనివారు, కొరియర్లు, రైతులు, కార్మికులు అందరూ ఉంటారు. ఈ సాధారణ ప్రజలకు మనం గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం ఉంది. పోరాటాన్ని ముందుకు నడిపించిన వారిలో మహిళలు కూడా ఉన్నారనే విషయాన్ని మనం తెలియజేయాలి. పోరాటంలో భాగస్వామ్యానికి పనికిమాలిన నిర్వచనాలిచ్చి, మహిళల్ని దాని నుండి మినహాయించారు.

నిర్బంధంలో ఉన్న విప్లవకారులకు వార్తలను చేరవేయడానికి చెక్కపెట్టెను ఉపయోగించి అర్థరాత్రి నది దాటిన హౌసా బాయి గురించి ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. "ద స్వతంత్ర సైనిక్ సమ్మాన్ పెన్షన్ స్కీమ్" "వితంతువు" గురించి మాట్లాడుతుంది. స్వాతంత్ర్య సమరయోధుడు అంటే ఎప్పటికీ పురుషుడే అని వారు భావిస్తున్నారు. కానీ ఆ యోధుల్లో మహిళలను చేర్చడం అత్యంత సముచితమని నేను భావించాను.

స్వాతంత్ర్యోద్యమం గురించి వ్యాఖ్యానించేటప్పుడు ఏదైనా మార్పు గమనించారా?

నేడు మీరు చూస్తున్న జాతీయవాదం వాస్తవానికి హిందూ జాతీయవాదం. గాంధీ, మండేలాలు ఇలాగే ఉన్నారా? ఇది మతోన్మాద దేశభక్తి. దురభిమానపూరిత దేశభక్తి. హిందూత్వ జాతీయవాదం. నేడు జాతీయవాదాన్ని నిర్వచిస్తూ, ప్రసంగాల్లో దర్పాన్ని ప్రదర్శిస్తున్న వారెవరూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఎలాంటి పాత్రను పోషించలేదు. వారు దేశాన్ని తిరోగమన దిశకు తీసుకుపోతున్నారు.

("ఫ్రంట్ లైన్" సౌజన్యంతో)

★

అరచేతిని అడ్డుపెట్టి చైనా పురోగమనాన్ని అడ్డుకోగలరా ?

వ్యాఖ్య

అరచేతిని అడ్డుపెట్టి సూర్య కాంతిని ఆపగలమని అనుకొనే వారు బుర్ర తక్కువ కాదు... అసలు బుర్ర లేని వారు. నా కోడి కూయకపోతే ఎలా తెల్లవారుతుందో చూస్తా అన్నాడట వెనుకటికెవడో. ఇప్పుడు సరిగ్గా అమెరికా కూడా ఇదే స్థితిలో ఉంది. జపాన్ మీద అణుబాంబును వేసి తనకు లొంగకపోతే మీకూ ఇదే గతి అని బెదిరించిన అమెరికాకు మా దగ్గర కూడా ఉంది చూడమంటూ నాలుగేళ్లలోనే చూపిన సోవియట్ నేత స్టాలిన్ సంగతి తెలిసిందే. ఇప్పుడు టెక్నాలజీ యుద్ధం నడుస్తోంది. మేము, మా మిత్ర దేశాలు మీకు అవసరమైన చిప్స్‌ను అందించకపోతే మీరెలా ముందుకు పోతారో చూస్తాం అని అమెరికన్లు విసిరిన సవాలును తాడిని తన్నేవాడుంటే వాడి తలదన్నేవాడుంటాడన్నట్లుగా చైనా స్వీకరించింది. శాస్త్ర-సాంకేతిక రంగాల్లో స్వావలంబన సాధించేందుకు కావలసిన చర్యలన్నింటినీ చేపట్టాలని చైనా అధినేత సీ జిన్‌పింగ్ ఒక ఉన్నత స్థాయి సమావేశంలో కర్తవ్య నిర్దేశం చేశారు. జనవరి 31న కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ సమావేశంలో దీని గురించి చర్చించారు. నెల రోజులు కూడా గడవక ముందే ఫిబ్రవరి 21న పొలిట్ బ్యూరో పూర్తిగా ఈ అంశం గురించే చర్చించి అమెరికా విసిరిన సవాలును అధిగమించేందుకు దిశానిర్దేశం చేసిందంటే దానికి ఉన్న ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చు.

అమెరికా ఎంతకు తెగించిందంటే ఒకవేళ చైనా గనుక తైవాన్ విలీనాన్ని బలవంతంగా అమలు చేస్తే అక్కడ ఉన్న చిప్స్ ఫ్యాక్టరీలన్నింటినీ పేల్చివేస్తామని హూంకరించింది. ప్రస్తుతం అధునాతన మైక్రో చిప్స్ తయారీలో చైనా లోని కంపెనీలు తిరుగులేని ఆధిక్యతలో ఉన్నాయి. దేశీయంగా చైనాలో పరిశ్రమను అభివృద్ధి చేస్తున్నప్పటికీ చిప్స్ రూపకల్పన ఒక ఎత్తైతే వాటి తయారీకి అవసరమైన ఆధునిక యంత్ర పరికరాల తయారీ, పరిజ్ఞానంలో పశ్చిమ దేశాలు, జపాన్‌దే పైచేయి. తైవాన్, దక్షిణ కొరియా, జపాన్, అమెరికాల నుంచి ఎక్కువ భాగం చైనా దిగుమతి చేసుకుంటున్నది. ఇదే సరఫరా గొలుసు కొనసాగితే త్వరలోనే చైనా ఆర్థికంగా అగ్రగామిగా, మిలిటరీ రీత్యా మరింత పటిష్టంగా మారితే తన స్థానానికి ఎసరు వస్తుందని అమెరికా ఆందోళన చెందుతోంది. 2018లో డోనాల్డ్ ట్రంప్ వాణిజ్య పోరు పేరుతో సాగించిన ప్రచ్ఛన్న యుద్ధంలో శాస్త్ర-సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, చైనాకు అవసరమైన విడి భాగాల ఎగుమతులను అడ్డుకోవటం కూడా ఒకటి. జో బైడెన్ ఏలుబడిలో అది మరొక రూపం తీసుకుంది. తమతో పాటు ఏ దేశం కూడా చిప్స్ సాంకేతిక పరిజ్ఞానం, వాటి ఎగుమతి, తయారు చేసే యంత్రాలను చైనాకు ఇవ్వకూడదని ఇతర దేశాల మీద అమెరికా ఒత్తిడి తెస్తోంది. అలా చేస్తే విస్తారమైన చైనా మార్కెట్‌ను కోల్పోతే తమ కార్పొరేట్ల ప్రయోజనాలకు దెబ్బ అని ఒక వైపు చెబుతూనే సదరు దేశాలు అమెరికా ఒత్తిడికి లొంగుతున్నాయి. ఏడాది క్రితం బ్రిటన్ లోని అతి పెద్ద చిప్స్ తయారీ కంపెనీ న్యూపోర్ట్ వాఫర్‌లో 86 శాతం వాటాలను చైనా సంస్థ వింగ్‌టెక్‌కు విక్రయించేందుకు ఒప్పందం కుదిరింది. రెండుసార్లు భద్రతాపరమైన అంశాలపై సమీక్ష తరువాతే ఇదంతా జరిగింది. అలాంటి ఈ ఒప్పందం తమ దేశ భద్రతకు ముప్పు అంటూ బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ ఇటీవల దాన్ని రద్దు చేశాడు.



ఇలాంటి పరిస్థితి ఏదో ఒక నాడు ఎదురు కానుందనే ముందు చూపుతో చైనా ఇటీవలి కాలంలో శాస్త్ర-పరిశోధనా రంగంలో పెద్ద మొత్తం ఖర్చు చేస్తున్నది. స్టాటిస్టా వెల్లడించిన సమాచారం ప్రకారం 2022లో అమెరికా 679 బిలియన్ డాలర్లు కేటాయిస్తే చైనా 551, జపాన్ 182 బిలియన్ డాలర్లు కాగా ఏడవ స్థానంలో ఉన్న మన దేశం 65 బిలియన్ డాలర్లని పేర్కొన్నది. ఈ లెక్కన త్వరలో అమెరికాను వెనక్కు నెట్టేసి చైనా ముందుకు పోనుంది. పిండి కొద్దీ రొట్టె అన్నట్లు ఖర్చును బట్టే ఫలితాలు కూడా ఉంటాయి. మన పరిశోధనలు మాత్రం ఆవు పేడ, మూత్రంలో బంగారాన్ని కనుగొనటం చుట్టూ తిరుగుతున్నాయి. 2012లో చైనాలో 49 వేల హైటెక్ కంపెనీలు ఉంటే 2021 నాటికి మూడు లక్షల 30 వేలకు పెరిగాయి. ప్రపంచంలో పరిశోధనకు పెద్ద మొత్తాలలో ఖర్చు చేస్తున్న అగ్రశ్రేణి రెండున్నరవేల కంపెనీలలో చైనావి 680 ఉన్నాయి.

కరోనా, అమెరికా వాణిజ్య పోరు వల్ల చైనా కొన్ని ఇబ్బందులను ఎదుర్కొన్నది. రానున్న మూడు దశాబ్దాల్లో కొన్ని ఇబ్బందులు వచ్చినప్పటికీ అధునిక దేశంగా మారనున్నదని చైనా డైలీ పేర్కొన్నది. ఇప్పటి వరకు ప్రపంచ వినియోగదారులకు సరుకులు అందించిన దేశంగా ఉన్నది కాస్తా అదే ఒక ప్రధాన వినియోగదారుగా మారనున్నది. అందుకు అవసరమైన వస్తూత్పత్తికి పథకాలు వేస్తున్నది. కమ్యూనిస్టు చైనాకు ఇబ్బందులు, సవాళ్లు, వాటిని అధిగమించటం కొత్తేమీ కాదు. సాంకేతిక పరిజ్ఞానాన్నే కాదు, పెట్టుబడులను కూడా రాకుండా అడ్డుకున్న పశ్చిమ దేశాల కుట్రలను ఎదిరించి తాను ఎంచుకున్న మార్గంలో పురోగమించటంలో మరొక దేశానికి పోటీ కాదు, పోటీ లేదు. అణుబాంబు పథకం నుంచి సోవియట్ అర్ధాంతరంగా తప్పుకున్నప్పటికీ తొలి పది సంవత్సరాల్లోనే అణుబాంబును రూపొందించింది. అంతరిక్ష రంగంలో పరిశోధనలకు సోవియట్, తరువాత రష్యా మనకు అందించిన మేరకు కూడా చైనాకు ఇవ్వలేదు. అమెరికా సంగతి చెప్పనవసరం లేదు. అయినా చంద్రుడు, అంగారకుడి మీదకు చైనా సొంతంగా నౌకలను పంపటంతో పాటు అంతరిక్ష కేంద్రం నిర్మాణం కూడా చేస్తున్నది. కృత్రిమ మేథలో సవాలు విసురుతున్నది. అందువలన కుక్క కాటుకు చెప్పు దెబ్బ మాదిరి ఇప్పుడు టెక్ వార్‌లో అమెరికా దాని మిత్ర దేశాల కుట్రలను అధిగమించి స్వావలంబన సాధించనుందనటంలో ఎలాంటి సందేహం లేదు.

(ఫీచర్స్ అండ్ పాలిటిక్స్)

★

కవిత

అంతర్మథనం

నేనిప్పుడు
ఓ చర్చా వస్తువును
ఎప్పుడూ ఏదో ఒక సాకుతో
నాపై వార్త
నాకోసం కాదు!
నా భావాలతో
పని లేకుండా
పనిలేనోళ్ళు నన్ను
నడి బజారులో నిలిపారు.
నా చుట్టూ ఓ అల్లిక
ఆ అల్లికలో వాళ్ళు ఇమిడి
మిగతా వాళ్ళను ఇరికించే
యత్నం.
అందరిలా నేనూ పుట్టాను
నా ఎదుగుదల లో వాళ్ళ
ప్రమేయం లేదు
నా పుట్టుక తెలియదు
నా తిండి తిప్పలు ఎరుగరు
అయినా నన్ను వదలరు
దొరక్క పోయినా వల వేసి
పన్నుతారు కుట్రలు!!
నేను నేనే
నా రంగు నా పాలిట శాపం
నాపై విసిరే రాళ్లతో
మానసిక శారీరక సంఘర్షణ!
అయినా నోరు మెదపలేను!!
ప్రేమ నేనెరుగు
తల్లీ బిడ్డా ప్రేమ ఎవడూ
నేర్పించక్కర్లే!!
నా భావోద్వేగ సంపద నా
సొంతం
ఎవరికి పంచాలో
ఎవరితో పొందాలో ప్రకృతి
నేర్పింది నాకు!!
సంజ్ఞలు నా సంకేతం.
నా సంతోషం
నా హార్మోన్ల ఉత్పత్తి పై
వాడెవడో ఓ కాగితం పై ఓ
వ్రాత ప్రతి జారీ చేస్తే
నేను నా జాతి ని వదిలి
పరజాతి కౌగిల్లో ఒదగాలా?!!
ఆ జాతి కేమో గానీ నాకైతే
జలదరింపు.
నన్ను పెంచిన జాతి
నన్నెరుగు
నా ఆలంబన ఎరుగు
వాళ్ళతోనే కడ దాకా!
అవసాన దశలో మనస్ఫూర్తిగా
నా మేను సైతం వాళ్ళ
కోసమే!!
నన్ను అవసరార్థం వాడుకుని
వదిలేసే వలస జాతి అంటే
అసహ్యం నాకు!!
నేను ఆవుని!!

- గిరిప్రసాద్ చెలమల్లు
సెల్ : 9493388201

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్మెంట్ టెండరు ప్రకటన
Global Investors Summit 2023 March 3 - 4, Visakhapatnam

సుమారు రూ.22.10 లక్షల విలువ గల పనులకు నిట్ నెం. 110 టూ 113/ఇ.ఇ/ఆర్ మరియు బి/ నరసరావుపేట/ 2022-23, తేది: 23.02.2023 ద్వారా టెండర్లు ఆహ్వానించబడుచున్నవి. వివరములు ఇ-మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.in తేది: 06.03.2023, సా.3గం.ల నుండి 20.03.2023, సా.3గం.ల వరకు డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.
సం/- కార్యనిర్వాహక ఇంజనీరు,
(ర.భ) డివిజన్, నరసరావుపేట
DIPRNo:7972/CL/ADVT/1/1/2021-22

DEBTS RECOVERY TRIBUNAL VISAKHAPATNAM
Ground & 1st Floor, Door No. 31-31-21, Sri Sai Baba Street, Narayana Bhavan, Dabagardens, Visakhapatnam-530020

Case No. O.A. 843 / 2021

Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993

Union Bank of India, Behind Hindu College Branch, Guntur - 522004
VS
Sri Srinivasa Agencies
TO,
Def 1 : Sri Srinivasa Agencies, Prop : Ullagula Srinu, D.No. 15-14-83/2, Rahul Gandhi Nagar, 2nd Lane, RTC Colony, Guntur - 522001
Def 2 : Sri Ullagula Srinu, S/o. Nagaiah, D.No. 15-14-83/2, New D.No. 54-13-2695, Ward No. 15, 2nd Line, Rahul Gandhi Nagar, RTC Colony Extension, Guntur
Def 3 : Smt. Aradhyula Sujatha, W/o. Venkata Ramana Rao, D.No. 8-22-61/1, 2nd Lane, Seetharama Nagar, Guntur.
Def 4 : Sri Aradhyula Venkata Ramana Rao, S/o. Sambasiva Rao, D.No. 8-22-61/1, 2nd Lane, Seetharama Nagar, Guntur.

PAPER PUBLICATION

Whereas, OA 843/2021 was listed before Hon'ble presiding Officer / Registrar on 03/03/2023

Whereas this Hon'ble Tribunal is pleased to issue summons / notice on the said application under section 19 (4) of the Act, (OA) filed against you for recovery of debts of **Rs. 82,58,302/-** (application along with copies of documents etc annexed)

In accordance with sub-section (4) of section 19 of the Act, the defendants are directed as under :-

(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted.
(ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application.
(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties.
(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal.
(v) You shall be liable to account for the sale proceeds realised by sale of secured assets or other assets, and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before **Presiding Officer / Registrar on 03/03/2023 at 10.30 A.M.**
failing the application shall be heard and decided in your absence.

Given under my hand and the seal of this Tribunal on this date : 23/02/2023
Signature of the Officer
Authorised to issue Summons

DEBTS RECOVERY TRIBUNAL VISAKHAPATNAM
Ground & 1st Floor, Door No. 31-31-21, Sri Sai Baba Street, Narayana Bhavan, Dabagardens, Visakhapatnam-530020

Case No. O.A. 438 / 2021

Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993

Union Bank of India, Guntur Main Branch, Guntur - 522001
VS
M/s. Abburi Infratech
TO,
Def 1 : M/s. Abburi Infratech, Prop : Sri Abburi Hanumaiah, S/o. Sri Chinna Venkata Subbaiah, D.No. 9/169, Kamathinenivari Palem Village, Narasaraopet District - 522611
Def 2 : Sri Abburi Hanumaiah, S/o. Sri Chinna Venkata Subbaiah, R/o. Flat No. 301, Seetha Anisha Residency, Mehadipatnam, Hyderabad - 500028
Def 3 : Sri Abburi Siva Prasad, S/o. Sri A. Hanumaiah, Flat No. F-3B, Friendly Residency, Vikas Nagar, 1st Lane, Guntur - 522006
Def 4 : Sri Abburi Suresh Babu, S/o. Sri Abburi Hanumaiah, R/o. Flat No. 301, Seetha Anisha Residency, Mehadipatnam, Hyderabad - 500028

PAPER PUBLICATION

Whereas, OA 438/2021 was listed before Hon'ble presiding Officer / Registrar on 08/03/2023

Whereas this Hon'ble Tribunal is pleased to issue summons / notice on the said application under section 19 (4) of the Act, (OA) filed against you for recovery of debts of **Rs. 82,58,302/-** (application along with copies of documents etc annexed)

In accordance with sub-section (4) of section 19 of the Act, the defendants are directed as under :-

(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted.
(ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application.
(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties.
(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal.
(v) You shall be liable to account for the sale proceeds realised by sale of secured assets or other assets, and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before **Presiding Officer / Registrar on 08/03/2023 at 10.30 A.M.**
failing the application shall be heard and decided in your absence.

Given under my hand and the seal of this Tribunal on this date : 23/02/2023
Signature of the Officer
Authorised to issue Summons

DEBTS RECOVERY TRIBUNAL VISAKHAPATNAM
Ground & 1st Floor, Door No. 31-31-21, Sri Sai Baba Street, Narayana Bhavan, Dabagardens, Visakhapatnam-530020

Case No. O.A. 325 / 2022

Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993

Union Bank of India (e-Andhra Bank), Sri Nagar Colony Branch, Guntur District - 522002
VS
M/s. Favourite Fex
TO,
Def 1 : M/s. Favourite Fex, Prop : Sri Kasina Surya Prakash Reddy, S/o. Rama Krishna Reddy, D.No. 7-14-38, 6/2, Valliruvarthota, Guntur.
Def 2 : Sri Kasina Surya Prakash Reddy, S/o. Rama Krishna Reddy, D.No. 24-16-48/A, Opp : Tobacco Board, 12/3 Lane, Srinivasarao Thota, Guntur - 522004
Def 3 : Smt. Shaik Sabeeha Bhanu, W/o. Sri Kasina Surya Prakash, Door No. 25-16-48/A, Opp. Tobacco Board, 12/3 Lane, Srinivasa Rao Thota, Guntur - 522004

PAPER PUBLICATION

Whereas, OA 325/2022 was listed before Hon'ble presiding Officer / Registrar on 07/03/2023

Whereas this Hon'ble Tribunal is pleased to issue summons / notice on the said application under section 19 (4) of the Act, (OA) filed against you for recovery of debts of **Rs.** (application along with copies of documents etc annexed)

In accordance with sub-section (4) of section 19 of the Act, the defendants are directed as under :-

(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted.
(ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application.
(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties.
(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal.
(v) You shall be liable to account for the sale proceeds realised by sale of secured assets or other assets, and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before **Presiding Officer / Registrar on 07/03/2023 at 10.30 A.M.**
failing the application shall be heard and decided in your absence.

Given under my hand and the seal of this Tribunal on this date : 23/02/2023
Signature of the Officer
Authorised to issue Summons

నూతన విద్యావిధానంతో ..

గిరిజన విద్యార్థులకు తీవ్ర నష్టం

- **ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు సిహెచ్.పావని**

ప్రజాశక్తి-అరకులోయ రూరల్ (అల్లూరి సీతారామరాజు జిల్లా)

నూతన ఎడ్యుకేషన్ పాలసీతో గిరిజన ప్రాంతంలో చదువుతున్న విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు సిహెచ్ పావని తెలిపారు. అల్లూరి జిల్లా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన అరకు వేలి గిరిజన సంఘం కార్యాలయంలో మూడు రోజుల పాటు జరగనున్న విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులకు శుక్రవారం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో సుమారు 87 పాఠశాలలు మూసివేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన చాలా దుర్మార్గమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను వ్యాపారంగా మార్చిందన్నారు. గిరిజన పేద విద్యార్థులకు ఉన్నతమైన చదువు అందనీయకుండా ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం చేస్తున్నామని ధ్వజమెత్తారు. సమాజాభివృద్ధికి శాస్త్రీయ విద్యా విధానం, సైన్స్‌ను అభివృద్ధి చేయకుండా బిజెపి, ఆర్ఎస్ఎస్ శక్తులు అడ్డుకుంటున్నాయని చెప్పారు. ఉచిత నిర్బంధ విద్య అందించవలసిన ప్రభుత్వాలు వివిధ రకాల పేర్లతో ప్రభుత్వ పాఠశాలను మూసి వేస్తున్నాయని విమర్శించారు. అరకులోయ మహిళా డిగ్రీ కళాశాలలో కనీస సిబ్బంది లేకుండా కేవలం ఒక ప్రిన్సిపాల్‌తో కళాశాల ప్రారంభించారని, నేటికీ పూర్తి స్థాయిలో అధ్యాపకులు నియమించకపోవడం సిగ్గు చేటన్నారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినుల మరణాలు రోజు రోజుకు పెరుగుతున్నాయని, తక్షణమే హెల్త్ అసిస్టెంట్‌లను రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థులకు గతంలో కాస్మోటిక్ చార్జీలు ఇచ్చేవారని, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమ్మ ఒడి పేరుతో ఒక కుటుంబానికి ఒక విద్యార్థికి మాత్రమే చెల్లిస్తూ మిగితా విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. ఉన్నత విద్య వ్యవస్థలో భవన, యూనివర్సిటీ ఫీజులతో పేద విద్యార్థులను దోపిడి చేస్తున్నారన్నారు. నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా పోరాడి మన హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జీవన్, జిల్లా సహాయ కార్యదర్శి జి.చిన్నారావు, జి.కార్తీక్, అరకువేలి మండల ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ ఎస్.గంగమ్మ, మండల నాయకురాలు పుష్ప, ఎస్ఎఫ్ఐ అరకువేలి మండల అధ్యక్షులు కె.సిమోన్, కార్యదర్శి పి.సరేంద్ర, గిరిజన సంఘం మండల కార్యదర్శి పి.రామన్న విద్యార్థులు పాల్గొన్నారు.

గ్వాంటనామో నిర్బంధ శిబిరాన్ని మూసివేయండి : క్యూబా

హవానా : 120 ఏళ్లగా అమెరికా అక్రమంగా ఆక్రమించిన గ్వాంటనామో బే నిర్బంధ శిబిరాన్ని మూసివేయాలని క్యూబా విదేశాంగ మంత్రి బ్రూనో రోడ్రిగజ్ డిమాండ్ చేశారు. క్యూబా ప్రజల ఇష్టానికి వ్యతిరేకంగా దేశంలో 117 చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని అమెరికా ఆక్రమించిందని అన్నారు. ఇటువంటి అక్రమ ఆక్రమణలకు ముగింపు పలకాలని రోడ్రిగజ్ కోరారు. 1898 స్పానిష్-క్యూబా యుద్ధం సమయంలో అమెరికా గ్వాంటనామో బే నౌకాశ్రయాన్ని ఆక్రమించుకుంది. ప్యూర్టిరికోను ఆక్రమించుకుని, శాంటియాగో డి క్యూబాపై దాడి చేశారు. 1903 డిసెంబర్ నుంచి గ్వాంటనామో బే నిర్బంధ శిబిరాన్ని ప్రారంభించారు.

జి20 సదస్సుతో భారత ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుంది : ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : జి20 సదస్సుకి ఆతిథ్యమివ్వడంతో భారత ఆర్థిక వ్యవస్థ తిరిగి పుంజుకుంటుందని ప్రధాని మోడీ పేర్కొన్నారు. ప్రపంచంలో స్థిరత్వం, విశ్వాసం, వృద్ధిని తిరిగి తీసుకురావడానికి కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జి-20 సమావేశం సందర్భంగా ఆర్థిక మంత్రులు, సెంట్రల్ బ్యాంక్ గవర్నర్లతో ప్రధాని శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ.. వాతావరణ మార్పులు, అధిక రుణాల వంటి ప్రపంచ సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో బహుపాక్షిక బ్యాంకుల అభివృద్ధిని బలోపేతం చేయాల్సి వుందని అన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మహమ్మారి, యుద్ధాలు, రాజకీయ ఉద్రిక్తతలు దెబ్బతీశాయని చెప్పారు. ఈ పరిణామాలతో పలు దేశాలు తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని అన్నారు.

తిరువనంతపురం ఎయిర్‌పోర్టులో ఎమర్జెన్సీ!

తిరువనంతపురం : కేరళ రాజధాని తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో అధికారులు శుక్రవారం ఫుల్ ఎమర్జెన్సీని విధించారు. కాలికట్ నుంచి సౌదీ అరేబియాలోని డమ్మామ్ వెళ్లాల్సిన విమానంలో హైడ్రాలిక్ వైఫల్యం తలెత్తినట్లు తెలుస్తోంది. ఈ విమానాన్ని తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి డైవర్ట్ చేశారు. 182 మంది ప్రయాణికులతో ప్రయాణిస్తున్న ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఐఎక్స్ 385 విమానం శుక్రవారం మధ్యాహ్నం 12.45 గంటల సమయంలో కాలికట్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టును నుంచి టేకాఫ్ అవుతుండగా రన్ వేను ఢీకొట్టింది. విమానం తోకభాగం రన్ వేను బలంగా ఢీకొట్టడంతో... హైడ్రాలిక్ సమస్య తలెత్తినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. తిరువనంతపురానికి మళ్లించిన అనంతరం ఎలాంటి ప్రమాదం జరగకుండా నిండుగా ఉన్న ఇంధనాన్ని విమానం నుంచి అరేబియా సముద్రంలోకి డంప్ చేశారు. దీంతో విమానాశ్రయంలో ఫుల్ ఎమర్జెన్సీని విధించినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి.

30 లక్షల మందికి ఉపాధి లక్ష్యం

- **ప్రజారక్షణ యాత్రలో ఎంవి గోవిందన్**

కోజికోడ్ : ఐదేళ్లలో 30 లక్షల మందికి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కేరళ ప్రభుత్వం కృషి చేస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్ అన్నారు. వయనాడ్, పెంబ్ర తదితర ప్రాంతాల్లో శుక్రవారం ప్రజారక్షణ యాత్ర సాగింది. వయనాడ్‌లో క్రికెటర్లు మిన్ను మణి, సజ్న సజీవన్‌లను ఆయన సత్కరించారు. పెంబ్ర పోరాట యోధులు తదితరులు యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాత్రలో ఆయన మాట్లాడుతూ పినరయి విజయన్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం నిరుద్యోగ సమస్యను పరిష్కరించడమేనని అన్నారు. 20 లక్షల మందికి ఉపాధి కల్పిస్తామని ఎల్‌డిఎఫ్ మేనిఫెస్టోలో ప్రకటించిందని చెప్పారు. రెండేళ్లలో 10 లక్షల మందికి ఉపాధి కల్పించామన్నారు. మరో 20 లక్షల మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామని చెప్పారు. యాత్రకు అడుగడుగునా వేలాదిమంది స్వాగతం పలుకుతూ, స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

ఎల్‌జి ఆదేశాలను పాటించవద్దు

1) ఋణగ్రహీత / హామీదారుల వివరములు : శ్రీమతి లోకన రాజ్యలక్ష్మి, భర్త : ఎల్. చంద్రమోహన్, 77-58-17, ఎవిఎస్ రెడ్డి రోడ్డు, పాయకాపురం, విజయవాడ - 520015. **2) శ్రీ సుబ్బారావు ఓడరేవు,** తండ్రి : ఓడరేవు పుల్లంరాజు, డి.నెం. 20-1-3/1, సి.కె.రెడ్డి రోడ్డు, అయోధ్యనగర్, విజయవాడ - 520003.
బకాయి మొత్తం : ది. 15-04-2021 నాటికి రూ. 25,35,558.55/- (అక్షరాలా ఇరవై ఐదు లక్షల ముప్పై ఐదు వేల ఐదు వందల యాభై ఎనిమిది రూపాయల యాభై ఐదు పైసలు మాత్రమే) మరియు కాంట్రాక్చువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.
ఆస్తి వివరములు : (సేల్ డీడ్ నెం. 5928/2015, తేది : 12-06-2015) షెడ్యూలు -ఎ : కృష్ణా జిల్లా, విజయవాడ, ఆర్.ఎస్.నెం. 18/1, పట్టా నెం. 257, దగ్గరి డోర్ నెం. 43-106/1-44, ప్లాట్ నెం. 5 & 6కి చెందిన ఆస్తి. **హద్దులు : తూర్పు :** పాటిబండ్ల సుందరరావు గారి ఆస్తి - 86.6 అ॥, **దక్షిణం :** ముసునూరి వెంకటేశ్వరరావు గారి విక్రయించిన ఇతరుల ఆస్తి - 60.0 అ॥, **పడమర :** 30 అ॥ వెడల్పు గల రోడ్డు - 86.0 అ॥, **ఉత్తరం :** వై. రవికుమార్ గారికి చెందిన ఆస్తి - 60.0 అ॥. నల్లబోయిన రాజీవ్ కుమార్ గారి ఆస్తి,. పై **సరిహద్దుల మధ్య 575 చ॥గ॥ల ఆస్తి అందలి అవిభక్త వాటా 28.75 చ॥గ॥ల ఆస్తి. మరియు**
షెడ్యూలు - బి : పైన తెలిపిన ఎ షెడ్యూలు కి చెందిన ఆస్తి నందు నిర్మించిన అపార్ట్‌మెంట్ కి చెందిన స్టిల్ట్, గ్రౌండ్, ఫస్ట్, సెకండ్, థర్డ్ & ఫోర్త్ ఫ్లోర్ తో నిర్మించిన శ్రీ లలిత రెసిడెన్సీ నందు 1వ అంతస్తులోని ఫ్లాట్ నెం. 3. **హద్దులు : తూర్పు :** కామన్ కారిడార్, **దక్షిణం :** ఫ్లాట్ నెం. 4, **ఉత్తరం :** శూన్యాకాశము, **ఉత్తరం :** శూన్యాకాశము. పై సరిహద్దుల మధ్య **ఆర్‌సిసి ప్లింత్ ఏరియా 830.00 చ॥అ॥ (కామన్ ఏరియాతో కలిపి) 70.0 చ॥అ॥ల కార్ లేదా స్కూటర్ పార్కింగ్ మరియు అన్ని సౌలభ్య హక్కులతో సహా.**
రిజర్వుధర : రూ. 25,00,000/- ధరావత్తు : రూ. 2,50,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-
2) ఋణగ్రహీత / హామీదారుల వివరములు : మెస్సర్స్ విక్టరీ ఎంటర్‌ప్రైజెస్, శ్రీ మునగాల శ్రీ రామచంద్రమూర్తి, ఫ్లాట్ నెం. ఎ-405, వజ్ర రెసిడెన్సీ, తాడేపల్లి - 522502, గుంటూరు జిల్లా, ఏపి. **2) శ్రీమతి మునగాల ఉమా శ్రీలక్ష్మి,** భర్త : మునగాల శ్రీరామచంద్రమూర్తి, వజ్ర రెసిడెన్సీ, తాడేపల్లి - 522502, గుంటూరు జిల్లా, ఏపి. **3) శ్రీ గోలి రాజేష్‌కుమార్,** తండ్రి : గోలి పూర్ణ చంద్రరావు, డోర్ నెం. 41-20/8-1, హైస్కూల్ రోడ్డు, కృష్ణలంక, విజయవాడ- 520013, ఏపి.
బకాయి మొత్తం : ది. 03-02-2020 నాటికి రూ. 14,96,182.22/- (అక్షరాలా పద్నాలుగు లక్షల తొంభై ఆరు వేల నూట ఎనభై రెండు రూపాయల ఇరవై రెండు పైసలు మాత్రమే) మరియు కాంట్రాక్చువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.
ఆస్తి వివరములు : (సేల్ డీడ్ నెం. 3102/2006, తేది : 25-08-2006) శ్రీ మునగాల శ్రీరామచంద్రమూర్తి గారి పేరిట కృష్ణా జిల్లా, విజయవాడ, రామవరప్పాడు గ్రామం & పంచాయితీ, రాజుల బజారు, పాత అసెస్‌మెంట్ నెం. 324, ఆర్.ఎస్.నెం. 121/4, డి.నెం. 4-104/23 వద్ద డి.నెం. 3-82/2కి చెందిన ఆస్తి నందు సాయి టవర్స్‌లో 3వ అంతస్తులోని ఫ్లాట్ నెం. టిఎఫ్-3. **అపార్ట్‌మెంట్‌కి హద్దులు : తూర్పు :** పంచాయితీ రోడ్డు, **దక్షిణం :** పంచాయితీ రోడ్డు, **పడమర :** శ్రీ లక్ష్మణరాజు, శ్రీమతి తులసమ్మ గార్ల ఆస్తి, **ఉత్తరం :** శ్రీ అడ్డగిరి రాజు గారి ఆస్తి, **ప్లాట్‌కి హద్దులు :** మొత్తం 654 చ॥గ॥ల స్థలములోని అవిభక్త వాటా 20.5 చ॥గ॥ల స్థలము మరియు 582.00 చ॥అ॥ల విస్తీర్ణంలోని నిర్మాణము ఉన్నది. **హద్దులు : తూర్పు :** ఫ్లాట్ నెం. టిఎఫ్-4కి మరియు ఈ ఆస్తికి మధ్య జాయింట్ గోడ, **దక్షిణం :** కారిడార్, **పడమర :** కారిడార్, **ఉత్తరం :** శూన్యాకాశము.
రిజర్వుధర : రూ. 18,00,000/- ధరావత్తు : రూ. 1,80,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-
వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం **https://www.ibapi.in మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వెబ్ సైట్ : **www.unionbankofindia.co.in** నందు చూడగలరు. **అధీకృత అధికారి** గారికి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తులపై ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేదు, ఆసక్తిగల బిడ్డర్లు ఆస్తి పరిశీలన కోసం పైన పేర్కొన్న తేది నందు **మొబైల్ నెం. 9618605125,** బ్రాంచి **Mail ID : ubin801453@unionbankofindia.bank** లలో సంప్రదించవచ్చు.
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 లోని రూలు 8(6)/ రూలు 9(1) అనుసరించి చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకం నోటీసు
చెల్లించవలసిన బకాయిలను పూర్తిగా చెల్లించని సందర్భంలో పైన తెలిపిన తేదీన ఈ-వేలం అమ్మకం నిర్వహణ గురించి సదరు ఋణం తీసుకున్న ఋణగ్రహీత / సహబాధ్యతగల వారికి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని 8(6) రూలు 9(1) క్రింద దీనిని నోటీసుగా పరిగణించవలెను.
తేది : 21-02-2023 సం/- అధీకృత అధికారి,
ప్రదేశం : విజయవాడ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అది ప్రభుత్వ విధానపరమైన బాధ్యత

- నెలసరి సెలవుపై పిటిషనర్‌కు సుప్రీంకోర్టు సూచన

న్యూఢిల్లీ : నెలసరి సెలవుపై విభిన్నమైన 'కోణాలు' ఉన్నాయని సుప్రీంకోర్టు శుక్రవారం వ్యాఖ్యానించింది. ఇది జీవ సంబంధమైన ప్రక్రియ అయినప్పటికీ.. తమ యాజమాన్యాలను నిరాశపర్చకుండా మహిళలు పనిచేయవచ్చునని తెలిపింది. నెలసరి సెలవుపై ఒక విధానాన్ని రూపొందించేందుకు కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖకు విన్నవించుకోవాలని ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం పిటిషనర్‌కు సూచించింది. విద్యార్థినులకు, కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగినులకు నెలసరి సెలవులు మంజూరు చేయడం కోసం నిబంధనలు రూపొందించాలని ప్రభుత్వాలను ఆదేశించాలని కోరుతూ శైలంద్ర మణి త్రిపాఠీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం విచారించింది. 'నెలసరి సెలవులు ఇవ్వాలని యాజమాన్యాలను బలవంతం చేస్తే యాజమాన్యాలు తమ సంస్థల్లో మహిళల నియామకాలను నిరాకరించడానికి ఒక సాధనంగా మార్చుకోవచ్చు' అని కూడా ధర్మాసనం వ్యాఖ్యానించింది.

మాజీ రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ భర్త దేవిసింగ్ మృతి

పుణే : భారత మాజీ రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ భర్త దేవిసింగ్ షెకావత్ శుక్రవారం మృతి చెందారు. కొన్ని రోజుల క్రితం గుండెపోటుకు గురైన 89 ఏళ్ల షెకావత్ ఇక్కడి ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మరణించారు. కొన్ని రోజుల క్రితం షెకావత్ ఈ ఆసుపత్రిలో చేరినట్లు కుటుంబ సభ్యులకు సన్నిహితంగా ఉండే వ్యక్తులు తెలిపారు. 'గుండెపోటు కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటలకు షెకావత్ మరణించారు' అని పేర్కొన్నారు. తరువాత పుణేలోనే శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. ప్రతిభా పాటిల్ - దేవిసింగ్ షెకావత్ దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

పంజాబ్‌లో 12వ తరగతి ఇంగ్లీష్ పేపర్ లీక్

- పరీక్ష రద్దు

చండీగఢ్ : పంజాబ్‌లో షెడ్యూల్ ప్రకారం శుక్రవారం జరగాల్సిన 12వ తరగతి ఇంగ్లీష్ పరీక్షా పేపర్ లీక్ అయింది. దీంతో పరీక్షను రద్దు చేశారు. తదుపరి పరీక్ష తేదీని తరువాత ప్రకటిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 5:15 గంటల వరకూ పంజాబ్ రాష్ట్ర ఎడ్యుకేషన్ బోర్డు (పిఎస్‌ఇబి) 12వ తరగతి ఇంగ్లీష్ పరీక్ష పేపర్ జరగాలి. పేపర్ లీకయిందని ఫిర్యాదు రావడంతో పరీక్షను రద్దు చేస్తున్నట్లు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి హర్‌జోత్ సింగ్ బియాన్స్ శుక్రవారం ఉదయం ప్రకటించారు. ఈ విషయంపై ఉన్నత స్థాయి విచారణకు, తక్షణ చర్యలకు ఆదేశించారు. ఈ నెల 20న ప్రారంభమైన 12వ తరగతి బోర్డు పరీక్షలు ఏప్రిల్ 20 వరకూ జరగనున్నాయి.

నర్సుల్లో మానసిక సంఘర్షణ!

- భయం, కోపోద్రేకం, ఆందోళనతో పోరాడుతున్న కోవిడ్ వారియర్స్
- అధ్యయనం వెల్లడి

పనాజీ : కోవిడ్ విజృంభణ సమయంలో ఆరోగ్య రక్షణ కార్యకర్తల్లో ముందు వరుసలో ఉండి రోగులకు చికిత్స చేసి, వారు కోలుకోవడంలో సహాయం చేసిన నర్సులు ప్రస్తుతం అనేక మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారు. ఈ విషయం ఇటీవల నిర్వహించిన ఓ అధ్యయనంలో వెల్లడైంది. ఇండియన్ జర్నల్ ఆఫ్ సైకియాట్రిక్ నర్సింగ్‌లో ప్రచురించిన ఈ అధ్యయనం ప్రకారం.. కోవిడ్ చికిత్సలో పాల్గొన్న నర్సులు ప్రస్తుతం అలసట, ఒత్తిడి, నిద్రలేమి, నిరాశతోపాటు భయం, కోపోద్రేకం, ఆందోళన వంటి మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారు. కోవిడ్ చికిత్స నిర్వహిస్తున్న సమయంలో ఎనలేని మానసిక సంఘర్షణకు గురికావడంతో నర్సులు ప్రస్తుతం వీటితో బాధపడుతున్నారని అధ్యయనం తెలిపింది. భారత్‌తోపాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నర్సులు ఈ రుగ్మతలతో బాధపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అధ్యయన నివేదికను జి బాలమురుగన్, జి రాధాకృష్ణన్, ఎం విజయరాణి రూపొందించారు. ఈ అధ్యయనంపై పనాజీలో తాజాగా ఇండియన్ సొసైటీ ఆఫ్ సైకియాట్రిక్ నర్సెస్ (ఐఎస్‌పిఎన్) ఒక మీడియా సమావేశం నిర్వహించింది. నర్సుల దుస్థితిని ప్రముఖంగా ప్రస్తావించాల్సిన అవసరం ఉందని పేర్కొంది.

ఏప్రిల్ 7న అంకిత దినోత్సవం

కోవిడ్-19 మహమ్మారి నర్సుల మానసిక ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపిందని ఐఎస్‌పిఎన్ అధ్యక్షులు కె రెడ్డమ్మ తెలిపారు. 'కోవిడ్ సమయంలో రోగులకు అండగా నర్సులు నిలిచారు. నర్సులు ధరించిన పిపిఇ కిట్ల కారణంగా వారు సరిగ్గా ఊపిరి పీల్చుకోలేకపోయారు. ఆస్పత్రుల నుంచి బయటకు వెళ్లలేకపోయారు' అని పేర్కొన్నారు. కోవిడ్ సమయంలో నర్సులు చేసిన కృషికి నివాళిగా ఈ ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని 'అంకిత దినోత్సవం'గా పాటిస్తామని రెడ్డమ్మ తెలిపారు.

జమ్ముకాశ్మీర్‌లో బలవంతపు భూసేకరణ ఆపాలి

- ప్రభుత్వ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలి
- జంతర్ మంతర్ వద్ద ఎఐకెఎస్ ధర్నా
- సీతారాం ఏచూరి సంఘీభావం

ధర్నాలో అభివాదం చేస్తున్న సీతారాం ఏచూరి, తరిగామి, వెంకట్ తదితరులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జమ్ము కాశ్మీర్‌లో బలవంతపు భూసేకరణ ఆపాలని, అక్టోబరు-2020 నాటి ప్రభుత్వ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఎఐకెఎస్, జెకెకెటి ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. బుల్‌డోజర్‌ను ఉపయోగించి బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా జమ్మూ కాశ్మీర్‌లో రైతులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా శుక్రవారం నాడు జంతర్ మంతర్ వద్ద ఎఐకెఎస్, జమ్ము, కాశ్మీర్ కిసాన్ తెహ్రీక్ (జెకెకెటి) ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. ఈ ఆందోళనకు కేంద్ర కమిటీ సభ్యులు యూసఫ్ తరిగామి, ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి వెంకట్, సహాయ కార్యదర్శి విక్రమ్ సింగ్, ఐద్వా ఢిల్లీ అధ్యక్షులు మైమూనా మొల్లా, ఎస్‌ఎఫ్‌ఐ ప్రధాన కార్యదర్శి మయూఖ్ బిస్వాస్, జెఎన్ యుఎస్ యు అధ్యక్షులు ఐషీ ఘోష్ సంఘీభావం తెలిపారు.

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంఘీభావం తెలుపుతూ మాట్లాడారు. ఎన్నో తరాలు అలాంటి భూముల్లోనే ఉంటూ వాటిని సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. ఈ నివాసాలను క్రమబద్ధీకరించాలని, ఈ రైతుల భూమి హక్కులను పరిపాలన విభాగం రక్షించాలని డిమాండ్ చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ బుల్డోజర్లను ఉపయోగించి ఎటువంటి పరిహారం చెల్లించకుండా పేద ప్రజలను భూమి నుండి ఖాళీ చేయిస్తున్నారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమిపై 30 ఏళ్లకు పైగా నిరంతరాయంగా ఆధీనంలో ఉన్నవారు క్రమబద్ధీకరణకు హక్కులు పొందవచ్చని సుప్రీంకోర్టు ఆదేశాలున్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వ భూమిలో ఆక్రమణదారుల హక్కులను గుర్తిస్తూ 1924 నుండి ఇప్పటి వరకు అనేక ప్రభుత్వ ఉత్తర్వులు, నోటిఫికేషన్లు ఉన్నాయని తెలిపారు.

ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి విజూకృష్ణన్, జెకెకెటి ప్రధాన కార్యదర్శి జహూర్ అహ్మద్ మాట్లాడుతూ.. ముందున్న అన్ని భూచట్టాలను రద్దు చేసి, జమ్ము కాశ్మీర్ వెలుపల ఉన్నవారు భూమిని కొనుగోలు చేయడం సులభతరం చేశారని విమర్శించారు. జమ్మూ, కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ఆయన పరిపాలన అధికారులు వివిధ జిల్లాల్లో వందలాదిమంది పేద రైతులు, చిన్న ఉత్పత్తిదారులపై బుల్డోజర్లను ఉపయోగించి వేధిస్తున్నారని చెప్పారు. వారిని వారి ఇళ్ల నుండి బలవంతంగా తొలగించి, భూమిని గుంజుకుంటున్నారని విమర్శించారు. దశాబ్దాలుగా సాగు చేస్తున్న ప్రభుత్వ భూమిపై ఆధారపడిన గ్రామాల్లో చిన్న, సన్నకారు నివసిస్తున్న రైతులకు, భూ నిర్వాసితులకు నష్టం కలిగించే ఇలాంటి చర్యలను ఆపాలని డిమాండ్ చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ ఆధ్వర్యంలోని ప్రస్తుత పరిపాలన.. నిర్వాసితులను భూ కబ్జాదారులుగా ముద్రవేయడం అన్యాయమే కాకుండా పూర్తిగా తప్పుదారి పట్టించేదని విమర్శించారు. ఇలాంటి చట్టవ్యతిరేక చర్యలను రైతులు, ప్రజలు సాధారణంగా సహించలేరని, రానున్న రోజుల్లో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు. జమ్ముకాశ్మీర్‌లోని రైతుల భూమి, జీవనోపాధిపై వారి హక్కులను పరిరక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎఐకెఎస్ డిమాండ్ చేస్తుందని చెప్పారు. అటవీ హక్కుల చట్టం అమలును నిర్ధారించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా జమ్ము కాశ్మీర్ అంతటా రైతులు నిరసనలు చేస్తున్నారని, ఈ నోటిఫికేషన్‌ను వ్యతిరేకిస్తూ రాజకీయ పార్టీలు కూడా రంగంలోకి దిగాయని పేర్కొన్నారు. ధర్నాలో ఎఐకెఎస్ కోశాధికారి పి కృష్ణ ప్రసాద్, ఎఐకెఎస్ ఉపాధ్యక్షులు ఇంద్రజిత్ సింగ్, జెకెకెటి జమ్ము ప్రాంతీయ కార్యదర్శి కిషోర్ కుమార్, ఎఐకెఎస్ హర్యానా రాష్ట్ర కార్యదర్శి సుమిత్ దలాల్, జమ్మూ కాశ్మీర్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన రైతులు పాల్గొన్నారు.

కేంద్ర హోంశాఖ వైఫల్యం వల్లే హింస

- నిజనిర్ధారణ కమిటీ
- ఢిల్లీ హింసాత్మక అల్లర్లకు నేటికి మూడేళ్లు

న్యూఢిల్లీ : నేటికి సరిగ్గా మూడేళ్ల క్రితం చోటుచేసుకున్న ఢిల్లీ అల్లర్లు ఇప్పటికీ మానని గాయాలను మిగిల్చాయి. బిజెపి నాయకుల తీరుతో ఆ అల్లర్లు రెండు వర్గాల మధ్య గొడవగా చిత్రీకరించబడ్డాయి. వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)పై కేంద్రం మొండి వైఖరిపై అప్పట్లో దేశరాజధానితో పాటు వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున నిరసనలు, ప్రదర్శనలు, ఆందోళనలకు దారి తీసిన విషయం తెలిసిందే. ఈశాన్య ఢిల్లీలో ఈ ఆందోళనలు తారాస్థాయికి చేరాయి. భౌతిక దాడులు, రాళ్ల విసురుకోవడంతో పాటు.. కొందరు వ్యక్తులు తుపాకులతో రావడం వంటి దృశ్యాలు కనబడ్డాయి. ఈ ఘటనలో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, పోలీసుల వైఫల్యాన్ని నిజనిర్ధారణ కమిటీ ఎత్తి చూపింది. అల్లర్లతో ప్రభావితమైన ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించడంలో ఆలస్యం చేసిందని, ప్రత్యేక బ్రాంచ్, నిఘా విభాగాల నుంచి వచ్చిన హెచ్చరికలను ఢిల్లీ పోలీసులు లెక్క చేయలేదని వివరించింది. మీడియా కథనాలు, బిజెపి నాయకుల వ్యవహార శైలి వంటి కారణాలతో ఈశాన్య ఢిల్లీ అల్లర్లు మూడు రోజులపాటు కొనసాగి తీవ్ర ఆస్తి, ధన, ప్రాణ నష్టాలను మిగిల్చాయని కమిటీ వెల్లడించింది. 2020 ఫిబ్రవరి అల్లర్లపై సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి మదన్ బి లోకూర్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల నిజ నిర్ధారణ కమిటీ దర్యాప్తు జరుపుతున్నది. కేంద్ర హోంశాఖ, ఢిల్లీ పోలీసుల నిర్లక్ష్య వైఖరిని కమిటీ ఎత్తి చూపటంతో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. అల్లర్లు మొదలయ్యే రోజు ఫిబ్రవరి 23న ఢిల్లీ పోలీసులకు స్పెషల్ బ్రాంచ్, నిఘా యూనిట్ల నుంచి ఆరుసార్లు హెచ్చరికలు వచ్చినా పట్టించుకోలేదని వివరించింది. ఆ తర్వాత రెండు రోజుల వరకూ అల్లర్లు చోటుచేసుకున్న ప్రాంతాలకు అదనపు బలగాలు చేరుకోలేదు. చివరకు ఫిబ్రవరి 26న అదనపు బలగాలను మోహరించడం గమనార్హం. కేంద్ర హోంశాఖ చూపిన ఉదాసీన వైఖరి అల్లర్లు చేసేవారికి ఊతమిచ్చినట్టయిందనీ, వరుసగా మూడు రోజులపాటు హింసను మరింతగా సృష్టించారనీ కమిటీ వివరించింది.

ఎఫ్‌ఐఆర్‌పై కోర్టులో సాక్షాత్తూ ఢిల్లీ పోలీసులు దాఖలు చేసిన చార్జిషీటు.. కమిటీ ఆరోపణలకు బలాన్ని చేకూర్చేలా ఉండటం గమనార్హం. ఈ ఎఫ్‌ఐఆర్‌లో సామాజిక కార్యకర్తలు, విద్యార్థి నాయకులు ఉమర్ ఖాలీద్, ఖాలీద్ సైఫీ, ఇష్రత్ జహన్, గుల్ఫిషా ఫాతిమా, సఫూరా ఝర్గార్, నటాషా నార్వల్, దేవాంగన కలిత, ఇతరులపై ఉపా కింద పేర్లు చేర్చిన విషయం విధితమే. ఢిల్లీ అల్లర్లు చెలరేగిన 23, 24, 25 తేదీల్లో మోహరించిన ఢిల్లీ పోలీసులతో పాటు కేంద్ర బలగాల సిబ్బంది సంఖ్య 1400 మంది లోపే ఉంది. 26న ఆ సంఖ్య 4,200కు పైగా చేరుకుంది. 25న 3,500 అత్యవసర ఫోన్ కాల్స్ రాగా, 26న 1500కు పడిపోయాయి. మొత్తానికి కేంద్ర హోంశాఖ నిర్లక్ష్య వైఖరి, ఢిల్లీ పోలీసుల సహకారం, మీడియా విభజిత కథనాలు, సిఎఎకు వ్యతిరేకంగా దాదాపు రెండు నెలలకు పైగా నిరసనల్లో ఉన్న ముస్లిములకు వ్యతిరేకంగా బిజెపి చేసిన ద్వేషపూరిత ప్రచారం.. ఢిల్లీ అల్లర్లకు కారణమైందని కమిటీ తన దర్యాప్తులో వివరించింది.

ఔరంగాబాద్, ఉస్మానాబాద్ పేర్ల మార్పునకు కేంద్రం ఓకే

ముంబయి: మహారాష్ట్రలోని ఔరంగాబాద్, ఉస్మానాబాద్ నగరాల పేర్ల మార్పునకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఔరంగాబాద్‌ను ఛత్రపతి శంభాజీనగర్‌గా, ఉస్మానాబాద్ నగరాన్ని ధారాశివ్‌గా పేర్లు మారుస్తూ గతంలో మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి ఆమోద ముద్ర వేసింది. ఈ విషయాన్ని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడణవీస్ ట్విటర్‌లో వెల్లడించారు. ఈ మేరకు కేంద్ర హెూంమంత్రిత్వశాఖ జారీ చేసిన లేఖలను ఆయన షేర్ చేశారు. నగరాల మార్పుపై తమకెలాంటి అభ్యంతరం లేదని కేంద్రం తెలిపింది. ఈ నిర్ణయంపై ప్రధాని నరేంద్ర మోడీ, హెూంమంత్రి అమిత్ షాలకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చిందని పేర్కొన్నారు. ఈ రెండు నగరాలకు పేరు మార్చాలంటూ కొంతకాలం నుంచి డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఉద్ధవ్ ఠాక్రే సారథ్యంలోని మహావికాస్ అఘాడీ ప్రభుత్వం కుప్పకూలడానికి ముందు ఈ రెండు నగరాల పేర్లను మారుస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అయితే, ఆ తర్వాత బిజెపి సహకారంతో ముఖ్యమంత్రి అయిన ఏక్‌నాథ్ ప్రభుత్వం గత ప్రభుత్వ నిర్ణయాన్ని రద్దుచేసి.. ఈ నగరాల పేర్ల మార్పుపై తాజాగా నిర్ణయం తీసుకుంది.

రణరంగంగా ఢిల్లీ కార్పొరేషన్ కార్యాలయం

- స్టాండింగ్ కమిటీ ఎన్నిక ప్రక్రియకు బిజెపి అంతరాయం
- ఢీ అంటే ఢీ అన్న ఆప్ సభ్యులు

న్యూఢిల్లీ : ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (డిఎంసి) కార్యాలయం శుక్రవారం రణరంగంగా మారిం ది. కార్యాలయంలో జరు గుతున్న స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక ఓట్ల లెక్కింపును బిజెపి కౌన్సిలర్లు అడ్డుకోవడానికి ప్రయత్నించగా, ఆప్ కౌన్సిలర్లు వ్యతిరేకించారు. దీంతో ఉద్రిక్త వాతావరణ నెలకొంది. ఆప్ కౌన్సిలర్లు, బిజెపి కౌన్సిలర్లు పరస్పరం పిడిగుద్దులతో విరుచుకుపడ్డారు. జట్టు పట్టుకొని ఒకరినొకరు ఈడ్చుకున్నారు. చొక్కాలు చించుకుంటూ తీవ్ర గందరగోళం సష్టించారు. కమిటీ సభ్యుల ఎన్నికలో అభ్యర్థులు వేసిన ఒక ఓటు చెల్లలేదని మేయర్ ప్రకటించడంతో ఓట్ల లెక్కింపు ప్రక్రియను బిజెపి అడ్డుకుంది. దీంతో, ఘర్షణ ప్రారంభమైంది. చివరికి చెల్లుబాటు కాని ఓటును పరిగణనలోకి తీసుకోకుండానే ఫలితాన్ని వెల్లడిస్తానని మేయర్ ప్రకటించారు. ఆరుగురు సభ్యులతో ఏర్పాటు చేయనున్న స్టాండింగ్ కమిటీకి ఏడుగురు అభ్యర్థులు పోటీ పడ్డారు.

కాంగ్రెస్ ప్లీనరీ సమావేశాలు ప్రారంభం

- అధ్యక్షుడికే సిడబ్ల్యుసి ఎంపిక బాధ్యతలు

రాయ్‌పూర్ : మూడు రోజులపాటు జరిగే కాంగ్రెస్ పార్టీ 85వ ప్లీనరీ సమావేశాలు శుక్రవారం ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా పార్టీ స్టీరింగ్ కమిటీ శుక్రవారం ఉదయం సమావేశమైంది. ఈ సమావేశంలో సిడబ్ల్యుసి సభ్యులను పార్టీ అధ్యక్షుడే ఎన్నుకునేలా ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ కీలక సమావేశానికి పార్టీ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా హాజరు కాకపోవడం విశేషం. కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో సమావేశమైన కీలకమైన స్టీరింగ్ కమిటీ.. మూడు రోజుల సమావేశాల అజెండాకు తొలుత ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ప్రారంభోపన్యాసం చేసిన ఖర్గే సిడబ్ల్యుసి ఎన్నిక నిర్వహించడంపై సభ్యులు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు తెలపాలని పార్టీ నేతలకు విజ్ఞప్తి చేశారు. సభ్యులు దీనిపై భిన్నాబి. ప్రాయాలు వ్యక్తం చేసినా, సిడబ్ల్యుసి సభ్యుల ను పార్టీ అధ్యక్షుడు నామినేట్ చేసేలా స్టీరింగ్ కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు ఆ పార్టీ జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్ వెల్లడించారు. పార్టీకి చెందిన మాజీ ప్రధానులు, మాజీ రాష్ట్రపతులకు వర్కింగ్ కమిటీలో చోటు ఉండేలా పార్టీ నిబంధనల్లో సవరణ చేసేందుకు కమిటీ నిర్ణయం తీసుకుంద న్నారు. చివరిసారిగా 1997లో సిడబ్ల్యుసి ఎన్నికలు జరిగాయి.

కొనసాగుతున్న బిహెచ్‌యు నర్సింగ్ విద్యార్థుల సమ్మె

లక్నో : హాస్టల్స్ సదుపాయం, స్టైఫండ్స్, ఇంటర్న్‌షిప్‌లతో పాటు ఇతర డిమాండ్లను నెరవేర్చాలంటూ నర్సింగ్ విద్యార్థులు చేపడుతున్న సమ్మె కొనసాగుతోంది. సకాలంలో పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ... వారణాసిలోని బనారస్ హిందూ యూనివర్శిటీ (బిహెచ్‌యు)కి చెందిన నర్సింగ్ విద్యార్థులు ఐదు రోజుల నుంచి సమ్మె చేపడుతున్నారు. నిబంధనలకు అనుగుణంగా ఆరునెలల ఇంటర్న్‌షిప్ సమయంలో విద్యార్థులకు నెలకు రూ.13 వేల స్టైఫండ్‌ను ఇవ్వాలని విద్యార్థులు కోరుతున్నారు. ఎంఎస్‌సి నర్సింగ్ కోర్సులతో ఇతర కోర్సుల ప్రవేశాల్లో 25 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆందోళన చేపడుతున్న విద్యార్థుల్లో ఒకరి ఆరోగ్యం క్షీణించినప్పటికీ.. యాజమాన్యం పట్టించుకోలేదని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమ్మె విరమించాలంటూ యాజమాన్యం నోటీసులు పంపిందని ఓ విద్యార్థి మీడియాకు తెలిపారు. 2020 నుంచి పదేపదే నిరసనలు చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. నర్సింగ్ విద్యార్థులకు ప్రాధాన్యత ప్రాతిపదికన హాస్టల్ వసతి కల్పిస్తామని గతేడాది హామీ ఇచ్చారని.. ఇప్పటికీ హామీని పట్టించుకోలేదని విమర్శించారు. హాస్టళ్లలో రూములన్నీ ఖాళీగా ఉన్నప్పటికీ విద్యార్థులకు కేటాయించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాంకేతిక సమస్య కారణంగా హాస్టల్ వసతి కల్పించలేక పోతున్నామంటూ యాజమాన్యం దాటవేస్తోందని అన్నారు. కొన్నిసార్లు అర్ధరాత్రి వరకు పనిచేస్తున్నామని.. రవాణా సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని మరో విద్యార్థి రాహుల్ తెలిపారు. ఆస్పత్రికి కిలోమీటరు పరిధిలోనే హాస్టల్స్ అందుబాటులో ఉంచాలని నిబంధనలు ఉన్నప్పటికీ యాజమాన్యం పట్టించుకోవడం లేదని అన్నారు. షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహించడం లేదని.. దీంతో సిలబస్ పూర్తయినా చాలా సమయం వృథా అవుతోందని చెప్పారు.

మీడియాను అడ్డుకోవాలా?

- అలాంటి ఉత్తర్వులు ఇవ్వలేం : సుప్రీంకోర్టు
- పిటిషన్ తిరస్కరణ

న్యూఢిల్లీ : హిండెన్‌బర్గ్ నివేదికపై మీడియాలో వార్తా కథనాలు రాకుండా ఆదేశాలు జారీచేయాలన్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. అదానీ-హిండెన్‌బర్గ్ కేసుపై సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా న్యాయవాది ఎం.ఎల్.శర్మ దాఖలు చేసిన పిటిషన్ సిజెఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ముందుకు వచ్చింది. దీనిపై ఆయన స్పందిస్తూ.."పిటిషన్‌లో కోరినట్టుగా ఇంజక్షన్ ఆర్డర్ జారీచేయలేం. అదానీ-హిండెన్‌బర్గ్ కేసులో సుప్రీంకోర్టు ఉత్తర్వులు త్వరలో వెలువడతాయి" అని చెప్పారు. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ స్థాపకుడు నాథన్ అండర్‌సన్‌కు వ్యతిరేకంగా ఎఫ్‌ఐఆర్ దాఖలు చేయాలని, దీనిపై సెబీ, భారత ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేయాలని తన పిటిషన్‌లో శర్మ కోరారు. హిండెన్‌బర్గ్ నివేదికలో వెలువడ్డ అక్రమాలపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తులతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలని మరో పిటిషన్ దాఖలైంది. న్యాయవాది విశాల్ తివారీ ఈ పిటిషన్ వేశారు.

ఉక్రెయిన్‌పై తీర్మానానికి భారత్ దూరం

- మరో 31 దేశాలు కూడా...
- అనుకూలం 141, వ్యతిరేకం 7



ఐక్యరాజ్య సమితి: ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యాకు వ్యతిరేకంగా ఐరాస జనరల్ అసెంబ్లీలో అమెరికా, ఐరోపా కూటమి ప్రోద్బలంతో తెచ్చిన తీర్మానానికి భారత్, చైనాతో సహా 32 దేశాలు దూరంగా ఉన్నాయి. ఈ తీర్మానానికి అనుకూలంగా 141 దేశాలు ఓటు చేయగా, రష్యాతో సహా ఏడు దేశాలు వ్యతిరేకించాయి. చట్టబద్ధంగా కట్టుబడి ఉండనక్కర్లేని ఈ తీర్మానం ఉక్రెయిన్ నుంచి రష్యా వెంటనే పూర్తిగా, బేషరతుగా తమ దళాలను ఉపసంహరించుకోవాలని కోరుతోంది. ఉక్రెయిన్ ఘర్షణను .' రష్యా దురాక్రమణ' గా అది వర్ణించింది. రష్యా దీనిని తీవ్రంగా ఖండించింది. పశ్చిమ దేశాలు స్పాన్సర్ చేసిన ఈ తీర్మానం ఉక్రెయిన్ ఘర్షణను అంతమొందించేందుకు గల అవకాశాలను దెబ్బతీసేదిగా ఉందని ఐరాసలో రష్యా రాయబారి నెబెంజియన్ పేర్కొన్నారు. రష్యా, ఉక్రెయిన్ ఘర్షణకు శాంతియుత పరిష్కారం కనుగొనేందుకు సత్వరమే చర్చలు ప్రారంభించాలని చైనా కోరింది. ఇందుకు 12 అంశాలతో కూడిన రాజకీయ రోడ్డుమ్యాప్‌ను అది ప్రతిపాదించింది. ఈ మేరకు చైనా తన విదేశాంగ శాఖ వెబ్‌సైట్‌లో ఒక ప్రకటన ఉంచింది. ఇరు పక్షాలు సహేతుకంగా, సంయమనంతో వ్యవహరించాలని, నేరుగా చర్చలు జరుపుతూ ఈ సమస్యకు ఎంత త్వరగా పరిష్కారం చూపితే అంత మంచిదని పేర్కొంది. 2014లో పశ్చిమ దేశాల మద్దతుతో కీవ్‌లో తిరుగుబాటు వచ్చిన తరువాత డొనెట్స్క్, లుగాన్స్క్ పీపుల్స్ రిపబ్లిక్‌లు ఉక్రెయిన్ నుంచి విడిపోయి రష్యాలో చేరాయి. సెప్టెంబరులో రిఫరెండమ్ తరువాత ఈ పరిణామం చోటు చేసుకుంది. అమెరికా తన ప్రపంచాధిపత్యాన్ని కొనసాగించడం కోసం రష్యా, చైనాలను లక్ష్యంగా చేసుకుని, వాటిని బలహీనపరచాలని చూస్తోంది. రష్యాను దెబ్బ తీయడం కోసం ఉక్రెయిన్‌ను ఒక ప్రయోగశాలగా అవి చేసుకుని, యుద్ధాన్ని మరింత కాలం సాగదీసేలా పథక రచన చేస్తున్నాయి. ఉక్రెయిన్‌కు రుణ సాయం కింద నగదుకు బదులు ఆయుధాలు ఇస్తూ రష్యాపైకి ఎగదోస్తున్నాయి. ఉక్రెయిన్ యుద్ధానికి ఏడాది గడచిన సందర్భంగా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పోలండ్‌లో ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ, రష్యాకు వ్యతిరేకంగా ఉక్రెయిన్ యుద్ధం కొనసాగుతుందని, అందుకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు.

ఐఎస్‌ఎస్‌లోకి రష్యా కొత్త రెస్క్యూ క్యాప్సూల్స్

రష్యా : రష్యా కొత్త రెస్క్యూ క్యాప్సూల్స్‌ను శుక్రవారం కజికిస్తాన్ నుంచి పంపించింది. వ్యోమగాములకు సంబంధించిన సామాగ్రిని ఈ రెస్క్యూ తీసుకెళుతుందని ఐఎస్ఎస్ అధికారులు వెల్లడించారు. ఇది మరో రెండు రోజుల్లో అంతరిక్ష కేంద్రంలోకి ప్రవేశించనుందని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. అమెరికాకు చెందిన ఫ్రాంక్ రూబియో, రష్యా వ్యోమగాములు డిమిత్రి, పెటెలిన్, సెర్గీ ప్రోకోపీవ్ ఐఎస్ఎస్ (అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం)కి గత సెప్టెంబర్‌లో చేరుకున్నారు. వారి మిషన్ మరో ఆరు నెలలపాటు కొనసాగనుంది. వారి రిటర్న్ వాహనం శీతలీకరణని లీక్ సిందని, మైక్రోమీటర్స్ అలా జరగడానికి కారణమై ఉండొచ్చునని అమెరికా, రష్యన్ అంతరిక్ష అధికారులు భావించారు. కొంత ఆలస్యమైనా వ్యోమగాములకు కావలసిన సామాగ్రిని రెస్క్యూ క్యాప్సూల్స్ ద్వారా శుక్రవారం అంతరిక్షంలోకి రష్యా పంపించింది. ఈ వ్యోమగాములు ఈ ఏడాది సెప్టెంబర్ వరకు ఐఎస్ఎస్‌లోనే ఉండనున్నారు. కొత్త వ్యోమగాములు వెళ్లేందుకు సిద్ధమైన ప్పుడు మాత్రమే వారు భూమికి తిరిగిరానున్నారని ఐఎస్ఎస్ అధికారులు వెల్లడించారు.

క్రూయిజ్ క్షిపణులు పరీక్షించిన ఉత్తర కొరియా

సియోల్ : ఉత్తర కొరియా తన తూర్పు తీర ప్రాంతంలో శుక్రవారం నాలుగు లాంగ్ రేంజ్ క్రూయిజ్ క్షిపణులను పరీక్షించింది. తమ ప్రత్యర్థి దేశాలు సైనిక విన్యాసాలను తీవ్రతరం చేసిన నేపథ్యంలోనే క్షిపణుల ప్రయోగం నిర్వహించినట్లు ఉత్తర కొరియా ప్రకటించింది. శుక్రవారం ప్రయోగించిన నాలుగు క్షిపణులు సుమారు మూడు గంటల పాటు ప్రయాణం చేసి సుమారు రెండు వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలనూ కచ్చితత్వంతో చేధించినట్లు తెలిపింది.

ఒపిఎస్ పునరుద్ధరణ

(మొదటి పేజీ తరువాయి)

రూపకల్పన చేసిందని విమర్శించారు. నూతన పెన్షన్ విధానానికి భూమికగా ఉన్న పిఎఫ్‌ఆర్‌డిఎ చట్టాన్ని తక్షణం ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. నూతన ఆర్థిక విధానాల్లో భాగంగా వచ్చిన పెన్షన్ లేని నూతన పెన్షన్ విధానం భవిష్యత్తులో ఉద్యోగులకి ఆర్థిక నష్టాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఎన్ఎస్‌డిఎల్‌లో మదుపు చేసిన సొమ్మును తిరిగి రాష్ట్రాలకు చెల్లించబోమని చెప్పటంపై మండిపడ్డారు. సిపిఎస్‌ను రద్దు చేయకుండా రాష్ట్రాలను నియంత్రించే విధంగా కేంద్ర ప్రభుత్వ చర్యలు ఉన్నాయని విమర్శించారు. రాజ్యాంగ విలువలను, జాతీయ సమైక్యత భావాలను విద్యావిధానం నేర్పాల్సి ఉందన్నారు. విద్య వ్యాపారం చేయటాన్ని, విద్య కేంద్రీకరణ చేయటాన్ని ప్రోత్సహించే జాతీయ విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఖాళీగా ఉన్న అన్ని ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం సిపిఎస్‌ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించకపోతే జాతీయ స్థాయిలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్‌టిఎఫ్‌ఐ జాయింట్ జనరల్ సెక్రటరీ సుకుమార్ పైన్, కోశాధికారి ప్రకాష్ చంద్ర మొహంతి మాట్లాడుతూ డిమాండ్లు నెరవేర్చకుంటే రాష్ట్రపతికి లక్షలాది మంది ఉపాధ్యాయుల సంతకాలతో కూడిన మెమొరాండం అందజేస్తామని స్పష్టం చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చేవరకు దేశవ్యాప్త ఆందోళన కొనసాగిస్తామని ఉపాధ్యాయులు హెచ్చరించారు. ఎస్‌టిఎఫ్‌ఐ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్.టి.శివరాజన్, మోహన్‌దాస్ పండిట్, ఎస్. మయిల్, మహావీర్ సిహాగ్, బినోద్ బిహారీ పాణిగ్రాహి, చారులత మహపాత్ర, జాతీయ కార్యదర్శి బద్రునిసా, మహ్మద్ అల్లావుద్దీన్, కృష్ణ ప్రసన్న భట్టాచార్య, నాగేంద్ర సింగ్, సాయిబల్ రాయ్, ధర్మేంద్ర సింగ్ ఎ. శంకర్ తదితరులు పాల్గొన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు యూసఫ్ తరిగామి, జెఎన్ యు ఎస్ యు అధ్యక్షురాలు ఐషీఘోష్ సంఘీభావం తెలిపారు.

ఎపి, తెలంగాణ నాలుగొందల మంది హాజరు

ఎస్‌టిఎఫ్‌ఐ పిలుపు మేరకు పార్లమెంట్ మార్చ్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణల నుంచి యుటిఎఫ్ తరపున 400 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఎ.ఎస్ కుసుమకుమారి, రాష్ట్ర కోశాధికారి బి. గోపి మూర్తి, పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు పిఎస్ విజయరామరాజు, డి అపర్ణ, ఎం శ్రీలక్ష్మి, సి హెచ్ పట్టాభి రామయ్య, కె. కమల కుమార్, ఎస్. రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

మీకోసం

రాజ్‌మా గింజలు ఉడికించేటప్పుడు కొద్దిగా ఇంగువ, శొంఠిపొడి వేస్తే అవి తిన్నప్పుడు గ్యాస్ ఫామ్ అవ్వకుండా ఉంటుంది.

జీవన సౌరభం

గొప్పగా జీవించడం అంటే ఆడంబరంగా జీవించడం కాదు.. ఆనందంగా జీవించడం.

JEEVANA జీవన the family

కోతి మోసం



కొండకు దగ్గరలో కొండకింది గూడెం అనే పల్లెటూరు ఉంది. కొండ మీద చెట్లపై కోతులు, కాకులు, పక్షులు చాలా ఉండేవి. వాటికి ఆకలి వేసినప్పుడు గ్రామంలో వచ్చేవి. ఇండ్లపైన తిరుగుతూ దొరికింది తీసుకుని తినేవి.

గ్రామంలో లచ్చమ్మ పక్షులు, జంతువుల కోసమని వాకిట్లో నూకలు పోసేది. ఒకరోజు గోడపైన అరిసెను పెట్టింది. అది చూసిన కాకి ఒక్క ఉదుటున వచ్చి ముక్కుతో అరిసెను కరచుకొని వెళ్లి వేపచెట్టు కొమ్మపై వాలింది. అది చూసిన కోతి 'ఈరోజు ఎక్కడా ఆహారం దొరకలేదు. బాగా ఆకలిగా ఉంది. ఎలాగైనా కాకి మామ నుంచి అరిసెను సంపాదించాలి' అనుకుంది.

వెంటనే 'కాకి మామా! కాకి మామా! నువ్వు ఒక్క అరిసెనే తెచ్చుకున్నావా? ఆ గోడపైన ఇంకా చాలా ఉన్నాయి. నేను కడుపు నిండా తిని వస్తున్నా. నువ్వు కూడా వెళ్లి ఇంకొన్ని అరిసెలు తెచ్చుకో! కొన్ని రోజుల పాటు నీకు ఆహారం కోసం అన్వేషించే పని ఉండదు.' అని ఆశ కలిగించింది.

దాని మాటలు నమ్మిన కాకి 'నీ మంచి మనసుకు కృతజ్ఞతలు! ఇప్పుడే వెళ్లి అరిసెలు తీసుకొస్తాను' అని తెచ్చుకున్న అరిసెను వేప కొమ్మపై ఉంచి వెళ్ళింది. సమయం కోసం ఎదురు చూస్తున్న కోతి చెట్టు కొమ్మ మీద ఉన్న ఆ అరిసెను తినేసింది. అక్కడికి వెళ్ళిన కాకికి నిరాశ ఎదురైంది. కోతి మోసాన్ని గ్రహించిన కాకి మళ్లీ ఆహారం కోసం బయలుదేరింది. ఎవరి మాటల వెనక ఏ ఉద్దేశముందో ముందే గ్రహించలేకపోతే– ఇలాగే మోసపోతామని గ్రహించింది.

- ముక్కామల జానకీరామ్
కొండకింది గూడెం, కేతేపల్లి, నల్లగొండ.

చుక్కలు కలపండి

చిన్నారులూ, ఇక్కడ అంకెలు, సంఖ్యల దగ్గర చుక్కలను ఒకదాని తర్వాత ఒకటి కలపండి. ఏ బొమ్మ వచ్చిందో చూడండి.



నేను గీసిన బొమ్మ



- ఎ.జీవిత,
8వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
యాదమరి,
చిత్తూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ప్రతిభను గుర్తించే ప్రయత్నమే లేదు!

భారతదేశం రానున్న రోజుల్లో ప్రపంచంలోనే అత్యధిక జనాభా గల దేశంగా మారబోతోంది. కానీ, క్రీడల్లో.. శాస్త్రీయ విజ్ఞానానికి కొలబద్దయిన పేటెంట్లు పొందడంలో ఇతర చిన్న దేశాల కంటే వెనకబడింది. సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చి, డ్యూక్ యూనివర్సిటీ విద్యార్థులు సుజీత్ కుమార్, అనిరుధ్ కృష్ణ ఈ విషయంపై లోతైన పరిశీలన చేశారు. ఆ వివరాలు ఒకసారి చూద్దాం.

90 లక్షల స్వీడన్ దేశ జనాభా 2016 ఒలింపిక్ పోటీల్లో 11 పతకాలు సాధించింది. అంటే పది లక్షల కంటే ఎక్కువ జనాభాకు ఒక్కొక్క పతకం వచ్చినట్లు. అలాగే 300 శాస్త్రీయ పేటెంట్ హక్కులను సొంతం చేసుకుంది. ఆ జనాభాకు వంద రెట్లు అధికమైన మనదేశం అదే సంవత్సరం రెండు పతకాలతో సరిపెట్టుకుంది. 50 కోట్ల పైచిలుకు జనాభాకు ఒక పతకం వచ్చినట్లు.. అలాగే చాలా తక్కువ పేటెంట్లు పది లక్షల జనాభాకు 6.25 శాస్త్రీయ పేటెంట్ల దరఖాస్తు చేయబడ్డాయి. ఈ అంశాన్ని పరిశీలించినప్పుడు మన దేశం ప్రతిభను కోల్పోయిందా.. లేక దాని ప్రతిభ ప్రభావవంతంగా బయటపడడం లేదా? అనే ప్రశ్న ఉదయిస్తుంది. దీనికి సమాధానం దొరకాలంటే మనం మూలాల్లోకి వెళ్లాలి.

ఏ దేశమైనా అభివృద్ధి పథంలో అడుగులేయాలంటే తొలుత ఆ దేశ విద్యావ్యవస్థ పటిష్టంగా ఉండాలి. కులం, స్థాయి, స్థానికత ఆధారంగా పిల్లల విద్యా హక్కులో వ్యత్యాసం ఉండకూడదు. కానీ మన సమాజంలో సంపన్నుల పిల్లలకు లభించే అవకాశాలు పేద, మధ్య తరగతి పిల్లలకు లభించడం లేదు. సామాజిక న్యాయం అందడమంటే.. సమానవకాశాలు కల్పించబడాలి. ప్రతిభ ఉన్న ప్రతి ఒక్కరూ ఆదాయం, లింగం, కులం, స్థానికత సంబంధం లేకుండా ఉన్నత స్థాయికి ఎదగగలగాలి.

ఆటపాటలు, రచనలు, మాటలు, విజ్ఞాన వినోదాలు, శాస్త్రీయ ప్రతిభ వంటి ప్రక్రియల్లో పాలుపంచుకునే వెసులుబాటు మనదేశంలో ఎంతమంది పిల్లలకు ఉంది? ఈ ప్రశ్న వేసుకుంటున్నప్పుడే మన కళ్లముందు సమాధానం కనపడుతుంది.

బీహార్, ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలల్లో 12 - 14 ఏళ్ల మధ్య వయసు పిల్లలను రీసెర్చి విద్యార్థులు కలిసినప్పుడు ఎన్నో విషయాలు బయటపడ్డాయి. 'మేము బీహార్‌లో మొత్తం 806 మంది విద్యార్థులతో మాట్లాడాం. గ్రామీణ ప్రాంతంలో 410, పాట్నా మురికివాడల్లో 103 మంది, ఢిల్లీ మురికివాడల్లో 293 మంది ప్రభుత్వ స్కూళ్లకు వెళ్లే పిల్లలను కలిసి చిత్రలేఖనం, క్రీడలు, పాటలు, థియేటర్ అనుభవం, చదరంగం, కోడింగ్, శాస్త్రీయ గణితం వంటి 8 విభిన్న క్రియల్లో వారి ప్రవేశం గురించి అడిగాం. అలాగే కెరీర్ ప్రాధాన్యత, ప్రతిభను కనబరిచే కార్యక్రమాల్లో పాల్గొనడం మీకు ఇష్టమేనా అని కూడా ప్రశ్నించాం.

బీహార్ విద్యార్థుల్లో 42 శాతం మంది ఈ అంశాల్లో చాలా తక్కువగా పాల్గొంటున్నట్లు చెప్పారు. మిగిలిన వారు సున్నా భాగస్వామ్యం అంటే మేం అడిగిన ఏ ప్రక్రియల్లోనూ తమకు పాల్గొనే అవకాశం లేదని చెప్పారు. పాఠశాల లోపలా, బయటా ఇదే పరిస్థితి ఉందని మాకు తెలిసింది. ఒక్కో విభాగం వారిగా పరిశీలించినప్పుడు 80 శాతం మంది విద్యార్థులు చిత్రలేఖనంలో ఒకటి, రెడుసార్లు భాగస్వామ్యమైనట్లు గుర్తు చేసుకున్నారు. కొంతమంది ఒకసారి పాటల కార్యక్రమంలో పాల్గొన్నామని చెప్పారు. ఢిల్లీ మురికివాడల విద్యార్థుల్లో 24 శాతం మంది ఎందులోనూ పాల్గొనలేదు. అన్ని ప్రక్రియల్లో పాలుపంచుకున్న విద్యార్థులు అసలు లేనేలేరు.

ఉన్నత స్థాయి అలా ఉంచి సాధారణ స్థాయి ప్రక్రియల్లో కూడా అందరి పిల్లలకు సమాన అవకాశాలు లేవు. పోటీకి సిద్ధమయ్యే శిక్షణే లేదు. ప్రతి ప్రక్రియలో భాగస్వామ్యమైన పిల్లల సగటు స్కోర్ చూస్తే... బీహార్‌లో 34 శాతం మంది పిల్లలు నమూనా ప్రవేశ స్థాయి పోటీకి ఒకసారి మాత్రమే భాగస్వామ్యం కలిగివున్నారు. మిగిలిన 66 శాతం మందికి ఆ అవకాశం కూడా లేదు. ఢిల్లీలో 59 శాతం మంది క్రీడా పోటీల్లో ఒకసారి కూడా ప్రవేశించలేదు. 88 శాతం మంది చదరంగం, మేథో గణితంలో ప్రవేశించలేదని చెప్పారు. మరి ఈ పిల్లల ప్రతిభ ఎలా కనుగొనబడుతుంది?

ప్రతిభకు కొలమానం ఏంటి?

లింగం, కుల అంతరాలు ప్రతిభను వెలికితీయడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి. అలాగే చాలా చాలా తక్కువ స్థాయి భాగస్వామ్యంలో బాలికలు ఉన్నారు. పాటలు, కథలు రాయడం వంటి ప్రత్యేక కార్యకలాపాల్లో కూడా అబ్బాయిల కంటే అమ్మాయిలు తక్కువగా పాల్గొంటున్నట్లు చెప్పారు. ఎక్కువ పోటీల్లో పాల్గొనే వారు చాలా అరుదుగా ఉంటే ప్రాథమిక స్థాయి పోటీల్లో పాల్గొనే వారిలో కూడా చాలా తక్కువమందే ఉన్నత స్థాయి పోటీలకు వెళుతున్నారు. ఉపాధ్యాయులు తమ పాఠశాల విద్యార్థులు వివిధ రంగాల్లో రాణించాలని కోరుకుంటున్నా అందుకు తగ్గ అవకాశాలు లేవు. బీహార్, ఢిల్లీ పాఠశాలలో పరిశీలించినప్పుడు ఏ ఒక్క పిల్లవాడు కళల ప్రపంచంలో అడుగుపెట్టలేదు. అలాగే క్రీడలు, క్రోడింగ్ వంటి ఇతర మార్గాల్లో కూడా రాణించడం లేదు.

మన చుట్టూ ఉన్న వందల, వేల మందిలో తమలో దాగున్న ప్రతిభ వారికే తెలియదు. ప్రతిభను గుర్తించడం, దాన్ని అభివృద్ధి చెందించే సాధనాలు అభివృద్ధి చెందని కారణంగా దేశం దాని నిజమైన సామర్థ్యం కంటే చాలా తక్కువ స్థాయిలో ఉంది. ఇక్కడ ఈ పిల్లలంతా ఇష్టం లేక పాల్గొనకపోవడం కాదు.. అవకాశాలు లేక, రాక వారంతా పోటీలకు దూరంగా ఉంటున్నారు. ఒకవేళ పోటీల్లో పాల్గొనే అవకాశం ఇచ్చినట్లైతే మూడింట రెండొంతుల మంది ఆసక్తిగా ఉన్నట్లు చెప్పారు.

ప్రతిభ విలువ పడిపోతోంది..

అవకాశాలు లేక ప్రతిభ విలువ పడిపోతోంది. పేదరికం కొనసాగుతున్న ఎన్నో కుటుంబాల పిల్లలు తమ ప్రతిభను వ్యక్తం చేయలేకపోతున్నారు. చిత్రలేఖనం వంటి సాధారణ ప్రక్రియలో పిల్లల భాగస్వామ్యం లేకపోతే వారిలో దాగున్న కళాకారుడిని ఎలా గుర్తించగలుగుతాం? అసలు తనలో ప్రతిభ ఉందని ఆ పిల్లలకెలా తెలుస్తుంది? అథ్లెటిక్ పోటీల్లో ఉన్నత స్థాయి ప్రతిభ చూపే వరకు తానొక స్టార్ అథ్లెటిక్‌గా మారగలనని ఓ క్రీడాకారిణికి ఎలా తెలుస్తుంది?

ఒక వ్యక్తి తనకు నచ్చిన మార్గంలో ముందుకు సాగే సరైన మార్గం లేకపోవడంలో తప్పెవరిది? ప్రభుత్వాలే దీనికి పూర్తి బాధ్యత వహించాలి. వ్యక్తుల అవకాశాలను దోచుకునే విధానాల నుంచి ఇప్పటికైనా బయటపడాలి. పరిశోధన, అభ్యాసనం రెండూ ఒకే సవాలుగా ఎదగాలి. అప్పుడే దేశ నిజమైన సామర్థ్యం తెలుస్తుంది..

నాని ఎమోషనల్ ట్వీట్

ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా స్టార్‌గా ఎదిగిన హీరోలలో నాని ఒకరు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టి.. స్టార్ హీరోగా ఎదిగాడు. శుక్రవారం నాని పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు బర్త్‌డేను ఘనంగా సెలబ్రేట్ చేసుకుంటున్నారు. పలువురు సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా విష్ చేశారు. ఈ క్రమంలో నాని ట్విటర్‌లో ఎమోషనలయ్యాడు. 1984 ఫిబ్రవరి 24 శుక్రవారం నేను రిలీజయ్యాను (జన్మించాను). గత పదిహేనేళ్లలో ఎన్నోసార్లు పుడుతూనే ఉన్నాను. ఈసారి వచ్చిన శుక్రవారం బర్త్‌డేలాగే మీ ప్రేమానురాగాలతో మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలనుకుంటున్నాను' అని రాసుకొచ్చాడు. సినిమా అంటే నానికి ఎంత ప్రేమో ఈ ఒక్క ట్వీట్‌తో అర్థమవుతోంది. ఈ ట్వీట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది.

హాలీవుడ్ చిత్రాల్లో నటించాలనుంది..

'**ఆ**ర్ఆర్ఆర్ సినిమా కోసం ఎంతో కష్టపడ్డాం. నాటు నాటు పాటను ఉక్రెయిన్‌లోని అందమైన లొకేషన్లలో తీశాం. షూటింగ్ పూర్తి చేసుకుని ఇండియాకు వచ్చిన తర్వాత కూడా ఒక టూరిస్ట్‌గా మళ్లీ ఉక్రెయిన్ కు వెళ్లాలనిపించింది. నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డు వస్తే ఒక భారతీయుడిగా ఎంతో గర్వపడతాను. ఆస్కార్ అవార్డుల స్థాయికి భారతీయ సినిమాలు వస్తుండటం చాలా సంతోషంగా ఉంది. సినిమాకు భాష ఉండదు. కేవలం భావోద్వేగాలు మాత్రమే ఉంటాయి. సినిమా నవ్విస్తుంది.. ఏడిపిస్తుంది.. డ్యాన్స్ చేయిస్తుంది.. భయపెడుతుంది కూడా. ఇలా అన్ని చేయిస్తుందని రాజమౌళి చెప్పేవారు. కోవిడ్ సమయంలో భారతీయ సినిమాలను ప్రపంచవ్యాప్తంగా చూశారు. నేను కేవలం భారతీయ సినిమాలే కాకుండా.. హాలీవుడ్ చిత్రాలు కూడా చేయాలనుకుంటున్నాను' అంటున్నారు రామ్ చరణ్. అమెరికాలోని ప్రముఖ ఛానల్ అమెరికన్ బ్రాడ్ కాస్టింగ్ కంపెనీలో ప్రసారమయ్యే గుడ్ మార్నింగ్ అమెరికా షోకు అతిథిగా వెళ్లిన ఆయన ఈ కార్యక్రమంలో పైవిధంగా స్పందించారు.

రావు రమేశ్ కథా నాయకుడిగా ...

విలక్షణ నటుడు రావు రమేష్ హీరోగా మారాడు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'మారుతి నగర్ సుబ్రహ్మణ్యం'. పీబీఆర్ సినిమాస్ సంస్థ ప్రొడక్షన్ నంబర్ 2గా రూపొందిస్తున్న ఈ చిత్రంలో నటి ఇంద్రజ కీలక పాత్ర పోషిస్తున్నారు. లక్షణ్ కార్య దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. వినోదాత్మక కుటుంబ కథా నేపథ్యంలో చిత్రం తీస్తున్నారు. రావు రమేష్ లీడ్ రోల్‌గా నటిస్తున్నారు. నడి వయసులో ఉన్న ఒక మధ్య తరగతి నిరుద్యోగి జీవితంలో క్షణ క్షణం జరిగే ట్విస్టులను సినిమా తీస్తున్నారు. రెండు గంటల పాటు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుందని మేకర్స్ అంటున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. మార్చి నుంచి రెగ్యులర్ షూటింగ్ జరగనుంది.

ఎస్వీ సినిమాస్ 'నేనే నా'

ఎస్వీ సినిమాస్ తమిళ చిత్రసీమలో ప్రసిద్ధ నిర్మాణ, పంపిణీ సంస్థలలో ఒకటి. త్వరలో తెలుగు పరిశ్రమలోకి తొలి అడుగు వేస్తోంది. రెజీనా కసాండ్రా ప్రధాన పాత్రలో, 'నిను వీడని నీడను నేనే' ఫేమ్ కార్తీక్ రాజు దర్శకత్వంలో, ఆపిల్ ట్రీ స్టూడియోస్ రాజ్ శేఖర్ వర్మ నిర్మించిన 'నేనే నా' చిత్ర ప్రపంచవ్యాప్త థియేట్రికల్ అండ్ నాన్-థియేట్రికల్ రైట్స్‌ని ఎస్వీ సినిమాస్ దక్కించుకుంది. ఇది 1920, ప్రస్తుతం జరిగే విషయాల నేపథ్యంలో తెరకెక్కిన ఫాంటసీ-అడ్వెంచర్ థ్రిల్లర్. రెజీనా కసాండ్రా ఒక పురావస్తు శాస్త్రవేత్త పాత్రను పోషించింది. ఆమె కొన్ని ప్రత్యేకమైన పురాతన వస్తువులను వెలికితీసే సమయంలో మిస్టీరియస్ సంఘటనలు చోటు చేసుకుంటాయి. రెజినా ద్విపాత్రాభినయం చేసిన ఈ మూవీలో వెన్నెల కిషోర్, తాగుబోతు రమేష్, అక్షర గౌడ, జయప్రకాష్ తదితరులు ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. సామ్ సిఎస్ సంగీతం సమకూరుస్తున్న ఈ చిత్రానికి గోకుల్ బెనోయ్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. 'నేనే నా' చిత్రం వేసవిలో విడుదలకు సిద్ధంగా ఉంది.

ఆద్యా పాత్ర పూర్తి

ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న సినిమా 'సలార్'. శ్రుతిహాసన్ హీరోయిన్‌గా నటిస్తుంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా హీరోయిన్‌పై చిత్రీకరణ పూర్తయ్యింది. ఈ సందర్భంగా ప్రశాంత్ నీల్‌తో దిగిన ఓ ఫోటోను పోస్ట్ చేస్తూ మేకర్స్‌కు కృతజ్ఞతలు తెలిపింది. 'థాంక్యూ ప్రశాంత్ సార్.. నన్ను మీ ఆద్యాగా మార్చినందుకు. మీ అందరితో కలిసి సినిమాలో పనిచేయడం చాలా హ్యాపీ' అంటూ శ్రుతి తన పోస్ట్‌లో పేర్కొంది.

అప్పుడు ధోని.. ఇప్పుడు హర్మన్..

కెప్టెన్స్ రనౌట్స్‌తో ఫలితం తారుమారు

(ప్రజాశక్తి స్పోర్ట్స్ డెస్క్)

భావోద్వేగానికి గురౌతున్న హర్మన్

ఐసిసి ప్రపంచకప్ టోర్నీల్లో భారతజట్టు సెమీ ఫైనల్లో ఓడిన సందర్భాలు ఎన్నో ఉన్నా.. విజయా నికి చేరువగా వచ్చి.. కెప్టెన్ రనౌట్ అవ్వడం ద్వారా ఓడిన సందర్భాలు ఏవైనా ఉన్నాయా? అంటే.. ముందుగా గుర్తుకు వచ్చేది 2019 వన్డే ప్రపంచకప్‌లో మహేంద్రసింగ్ ధోనీ రనౌట్. ఆ తర్వాత టి20 మహిళల ప్రపంచకప్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ రనౌట్. ఇదే విషయాన్ని మాజీ క్రికెటర్లు సోషల్ మీడియా వేదికగా తమ తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ రెండు సందర్భాల్లోనూ సెమీస్‌లో టీమిండియా విజయానికి చేరువగా వచ్చి ఓటమిపాలైంది. గురువారం ఆస్ట్రేలియా మహిళలతో జరిగిన టి20 ప్రపంచకప్ సెమీస్‌లో.. 173పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో.. భారత మహిళల జట్టు 14.3ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 133పరుగులు చేసి సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించేలా కనిపించింది. ఆ దశలో గార్డినర్ వేసిన బంతిని కొట్టిన హర్మన్ తొలి పరుగును సునాయాసంగానే పూర్తి చేసి రెండో పరుగును పూర్తిచేస్తూ.. క్రీజ్ దగ్గర బ్యాట్‌ను ఆనించినా.. దానిని క్రీజ్‌లోకి నెట్టడంలో విఫలమైంది. కెప్టెన్ హర్మన్ రనౌట్ కావడం.. ఫలితాన్ని తారుమారు కావడం రెప్పపాటులో జరిపోయాయి. హర్మన్ రనౌట్ అయ్యే సమయానికి టీమిండియా విజయానికి 32బంతుల్లో 40పరుగులు చేయాల్సి ఉన్నా.. ఆ మ్యాచ్‌లో ఐదు పరుగుల తేడాతో టీమిండియా ఓటమిపాలైంది. దీంతో అభిమానులను తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. ఇక 2019 ఐసిసి వన్డే ప్రపంచకప్ సెమీస్‌లో న్యూజిలాండ్ నిర్దేశించిన 240పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో 49వ ఓవర్‌లో ధోనీ రనౌట్ అయ్యేవరకు విజయావకాశాలు టీమిండియా పక్షానే ఉన్నాయి. ధోనీ రెండో పరుగును పూర్తి చేసే క్రమంలో రనౌట్ కావడంతో మ్యాచ్ ఫలితం మారిపోయింది. ప్రస్తుతం హర్మన్ ప్రీత్ కౌర్ భావోద్వేగానికి గురైన ఫొటోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి.

దక్షిణాఫ్రికా మహిళల సంచలనం

సెమీస్‌లో ఇంగ్లండ్‌పై ఆరు పరుగుల తేడాతో గెలుపు

26న టైటిల్‌కై ఆసీస్‌తో ఢీ

కేప్‌టౌన్: ఐసిసి మహిళల టి20 ప్రపంచకప్‌లో ఆతిథ్య దక్షిణాఫ్రికా జట్టు పెను సంచలనాన్ని నమోదు చేసింది. శుక్రవారం జరిగిన రెండో సెమీఫైనల్లో టైటిల్ ఫేవరెట్ ఇంగ్లండ్‌పై ఆరు పరుగుల విజయాన్ని నమోదు చేసుకుంది. దీంతో టి20 ప్రపంచకప్ చరిత్రలో తొలిసారి దక్షిణాఫ్రికా మహిళలజట్టు ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఈ టోర్నీలో ఆతిథ్య జట్టు అత్యుత్తమ ప్రదర్శన 2014లో సెమీస్‌కు చేరడమే. శుక్రవారం జరిగిన సెమీస్ పోటీలో ఇంగ్లండ్ విజయం నల్లేరుమీద నడకేనని భావించినా.. అందరి అంచనాలను తలక్రిందులు చేస్తూ దక్షిణాఫ్రికా మహిళలజట్టు చిరస్మరణీయ విజయాన్ని సొంతం చేసుకుంది. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 164పరుగులు చేసింది. ఓపెనర్లు వోల్వ్‌డాట్(53), బ్రిట్స్(68) అర్ధసెంచరీలతో మెరిసారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 96పరుగులు జతచేశారు. ఆ తర్వాత కాప్(27) మాత్రమే బ్యాటింగ్ లో రాణించింది. ఎక్లేస్టోన్‌కు మూడు వికెట్లు దక్కాయి. ఛేదనలో ఇంగ్లండ్ ఓపెనర్లు వాట్(34), డంక్లే(28), బ్రంట్(40), నైట్(31) రాణించినా.. చివర్లో ఒత్తిడికి గురై వరుసగా వికెట్లు కోల్పోయింది. దీంతో నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 8వికెట్లు కోల్పోయి 158పరుగులే చేయగల్గింది. ఖాకాకు నాలుగు, ఇస్మాయిల్‌కు మూడు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బ్రిట్స్‌కు లభించింది. దీంతో దక్షిణాఫ్రికా మహిళలజట్టు చరిత్రలో తొలిసారి ఫైనల్లోకి దూసుకెళ్లగా.. ఆదివారం జరిగే ఫైనల్లో దక్షిణాఫ్రికా జట్టు 5సార్లు టి20 ఛాంపియన్ ఆస్ట్రేలియాతో తలపడనుంది.

బ్రూక్‌కు అత్యుత్తమ సగటు



వెల్లింగ్టన్: ఇంగ్లండ్ క్రికెటర్ హ్యారీ బ్రూక్స్ టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఇప్పటి వరకు ఎవరూ సాధించలేని రికార్డు సగటును నెల కొల్పాడు. తొలి ఆరు టెస్టుల్లో తొమ్మిది ఇన్నింగ్స్‌లో నాలుగు సెంచరీల సాయంతో 807పరుగులు చేసాడు. దీంతో అతని బ్యాటింగ్ సగటు 100.88కు పైగా నమోదైంది. దీంతో 145 ఏళ్ల టెస్టు క్రికెట్ చరిత్రలో.. ఓ క్రికెటర్ తాను ఆడిన తొలి 9 ఇన్నింగ్స్‌ల్లో ఎనిమిది వందలకు పైగా పరుగులు కొట్టిన తొలి బ్యాటర్‌గా బ్రూక్ నిలిచాడు. ఈ క్రమంలో వినోద్ కాంబ్లీ (798 పరుగులు) పేరిట ఉన్న రికార్డును తిరగరాసాడు. న్యూజిలాండ్‌తో ప్రారంభమైన రెండో టెస్ట్‌లో ఇంగ్లండ్ తొలిరోజు ఆట ముగిసే సమయానికి 3వికెట్ల నష్టానికి 315పరుగులు చేసింది.

మూడో టెస్టుకు కమిన్స్ దూరం

ఇండోర్: ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్.. ఇండోర్‌లో జరిగే మూడో టెస్టుకు దూరమయ్యాడు. వ్యక్తిగత కారణాలతో రెండో టెస్టు ముగిసిన అనంతరం ఆస్ట్రేలియాకు బయల్దేరిన కమిన్స్.. మూడో టెస్టు ప్రారంభం నాటికి తిరిగి భారత్‌కు చేరుకోవడం కష్టమేనని క్రికెట్ ఆస్ట్రేలియా(సిఏ) శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. అలాగే ఇండోర్ వేదికగా మార్చి ఒకటి నుంచి జరిగే మూడో టెస్టుకు స్టీవ్ స్మిత్ సారథ్య బాధ్యతలు నిర్వర్తిస్తాడని ఆ ప్రకటనలో వెల్లడించింది. కమిన్స్.. తన తల్లి ఆరోగ్యం బాగోలేదని బోర్డుకు తెలిపాడని, క్రికెట్ ఆస్ట్రేలియా, జట్టు సభ్యుల నుంచి తనకు మద్దతు లభించిందని, దానికి అతడు కృతజ్ఞతలు తెలిపాడని సిఏ తెలిపింది. స్మిత్ కూడా కుటుంబ సభ్యులతో కలిసి ప్రస్తుతం దుబాయ్ లో ఉన్నా.. మూడో టెస్ట్ ప్రారంభం నాటికి భారత్‌కు చేరుకోనున్నాడు.

నాగపూర్, ఢిల్లీ పిచ్‌లు యావరేజ్ రేటింగ్: ఐసిసి

నాగపూర్, ఢిల్లీ టెస్టు పిచ్‌లకు అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) రేటింగ్స్ ప్రకటించింది. ఈ రెండు పిచ్‌లకు యావరేజ్(సగటు) రేటింగ్ ఇచ్చింది. ఈ విషయాన్ని సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్ పత్రిక ఓ కథనంలో పేర్కొంది. ఐసిసి మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్(జింబాబ్వే) ఈ రిపోర్టును ఇచ్చినట్లు ప్రచురించింది. టెస్ట్ సిరీస్ ప్రారంభానికి ముందు ఇరుజట్ల ప్రదర్శనపై భారీ అంచనాలున్నా.. తొలి రెండు టెస్ట్‌ల ఫలితాలు మూడు రోజుల్లోనే రావడంతో ఐసిసి ఈ రెండు పిచ్‌ల నాణ్యతపై రేటింగ్‌ను ప్రకటించాల్సి వచ్చినట్లు పేర్కొంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68